ప్రతిపక్షం

www.prathipaksham.in

ఆదివారం 08.03.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 347 పేజీలు:10 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu

టీ20 ప్రపంచ కప్ టోర్నీ ఫైనల్ నేడే 10

> శాంతియుత మార్గాల ద్వారానే సమస్య పరిష్కారమవుతుందని బలంగా నమ్మే దేశం మనది. శాంతియుత పోరాటంతో మహాత్మా గాంధీ ఒక యుద్ధాన్ని జయించి దేశానికి స్వాతంత్ర్యం తెచ్చారు. ఎంత పెద్ద సమస్య అయినా చర్చల ద్వారానే పరిష్కారం అవుతుంది. దేశాల మధ్య యుద్ధాలు జరిగితే చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకుంటున్న పరిస్థితి ఈరోజుల్లో ఉంది. అజ్ఞాతంలో ఉన్న గణపతితో సహా ఇతర మావోయిస్టులు కూడా లొంగిపోవాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా పిలుపునిస్తున్నా. మీ సమస్యలు పరిష్కరించే బాధ్యత మాది. ప్రజలతో మమేకమై ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురండి.
>
> -ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

మీ పునరావాసం మా బాధ్యత!

మావోయిస్టు అగ్రనేత గణపతికి సీఎం హామీ

మావోయిస్టులపై ఉన్న కేసుల ఎత్తివేతకు ప్రభుత్వం సిద్ధం

- హింస ద్వారా సమస్యలు పరిష్కారం కావు
- ప్రజాస్వామ్య బద్ధంగా సమస్యలు పరిష్కరించుకుందాం
- బుల్లెట్ ను వదిలి బ్యాలెట్‌ను పట్టాలి
- ప్రజలతో మమేకమై ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురండి
- మావోలకు సీఎం రేవంత్ రెడ్డి పిలుపు
- ఐసీసీసీలో 130 మంది మావోయిస్టుల లొంగుబాటు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, మార్చి 7: బుల్లెట్ ను వదిలి బ్యాలెట్ ను పట్టాలని, ప్రజల్లో ఉండాలని మావోయిస్టులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్రంలో హింస కుదరదని, హింస ద్వారా సమస్యలు పరిష్కారం కావని తేల్చి చెప్పారు. సమస్యలను ప్రజాస్వామ్యబద్దంగా పరిష్కరించుకుందామన్నారు. ఆయుధాలతో లొంగిపోతే మావోయిస్టులకు అన్ని విధాలుగా ప్రభుత్వం సహకరిస్తుందని హామీ ఇచ్చారు. మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిసి తెలంగాణ పునర్ నిర్మాణంలో భాగస్వాములు కావాలని రేవంత్ కోరారు. నక్సలైట్ల పట్ల ప్రభుత్వం సానుభూతితో ఉందని సీఎం తెలిపారు. చట్ట పరిధిలో ఎత్తివేయడానికి అవకాశం ఉన్న కేసులను ఎత్తివేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. నక్సలైట్లపై ఉన్న కేసులు ఎత్తివేసే అంశాన్ని పరిశీలించడానికి కమిటీ ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్ ప్రకటించారు. శనివారం నాడు ఐసీసీసీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ 130 మంది మావోయిస్టులు తన లొంగిపోయారని తెలిపారు. జన జీవన స్రవంతిలో కలవాలని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు ఆయుధాలతో సహా మావోయిస్టులు లొంగిపోయారని రేవంత్ తెలిపారు. వారి ప్రాణాలకు ఎలాంటి హాని కలగకుండా వారికి ఆర్థిక, ఇతర వసతులు ప్రభుత్వం కల్పిస్తుందని వారిలో నమ్మకం కలిగించిన పోలీసు ఉన్నతాధికారులను సీఎం రేవంత్ అభినందించారు.

శాంతియుత మార్గాల ద్వారానే సమస్య పరిష్కారం..

"శాంతియుత మార్గాల ద్వారానే సమస్య పరిష్కారమవుతుందని బలంగా నమ్మే దేశం మనదని సీఎం తెలిపారు. శాంతియుత పోరాటంతో మహాత్మా గాంధీ ఒక యుద్ధాన్ని జయించి

...:: మిగతా 2లో

గద్దర్ అవార్డులు

2025 చిత్రాలకు ప్రకటించిన ప్రభుత్వం

- చిరంజీవికి 'ఎన్టీఆర్ నేషనల్' అవార్డ్
- కమల్ హాసన్ కు పైడి జయరాజ్ అవార్డు
- ఉత్తమ చిత్రం 'రాజు వెడ్స్ రాంబాయి'
- ఉత్తమ నటుడు నాగచైతన్య (తండేల్)
- ఉత్తమ నటి రష్మిక మందన (ది గర్ల్ ఫ్రెండ్)

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, మార్చి 7: 2025 సంవత్సరానికి గాను గద్దర్ సినీ అవార్డులను తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. గతేడాది ప్రారంభమైన ఈ పురస్కారాల పరంపర, ఈసారి మరిన్ని ప్రతిష్ఠాత్మక విభాగాలతో ముందుకు వచ్చింది. ముఖ్యంగా మెగాస్టార్ చిరంజీవికి 'ఎన్టీఆర్ నేషనల్' అవార్డు ప్రకటించడం విశేషం. తెలంగాణ ప్రభుత్వం నంది అవార్డుల స్థానంలో సినీ కళాకారులకు గద్దర్ అవార్డులను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. దాదాపు దశాబ్ద కాలంపాటు నిలిచిపోయిన ప్రభుత్వ పురస్కారాల సంప్రదాయం రేవంత్‌రెడ్డి సర్కార్‌లో మళ్లీ ప్రారంభం కావడంతో కళాకారులకు ఎంతగానో ప్రోత్సాహంగా ఉందని సినీ ప్రముఖులు చెబుతున్నారు. ఈసారి ఉగాది రోజున సినీతారల సందడితో ఈ వేడుకను అత్యంత వైభవంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్వహించనుంది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్' రెండో విడత విజేతలను జ్యూరీ కమిటీ ప్రకటించింది. ఈ ఏడాది అవార్డుల్లో దిగ్గజ నటీనటులు, సాంకేతిక నిపుణులకు పెద్దపీట వేశారు. ఈ ఏడాది వివిధ విభాగాల్లో ఎంపికైన ప్రముఖుల జాబితాను ప్రకటించింది. గద్దర్ అవార్డులపై సినీరంగం హర్షం వ్యక్తం చేస్తోంది. ఈ అవార్డులను మార్చి 19న ఉగాది పర్వదినం సందర్భంగా అత్యంత వైభవంగా నిర్వహించే వేడుకలో ప్రదానం చేయనున్నారు. స్పెషల్ జ్యూరీ చైర్మన్‌గా ప్రముఖ నిర్మాత, దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ నేతృత్వంలోని కమిటీ ఈ అవార్డులను ఎంపిక చేసింది.

స్పెషల్ అవార్డులు

ఎన్టీఆర్ జాతీయ అవార్డు	చిరంజీవి
రఘుపతి వెంకయ్య అవార్డు	రమేశ్ ప్రసాద్
పైడి జయరాజ్ అవార్డు	కమల్ హాసన్
నాగిరెడ్డి చక్రపాణి అవార్డు	అశ్వనీదత్
ఏఎన్ఆర్ అవార్డు	జయసుధ
టీఎల్.కాంతారావు అవార్డు	నారాయణ మూర్తి
సి.నారాయణ రెడ్డి అవార్డు	సుద్దాల అశోక్ తేజ
బీఎన్ రెడ్డి అవార్డు	సింగీతం శ్రీనివాసరావు

రంజాన్ వేళలు

ఇఫ్తార్ – 6.30 (ఆదివారం సాయంత్రం)

సహర్ – 5.07 (సోమవారం ఉదయం)

చైనాతో భారత్ పోటీ పడగలదు

సరైన విధానాలు, విజన్‌తో భారత్ ఎలక్ట్రిక్ మొబిలిటీలో చైనాతో పోటీ పడగలదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తెలిపారు. యుద్ధాలు ఎక్కువగా చైనా ఆధిపత్యం చెలాయించే బ్యాటరీ ఆప్టిక్స్, ఎలక్ట్రిక్ మోటార్లు వైపుకు వేగంగా మారుతున్నాయని అన్నారు.

9

బెంగాల్‌లో రాష్ట్రపతికి అవమానం

ఉత్తర బెంగాల్‌లో తాను ముఖ్య అతిథిగా హాజరు కావాల్సి ఉన్న అంతర్జాతీయ ఆదివాసీ సమావేశానికి అనుమతి నిరాకరించిన పశ్చిమ బెంగాల్ ప్రభుత్వంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శనివారం అసంతృప్తి వ్యక్తం చేశారు.

9



అనుమతి కోసం ఏ దేశంపై ఆధారపడలేదు

రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడానికి అనుమతి కోసం భారత్ ఎప్పుడూ ఏ దేశంపై ఆధారపడలేదని, భారత ఇంధన కొనుగోళ్లు జాతీయ ప్రయోజనాలకు అనుకూలంగా ఉంటాయని తెలిపారు

9

హైదరాబాద్‌ను క్లీన్ సిటీగా మార్చాలి

- ప్రతీరోజు చెత్త సేకరణ జరగాల్సిందే
- క్యూర్ పరిధిలో ఈవీ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించాలి
- కొత్త డంప్ యార్డులు అందుబాటులోకి తీసుకురండి
- మున్సిపల్ కమిషనర్లతో సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ప్రతిపక్షం, స్టేట్ బ్యూరో

హైదరాబాద్, మార్చి 7 : హైదరాబాద్ మహా నగరాన్ని క్లీన్ సిటీగా మార్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. 99రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శనివారం క్యూర్ పరిధిలోని

...:: మిగతా 2లో

మరిన్ని భీకర దాడులు చేస్తాం

- పొరుగు దేశాలకు క్షమాపణలు చెప్పి ఇరాన్ సరెండర్ అయింది
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్
- అమెరికాకు లొంగిపోయేది లేదు
- ట్రంప్ డిమాండ్ ను తిరస్కరించిన ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్

ప్రతిపక్షం నేషనల్ డెస్క్

ఇరాన్‌పై మరిన్ని భీకర దాడులు చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఇప్పటిదాకా మినహాయించిన ఇరాన్ ఏరియాలను కూడా ఇప్పుడు టార్గెట్ లోకి తీసుకోవాల్సి వస్తోందన్నారు. తాజాగా శనివారం ఉదయం పొరుగు దేశాలకు క్షమాపణలు చెబుతూ ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కీలక ప్రకటన విడుదల చేశారు. "నరకాన్ని మించిన కుంపటిలా మారిన ఇరాన్, ఇప్పుడు పశ్చిమాసియాలోని పొరుగుదేశాలకు క్షమాపణ చెప్పి సరెండర్ అయింది. ఇకపై దాడి చేయనని వాటికి మాట ఇచ్చింది. అమెరికా, ఇజ్రాయెల్ ఎడతెరిపి లేని దాడుల వల్లే ఈ వాగ్దానం చేసే స్థితికి ఇరాన్ చేరింది. మిడిల్ ఈస్ట్ ప్రాంతాన్ని చేతుల్లోకి తీసుకొని పాలించాలని ఇరాన్ భావిస్తోంది. మిడిల్ ఈస్ట్ దేశాల చేతిలో ఇరాన్ ఓడిపోవడం వేల ఏళ్ల చరిత్రలో ఇదే తొలిసారి.

అందుకే మిడిల్ ఈస్ట్ దేశాల వాళ్లు నాకు థ్యాంక్స్ చెప్పారు. యువర్ వెల్‌కమ్ అని నేను బదులిచ్చాను. మిడిల్ ఈస్ట్‌ను శాసించేంత

...:: మిగతా 2లో

వ్యవసాయ యాంత్రీకరణ సబ్సిడీ నిధులు నేరుగా రైతుల ఖాతాలోకి

- వచ్చే ఏడాది నుండి అమలు
- అందుకు విధివిధానాలు తయారుచేయాలి
- రైతు వేదికలపై రెడ్కో సహకారంతో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటుకు మంత్రి తుమ్మల ఆదేశాలు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, మార్చి 7: వచ్చే ఆర్థిక సంవత్సరం నుండి వ్యవసాయ యాంత్రీకరణకు సంబంధించిన సబ్సిడీ నిధులను నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లోకి బదిలీ చేసే విధానాన్ని అమలు చేసే అవకాశాలను పరిశీలించి, అవసరమైన విధివిధానాలను రూపొందించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులకు రాష్ట్ర వ్యవసాయశాఖ

...:: మిగతా 2లో

డాక్టర్ పొన్నం రవిచంద్ర 'ది ఫస్ట్ యాక్షన్ హీరో'కు గద్దర్ డాక్యుమెంటరీ పురస్కారం!

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందజేస్తున్న తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ లో కరీంనగర్ కు చెందిన డాక్టర్ పొన్నం రవిచంద్ర డాక్యుమెంటరీ విభాగంలో పురస్కారాన్ని సాధించారు. శనివారం హైదరాబాద్‌లో విలేకరుల సమావేశంలో 2025 తెలుగు సినిమాలవివిధ విభాగాలకు అవార్డులను ప్రకటించారు.

...:: 3లో

లక్ష ఇందిరమ్మ ఇండ్లకు నెలాఖరులోగా గృహప్రవేశాలు

- మంజూరు చేసిన అన్ని ఇండ్లు గ్రౌండింగ్ కావల్సిందే
- డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు లబ్దిదారులను గుర్తించండి
- మంజూరు చేసిన అన్ని ఇండ్లకు చెల్లింపులు జరపాలి
- ప్రజాపాలన ప్రగతి నివేదికపై మంత్రి పొంగులేటి వీడియో కాన్ఫరెన్స్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, మార్చి 7 : రాష్ట్రంలో ప్రతి పేదవాడి ఆత్మగౌరవానికి చిహ్నంగా నిలిచేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజాప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు చేస్తోందని, ఈ పథకం ఒక బెంచ్ మార్క్‌గా నిలవబోతోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఈ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటివరకు 3.60 లక్షల ఇండ్లను మంజూరు చేయగా ఇందులో లక్ష ఇండ్లకు ఈనెల 31వ తేదీలోగా గృహప్రవేశాలు జరగనున్నాయని తెలిపారు. ఇందుకోసం త్వరలోనే గృహప్రవేశాలకు అనుకూలమైన తేదీలను అధికారికంగా తెలియజేస్తామని తెలిపారు. ఇండ్లు మంజూరు చేసిన తర్వాత కూడా

...:: మిగతా 2లో

హైదరాబాద్‌ను క్లీన్ సిటీగా మార్చాలి

మొదటిపేజీ తరువాయి

ట్రై మున్సిపల్ కార్పొరేషన్స్ కు సంబంధించిన ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం పలు సూచనలు చేశారు. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో ప్రతీరోజు చెత్త సేకరణ జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. నగరంలో ప్రతీరోజు ఇంటింటికి చెత్త సేకరణ జరగాల్సిందేనని స్పష్టం చేశారు. చెత్త సేకరణకు సంబంధించి ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగించేలా ఇప్పటి నుంచే ప్రోత్సహించాలని సూచించారు. ఒక్కో వాహనానికి ఒక్కో ఏరియా చొప్పున కేటాయించి నిరంతరం పర్యవేక్షించాలన్నారు. నగరం పరిధి విస్తరించిన నేపథ్యంలో ఇప్పటికే కొత్తగా గుర్తించిన డంప్ యార్డులను వీలైనంత త్వరగా సిద్ధం చేసి అందుబాటులోకి తీసుకురావాలని సీఎం అధికారులను ఆదేశించారు. కార్పోరేషన్ల వారీగా దగ్గరలోని డంపింగ్ యార్డులకు చెత్తను తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంటింటి చెత్త సేకరణ సక్రమంగా జరిగేలా పర్యవేక్షించాల్సిన అవసరం ఉందన్నారు. నిర్మాణ వ్యర్థాలకు సంబంధించి అధికారులకు ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. క్యూర్ పరిధిలోని ట్రై మున్సిపల్ కార్పోరేషన్లలో నిర్మాణ వ్యర్థాలు ఎక్కడ పడితే అక్కడ డంప్ చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. నిర్మాణ వ్యర్థాల తరలింపు కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. అపరిశుభ్రత లేకుండా చూసుకోవడంతో పాటు దోమల నివారణకు చర్యలు చేపట్టాలని సీఎం అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధుల విషయంలో నగరవాసులకు సరైన వైద్యం అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. ఈ సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సీఎం సెక్రెటరీ మాణిక్ రాజ్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, సైబరాబద్ మున్సిపల్ కమిషనర్ శ్రీజన, మల్కాజ్ గిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

లక్ష ఇందిరమ్మ ఇండ్లకు నెలాఖరులోగా గృహప్రవేశాలు

మొదటిపేజీ తరువాయి

కొన్ని గ్రామాల్లో ఇప్పటికీ పూరిగుడిసెలు కనిపిస్తున్నాయని, అటువంటి కుటుంబాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి ఇళ్ల నిర్మాణంలో చేర్చాలని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వం ఇచ్చే ప్రతి ఇల్లు నిజంగా అవసరమైన వారికి చేరేలా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. శనివారం సచివాలయంలోని తన కార్యాలయం నుంచి ప్రజాపాలన ప్రగతి నివేదిక 99 రోజుల్లో చేపట్టవలసిన కార్యాచరణపై జిల్లా హౌసింగ్ పీడీలతో మంత్రి గారు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యంతో చేపట్టాలని ఆదేశించారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా మంజూరు చేసిన ఇండ్లలో 20 శాతం వరకు గ్రౌండింగ్ కాలేదని అలాంటి ఇళ్లకు సంబంధించి లబ్ధిదారుల సమ్మతి తీసుకుని స్థానిక ప్రజాప్రతినిధులు, ఇందిరమ్మ కమిటీల సూచనలతో మార్చి 31 లోపు అన్ని ఇండ్లు గ్రౌండింగ్ అయ్యేలా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం నిర్మాణం పూర్తికి దగ్గరగా ఉన్న ఇళ్లను సమర్థంగా సమన్వయం చేసుకొని జూన్ చివరినాటికి పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఏప్రిల్ నెలలో రెండవ దశ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసేనాటికి మొదటి దశ ఇందిరమ్మ ఇండ్లు కొలిక్కిరావాలని సూచించారు. ఇండ్ల నిర్మాణంలో ఉపయోగించే నిర్మాణ సామగ్రి ధరలు పెరగడం వల్ల లబ్ధిదారులపై అదనపు భారం పడకుండా జిల్లా స్థాయిలో ధరల నియంత్రణ కమిటీలు చురుకుగా పనిచేయాలని మంత్రి సూచించారు. అవసరమైతే జిల్లా కలెక్టర్లతో కలిసి సమీక్షించి సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ఇండ్ల నిర్మాణానికి అవసరమైన ఇటుకల సరఫరా పెంచేందుకు స్థానికంగా ఎస్ హెచ్ జి మహిళా సంఘాల ద్వారా బ్రిక్ యూనిట్లను ప్రోత్సహించాలని మంత్రి తెలిపారు. అవసరమైతే ప్రతి మండలంలో ఒకటి లేదా రెండు యూనిట్లు ఏర్పాటు చేయడం ద్వారా సరఫరా పెరిగి ధరలు నియంత్రణలో ఉండే అవకాశముందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల కోసం ఉచిత ఇసుక పంపిణీ చేస్తుందని లబ్ధిదారులకు ఎక్కడా సమస్య రాకుండా ఈ ఇసుక లభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో కొన్ని చోట్ల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసి ఒకటి లేదా రెండు విడతల చెల్లింపులు చేసిన తర్వాత వివిధ కారణాలతో చెల్లింపులు నిలిపివేయడం సరికాదన్నారు. ఇటువంటి చెల్లింపులను తక్షణమే క్లియర్ చేయాలని లేని పక్షంలో అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడానికి వెనకాడబోమని హెచ్చరించారు. ఏప్రిల్ నెల నుంచి మంజూరు చేసే రెండవ విడతలో ఇటువంటి పరిస్థితి పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. నిజమైన లబ్ధిదారుల ఇళ్లు ఎక్కడా ఆగిపోకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఏ స్థాయిలో నిర్మాణంలో ఉన్నా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు సంబంధించి లబ్ధిదారుల ఎంపికను కూడా మార్చి 31 లోపు పూర్తిచేయాలని మంత్రి ఆదేశించారు. ఇళ్ల స్థలం లేని పేద కుటుంబాలకు ఈ ఇండ్ల కేటాయింపులో ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఏ సంక్షేమ పథకం విజయవంతం కావాలంటే ముఖ్యమంత్రి, మంత్రి, కార్యదర్శి మాత్రమే ప్రయత్నించడం సరిపోదని, ఆ శాఖలోని ప్రతి అధికారి ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా పనిచేసినప్పుడే అది సాధ్యమవుతుందని మంత్రి పేర్కొన్నారు. అధికారుల సమిష్టి కృషి వల్లే రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకం దేశంలోనే ఉత్తమ పథకాలలో ఒకటిగా నిలిచిందని మంత్రి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం పేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవితం అందించే గొప్ప సంక్షేమ కార్యక్రమమని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వం, అధికారులు భాగస్వాములుగా ఉండటం గర్వకారణమని, ప్రజల జీవితాల్లో శాశ్వత మార్పు తీసుకురావడానికి ప్రతి అధికారి అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. 99 రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని హౌసింగ్ రంగంలో విజయవంతం చేయడానికి అధికారులు పూర్తి స్థాయిలో కృషి చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోరారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో హౌసింగ్ కార్యదర్శి విపి గౌతమ్ పాల్గొన్నారు.

అంజయ్యకు మంత్రి శ్రీనివాస్ గౌడ్ పరామర్శ

ప్రతిపక్షం, మొయినాబాద్, మార్చి 7 : మొయినాబాద్ మండల గౌడ సంఘం అధ్యక్షులు అంజయ్య గౌడ్ తండ్రి మృతి పట్ల తెలంగాణ రాష్ట్ర మాజీ ఎక్సైజ్ మంత్రి శ్రీనివాస్ గౌడ్ వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుని చిత్రపటానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అనిరుద్ గౌడ్, సుర్వి యాదయ్య గౌడ్, తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు బిక్షపతి గౌడ్, గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రేనట్ల మల్లేష్ గౌడ్, మొయినాబాద్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు వెంకట రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా భవన్ వద్ద ఉచిత వైఫై ఏర్పాటు

- పొదుపు సంఘాల మహిళలకు ఉపయోగపడేలా చర్యలు
- 19వ వార్డు కౌన్సిలర్ కల్లెంల జగపతి

ప్రతిపక్షం, మొయినాబాద్, మార్చి 7 : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు 19వ వార్డు కౌన్సిలర్ కల్లెంల జగపతి తన మొదటి హామీని అమలు చేశారు. గ్రామంలోని డ్వాక్రా గృహం వద్ద ఆసరా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం జరుగుతున్న సందర్భంగా అక్కడికి వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఉచిత వైఫై సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... పొదుపు సంఘాల మహిళలకు అవసరమైన సమాచారాన్ని సులభంగా పొందేందుకు, ఆన్‌లైన్ సేవలు వినియోగించుకునేందుకు ఈ ఉచిత వైఫై సేవ ఉపయోగపడుతుందని తెలిపారు. అలాగే గ్రామంలో ఎక్కడైనా అవసరం ఉన్న ప్రాంతాల్లో కూడా ఉచిత వైఫై సదుపాయాన్ని ఏర్పాటు చేయడానికి తాను సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజు, నాయకులు పాల్గొన్నారు.

మీ పునరావాసం మా బాధ్యత!

మొదటిపేజీ తరువాయి

దేశానికి స్వాతంత్ర్యం తెచ్చారని గుర్తు చేశారు. ఎంత పెద్ద సమస్య అయినా చర్చల ద్వారానే పరిష్కారం అవుతుందన్నారు. దేశాల మధ్య యుద్ధాలు జరిగితే చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకుంటున్న పరిస్థితి ఈరోజుల్లో ఉంది. అజ్ఞాతంలో ఉన్న గణపతితో సహా ఇతర మావోయిస్టులు కూడా లొంగిపోవాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా పిలుపునిస్తున్నా. మీ సమస్యలు పరిష్కరించే బాధ్యత మాది. ప్రజలతో మమేకమై ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురండి అంటూ రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

ఇటీవల లొంగిపోయిన దేవ్ జీ, దామోదర్, ఇతర కేంద్ర కమిటీ సభ్యులతో సమావేశమైనప్పుడు కొన్ని ప్రతిపాదనలు వారు నా ముందుంచారని తెలిపారు. సెంట్రల్ కమిటీ ప్రతిపాదనలు కేంద్ర హోంమంత్రి అమిత్ షా దృష్టికి తీసుకెళ్లా. అత్యాధునిక ఆయుధాలతో 130 మంది మావోయిస్టులు 124 ఆయుధాలతో లొంగిపోయారు. బుల్లెట్ ద్వారా కాదు బ్యాలెట్ ద్వారా సమస్యలు పరిష్కరించాలని నమ్మి ముందుకు వచ్చిన అందరికీ సీఎం అభినందనలు తెలిపారు.

2024 నుంచి ఇప్పటి వరకు 721 మంది లొంగుబాటు...

2024 జనవరి నుంచి ఇప్పటి వరకు తెలంగాణలో 721 మంది మావోయిస్టులు లొంగిపోయారు. లొంగిపోయిన నక్సలైట్లకు మెరుగైన వైద్య సేవలు అందించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. లొంగిపోయిన మావోయిస్టులకు మంచి ఆర్థిక ప్యాకేజీని పెంచి ఇచ్చే అంశంపై త్వరలోనే అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని సీఎం తెలిపారు. గతంలో ఒకేసారి ఇంతమంది మావోయిస్టులు ఆయుధాలతో సహా లొంగిపోయిన దాఖలాలు లేవు. లొంగిపోయిన వారికి ఇందిరమ్మ ఇండ్లతో పాటు మెరుగైన వైద్య సేవలు అందిస్తాం" అని సీఎం రేవంత్ హామీ ఇచ్చారు.

మంచి జీవితం గడిపేలా కృషి...

భారీ సంఖ్యలో మావోయిస్టులు లొంగిపోయేలా పోలీసులు కృషి చేశారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పోలీసులు నక్సలైట్లలో ఒక నమ్మకాన్ని కల్పించారని, లొంగిపోయిన వాళ్లు మంచి జీవితం గడిపేలా ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. అహింసా పద్ధతిలోనే బ్రిటీషర్లపై పోరాడి స్వాతంత్ర్యం తెచ్చుకున్న చరిత్ర మనదని, హింస, ఆయుధాలతో పోరాటం ఒక్కటే పరిష్కారం కాదని గాంధీ చాటి చెప్పారని అన్నారు. అణ్వాయుధాలు ఉన్న దేశాలు కూడా ఇవాళ చర్చల ద్వారా సమస్య పరిష్కరించుకుంటున్నాయని, ఇంకా అజ్ఞాతంలో ఉన్న నక్సలైట్లకు విజ్ఞప్తి చేస్తున్నానని, ప్రజలతో మమేకమై కలిసి ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని కోరారు.

అమిత్ షా సూచించారు ...

దేవ్‌జీ, ఆయన మిత్రబృందం కొన్ని ప్రతిపాదనలు చేశారన్న సీఎం తమ సమస్యలు పరిష్కరిస్తే లొంగిపోతామని చెప్పారుని గుర్తు చేశారు. రాష్ట్రస్థాయిలో మేం చేయగలిగింది చేస్తామని నక్సలైట్ నేతలతో చెప్పానని, నక్సలైట్ నేతల డిమాండ్లను కేంద్రహోంమంత్రితో చర్చించానని, లొంగిపోయిన వారి మెరుగైన జీవితానికి హామీ ఇవ్వాలని అమిత్ షా సూచించారని అన్నారు. అమిత్ షాతో చర్చల తర్వాత నక్సలైట్ నేతలతో మళ్లీ చర్చించానని, కేంద్రహోంమంత్రితో చర్చల సందేశాన్ని నక్సలైట్ నేతలకు వివరించానని, తమ చర్చల అనంతరం ఒకేసారి 130 మంది మావోయిస్టులు లొంగిపోయారని అన్నారు. ఒకేసారి ఇంతమంది మావోయిస్టులు ఏ రాష్ట్రంలోనూ లొంగిపోలేదని, ఇప్పటివరకు తెలంగాణలో 700 మంది మావోయిస్టులు లొంగిపోయారని వివరించారు.

హోదాలను బట్టి ప్యాకేజీ కల్పిస్తాం ....

లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాస ప్యాకేజీతో పాటు ఆరోగ్య భద్రత కార్డు కల్పిస్తామన్న రేవంత్ రెడ్డి నిమ్స్ వంటి ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు పొందే ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. మావోయిస్టుల హోదాలను బట్టి ప్యాకేజీ కల్పిస్తామని చెప్తున్నామని, ఇంటి స్థలం, ఇందిరమ్మ ఇల్లు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. రాష్ట్రంలో భూమి లభ్యత కష్టంగా ఉన్నందున సాగుభూమి ఇవ్వటంపై హామీ ఇవ్వలేనని, రాష్ట్రంలో హింసకు తావులేదని, అక్రమంగా ఆయుధాలు కలిగి ఉంటే సహించేది లేదని పేర్కొన్నారు.

రాజకీయాల్లోకి రావచ్చు ...

ఎత్తివేయగలిగే కేసులుంటే ప్రభుత్వం సానుకూలంగా ఉందని, కేసులు ఎత్తివేయడానికి ఉన్న అవకాశాలను పరిశీలిస్తామని, చట్టపరంగా ఎత్తివేయడానికి అవకాశమున్న కేసులను ఎత్తివేస్తామని రేవంత్ రెడ్డి తెలిపారు. తీవ్రమైన నేరాలు ఉంటే ప్రభుత్వాలు ఎత్తివేస్తే కోర్టులు ఊరుకోవని అన్నారు. వ్యక్తులు, వారిపై ఉన్న నేరాల తీవ్రతనుబట్టి పరిశీలిస్తామని, సాధారణ వ్యక్తుల చేతిలో ఆయుధాలు వద్దనేది ప్రభుత్వ పాలసీ అని, లొంగిపోయిన వాళ్లు రాజకీయాల్లోకి వస్తామన్నా స్వాగతిస్తామని సీఎం తెలిపారు. కొందరు ఇప్పటికే రాజకీయాల్లోకి వచ్చి ప్రజాప్రతినిధులు అయ్యారని, సీతక్కలాంటి వాళ్లు రాష్ట్రమంత్రి కూడా అయ్యారని గుర్తు చేశారు. కాంగ్రెస్‌లోకి వచ్చేవాళ్లు పీసీసీని కలిసి ఆసక్తి తెలియజేయవచ్చని అన్నారు.

డీజీపీ శివధర్ రెడ్డితో పాటు
డీఐజీ సుమతికి సీఎం అభినందనలు

మావోయిస్టు లొంగుబాటుకు సంబంధించి కీలక పరిణామం చోటుచేసుకుంది. బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో 130 మంది మావోయిస్టులు ఆయుధాలతో లొంగిపోయారు. మావోయిస్టులు 124 ఆయుధాలను అప్పగించారు. లొంగిపోయిన వారిలో ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు, ఒక రీజినల్ కమిటీ సభ్యుడు, పది మంది డివిజనల్ కమిటీ సభ్యులు, 46 మంది ఏరియా కమిటీ సభ్యులు, 70 మంది పార్టీ సభ్యులు ఉన్నారు. 130 మందిలో 125 మంది ఛత్తీస్‌గఢ్, 4గురు తెలంగాణ, ఒకరు ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారు ఉన్నారు. లొంగిపోయిన మావోయిస్టులు ఒక ఇన్‌సాస్ ఎల్ఎంజీ రైఫిల్, (31) ఏకే 47 రైఫిళ్లు, (21) ఇన్సాస్ రైఫిళ్లు, (20) ఎస్ఎల్ఆర్ రైఫిళ్లు, (18) 303 రైఫిళ్లు, 33 ఇతర తుపాకులను పోలీసులకు అప్పగించారు. భారీ ఎత్తున మావోయిస్టులు లొంగిపోయినందుకు డీజీపీ శివధర్ రెడ్డి, డీఐజీ సుమతిని సీఎం అభినందించారు.

గణపతికి రక్షణ కల్పిస్తాం....

మావోయిస్టు అగ్రనేత గణపతి అలియాస్ ముప్పాళ్ల లక్ష్మణ్ రావు సైతం లొంగిపోవాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. జనజీవన స్రవంతిలోకి రావాలంటూ మొదటిసారిగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆయన సూచించారు. గణపతి వయసు 70 ఏళ్లు ఉండొచ్చన్న సీఎం రేవంత్.. లక్ష్మణ్ రావు ఆరోగ్యం కూడా బాగోలేదని అధికారులు చెబుతున్నారని అన్నారు. ప్రభుత్వం ఆయనకు అవసరమైన సహకారం అందిస్తుందన్నారు. గణపతి సరెండర్ అయితే ఆయన పూర్తి భద్రత, బాధ్యత తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటుందని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

వ్యవసాయ యాంత్రీకరణ సబ్సిడీ నిధులు

నేరుగా రైతుల ఖాతాలోకి

మొదటిపేజీ తరువాయి

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. శనివారం హైదరాబాద్‌లో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో రానున్న ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై మంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రస్తుతం వ్యవసాయ యాంత్రికరణలో భాగంగా రైతులు కొనుగోళ్లు చేసిన పనిముట్లకు 40 శాతం సబ్సిడీ నిధులను సదరు కంపెనీలకు అందించే పద్ధతి ఉంది అలా కాక, వచ్చే ఆర్థిక సంవత్సరం నుండి సబ్సిడీ నిధులను నేరుగా రైతుల ఖాతాలోకి బదిలీ చేసే అవకాశాలను పరిశీలించి అందుకు తగ్గ విధివిధానాలను తయారు చేయాలన్నారు. రాష్ట్రంలో రైతులకు సబ్సిడీపై అందించే పచ్చిరొట్ట విత్తనాలను వచ్చే ఏప్రిల్ నెలాఖరు సిద్దంగా ఉంచుకోవాలని అందుకు తగ్గ ఏర్పాట్లు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతు వేదికలలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందించాలని, ఇందుకు రెడ్కో సంస్థ సహకారం తీసుకోవాలని అధికారులకు సూచించారు. మొదట ప్రయోగాత్మకంగా జంగారెడ్డిపల్లి మరియు జనంపేట రైతు వేదికలలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసి వాటి పనితీరును పరిశీలించిన తరువాత మొదటి దశలో రాష్ట్రంలోని 1600 రైతు వేదికలలో రెడ్కో ద్వారా సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. రానున్న ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రానికి అవసరమైన ఎరువులను ముందుగానే తెప్పించి నిల్వ ఉంచేందుకు ఇప్పటి నుంచే చర్యలు ప్రారంభించాలని మంత్రి అధికారులకు సూచించారు. ఎరువుల సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తిన కూడ ఇబ్బందులు తలెత్తకుండా రాష్ట్రానికి అవసరమైన ఎరువులను ముందుగానే సమకూర్చుకోవాలని తెలిపారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వ అధికారులతో నిరంతరం సంప్రదింపులు కొనసాగించాలని సూచించారు. ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రంలో వరి, పత్తి, మక్క వంటి ప్రధాన పంటల సాగు విస్తృతంగా జరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యంగా మక్క పంటకు వరి లేదా పత్తి పంటలతో పోలిస్తే యూరియా అవసరం దాదాపు మూడింతలు ఎక్కువగా ఉంటుందని చెప్పారు.

మరిన్ని భీకర దాడులు చేస్తాం

మొదటిపేజీ తరువాయి

బలమైన దేశం ఇరాన్ కాదు. రాబోయే కొన్ని దశాబ్దాల్లో సరెండర్ అయ్యే వరకు, లేదంటే పూర్తిగా పతనం అయ్యే వరకు పశ్చిమాసియాలో ఓడిపోయిన దేశంగా ఇరాన్ మిగిలిపోతుంది'' అని పేర్కొంటూ ట్రూత్ సోషల్‌లో ట్రంప్ పోస్ట్ చేశారు.

కువైట్‌పై ఇరాన్ డ్రోన్ దాడిలో సైనికుల మృతి

ఫిబ్రవరి 28 నుంచి ఇరాన్, అమెరికా ఇజ్రాయెల్ సైనిక ఘర్షణ జరుగుతోంది. ఈక్రమంలో కువైట్‌లోని అమెరికా సైనిక స్థావరానికి చెందిన కమాండ్ కంట్రోల్ సెంటర్‌పై డ్రోన్‌తో ఇరాన్ దాడి చేసింది. ఈ ఘటనలోనే ఆరుగురు అమెరికా సైనికులు చనిపోయారు. వీరిని నికోల్ అమోర్ (39), కోడీ ఖోర్క్ (35), రాబర్ట్ మార్జాన్ (54), జెఫ్రీ ఓబ్రెయిన్ (45), నోవా టీట్‌జెన్స్ (42), డెక్లాన్ కోయాడీ (20)లుగా గుర్తించారు. వీరంతా అమెరికాలోని అయోవా రాష్ట్రం డెస్ మొయినెస్‌లో ఉన్న 103వ ఆర్మీ కమాండ్ యూనిట్‌కు చెందిన వారు.

ఉత్తర ఇజ్రాయెల్ ఖాళీ చేసి వెళ్లిపోండి : హిజ్బుల్లా

లెబనాన్‌లోని ఇరాన్ సమర్థిత మిలిటెంట్ గ్రూప్ హిజ్బుల్లా శనివారం కీలక హెచ్చరిక చేసింది. ఉత్తర ఇజ్రాయెల్‌లోని కిర్యత్ షోమ్నా, నహరియా, టిబెరియాస్ పట్టణాలను ప్రజలు వెంటనే ఖాళీ చేసి వెళ్లిపోవాలని వార్నింగ్ ఇచ్చింది. దీంతో ప్రజలను అప్రమత్తం చేసేందుకు ఆ మూడు పట్టణాల శివారు ప్రాంతాల్లో అలర్ట్ సైరన్లను మోగించారు. దక్షిణ లెబనాన్, బీరుట్ నగరం దక్షిణ శివారు ప్రాంతాల ప్రజలు ఇళ్లను ఖాళీ చేసి వెళ్లిపోవాలని ఇటీవలే ఇజ్రాయెల్ ఆర్మీ హెచ్చరించింది. దీంతో వేలాది మంది ప్రజలు తమ ఇళ్లను వదిలి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోయారు. ఆయా ప్రాంతాలపై భీకర వైమానిక దాడులనూ ఇజ్రాయెల్ చేసింది. ఈనేపథ్యంలో ఇప్పుడు ఉత్తర ఇజ్రాయెల్ లక్ష్యంగా హిజ్బుల్లా వార్నింగ్ ఇవ్వడం గమనార్హం.

అమెరికాకు ఇరాన్ లొంగదు

ట్రంప్ డిమాండ్ ను తిరస్కరించిన ఇరాన్ అధ్యక్షుడు

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ దేశ ప్రజలకు కీలక సందేశం ఇచ్చారు. బేషరతుగా లొంగిపోవాలన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ డిమాండ్‌ను తిరస్కరించారు. అమెరికా, ఇజ్రాయెల్ ఒత్తిడికి ఇరాన్ ఎట్టి పరిస్థితుల్లోనూ లొంగదని స్పష్టం చేశారు. దేశాన్ని కాపాడేందుకు అందరూ ఒక్కటై నిలవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజలను ఉద్దేశించి తాజాగా మాట్లాడిన ఆయన, అంతర్జాతీయ చట్టాలను పట్టించుకోకుండా అమెరికా, ఇజ్రాయెల్ ఎక్కడ కావాలంటే అక్కడ బాంబులు వేస్తున్నాయని ఆరోపించారు. పాఠశాలలు, ఆసుపత్రులు, ఇతర ముఖ్య కేంద్రాలను కూడా లక్ష్యంగా చేసుకుంటున్నారని విమర్శించారు. "మన దేశం, మన నేల, మన నీరు, మన గౌరవాన్ని కాపాడేందుకు అందరం కలిసి నిలవాలి. ఈ సంక్షోభం నుంచి ఇరాన్ గర్వంగా బయటపడేందుకు అవసరమైతే ప్రాణాలు అర్పించడానికి కూడా సిద్ధంగా ఉన్నాం. మమ్మల్ని లొంగిపోవాలని కలలు కంటున్నవారు ఆ కలల్ని సమాధి చేసుకోవాల్సిందే" అని పెజెష్కియన్ అన్నారు. ఇటీవల ట్రంప్ ఇరాన్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తమ దేశం స్వాభిమానం ఉన్న దేశమని, ఎవరికి లొంగదని పెజెష్కియన్ స్పష్టం చేశారు. మరోవైపు పొరుగు గల్ఫ్ దేశాలపై ఇరాన్ శాంతి సందేశం పంపింది. ఇటీవల జరిగిన దాడులపై ఆయన ఆ దేశాలకు క్షమాపణ చెప్పారు. ఇకపై పొరుగు దేశాలపై దాడులు చేయబోమని ప్రకటించారు.

"

మిడిల్ ఈస్ట్‌కు ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్‌లను పంపాలని యూకే అనుకుంటోంది. ఒకప్పుడు మన గొప్ప మిత్ర దేశమైన యూకే ఎట్టకేలకు మిడిల్ ఈస్ట్‌కు రెండు ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్‌లను పంపించాలని తీవ్రంగా ఆలోచిస్తోంది. కానీ మాకు అవి అవసరం లేదు పీఎం స్టార్మర్. మేం ఆల్రెడీ యుద్ధం గెలిచాం. ఇప్పుడు యుద్ధంలో చేరేవారు మాకు అవసరం లేదు

- డొనాల్డ్ ట్రంప్, అమెరికా అధ్యక్షుడు

రాజకీయం

ప్రపంచస్థాయి ఏఐ ఆర్థిక ఆవిష్కరణల కేంద్రంగా హైదరాబాద్

- మంత్రి శ్రీధర్ బాబు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 7 : ఏఐ ఆధారిత ఆర్థిక సాంకేతిక రంగంలో హైదరాబాద్ గ్లోబల్ హబ్‌గా ఎదుగుతోందని ఐటి, పరిశ్రమలు, వాణిజ్య శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. శనివారం నాడు బాచుపల్లిలోని విజ్ఞానజ్యోతి ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ లో ఫిక్కి నిర్వహించిన సిఎఫ్ ఓ ల సదస్సులో ఆయన కీలకోపన్యాసం చేసారు. ప్రపంచంలోని ప్రముఖ ఆర్థిక సంస్థలు నగరంలో తమ ఆవిష్కరణలు, ఇంజినీరింగ్ కేంద్రాలను స్థాపిస్తున్నాయని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. "కృత్రిమ మేధ టెక్నాలజీ పాత్రను పూర్తిగా మార్చేస్తోంది. ఇప్పటివరకు కంపెనీ ఖర్చులను లెక్కించడానికి ఉపయోగపడిన టెక్నాలజీ, ప్రస్తుతం ఆవిష్కరణలు, మెరుగైన ఆర్థిక నిర్ణయాలకు సహాయపడుతోంది. హైదరాబాద్ ప్రపంచంలోనే అత్యంత బలమైన ఫైనాన్షియల్ టెక్నాలజీ ఎకోసిస్టమ్‌లలో ఒకటిగా అభివృద్ధి చెందింది. వ్యాన్ గార్డ్, యుబిఎస్ వెల్స్ ఫార్గో, బ్యాంక్ ఆఫ్ అమెరికా, మాస్ మ్యూచువల్, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్, జెపి మోర్గాన్ చేస్, గోల్డ్ మ్యాన్ శాక్స్, సిటి గ్రూప్ లాంటి ప్రఖ్యాత ఆర్థిక సంస్థలు నగరంలో భారీ టెక్నాలజీ, అనలిటిక్స్ కేంద్రాలను నిర్వహిస్తున్నాయి. నగరంలో ప్రస్తుతం 400 గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (GCC) మూడు లక్షల మందికి పైగా వృత్తి నిపుణులకు ఉపాధి కల్పిస్తున్నాయి. తెలంగాణ ఐటీ రంగం ఎగుమతులు సంవత్సరానికి దాదాపుగా 40 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. తదుపరి దశ విస్తరణ కోసం ఏఐ సిటీ, ఫ్యూచర్ సిటీ, ఏఐకేఏఎం లను ఏర్పాటు చేస్తున్నాం. వీటి ద్వారా ఏఐ ఎకోసిస్టమ్‌ను మరింత బలోపేతం చేయడం, డిజిటల్ మౌలిక వసతులను మెరుగుపర్చడం, ఏఐ ఆధారిత ఆర్థిక వ్యవస్థకు అవసరమైన నిపుణులను తయారు చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాం. డిజిటల్ యుగంలో సీఎఫ్ఓల పాత్ర మరింత కీలకంగా మారింది". కృత్రిమ మేధ, డేటా ఆధారిత రంగాల్లో పెట్టుబడులకు మార్గనిర్దేశం చేయడంలో వారి సేవలు మరింత ప్రాధాన్యతను సంతరించుకున్నాయని శ్రీధర్ బాబు వివరించారు. సదస్సులో మాజీ చీఫ్ విజిలెన్స్ కమిషనర్ కె.వి. చౌదరి, ప్రముఖ నిర్మాత, విజ్ఞానజ్యోతి ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్ మెంట్ (విజెఐఎం) అధ్యక్షుడు దగ్గుబాటి సురేశ్ బాబు, ఫిక్కి సిఎఫ్ ఓ కౌన్సిల్ ఛైర్మన్ రజనీష్ జైన్, కో ఛైర్మన్ సుబ్బయ్య కుమార్, విజ్ఞాన జ్యోతి సంస్థల సిఇఓ, మాజీ డిజిపి అనురాధ తదితరులు పాల్గొన్నారు.

నేటితో ముగిసిన ఫిరాయింపు ఎమ్మెల్యేల విచారణ

- తెలంగాణ రాజకీయాల్లో గత ఏడాది కాలంగా ప్రకంపనలు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 7: తెలంగాణ రాజకీయాల్లో గత ఏడాది కాలంగా ప్రకంపనలు సృష్టిస్తున్న ఎమ్మెల్యేల ఫిరాయింపుల వ్యవహారం ఇప్పుడు క్లైమాక్స్‌కి చేరుకుంది. బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ లో చేరిన ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్లపై అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ శనివారం తుది విచారణను ముగించారు. సుప్రీ కోర్టు విధించిన గడువు నేటితో ముగియనుండటంతో, స్పీకర్ వెలువరించబోయే తీర్పుపై రాష్ట్ర వ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది.ప్రధానంగా స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్లపై దాఖలైన పిటిషన్లపై నేడు స్పీకర్ ఛాంబర్ లో కీలక విచారణ జరిగింది. ఈ నేపథ్యంలో పది మంది ఎమ్మెల్యేలను ప్రశ్నించారు స్పీకర్, అనంతరం 8 మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ క్లీన్ చీట్ ఇచ్చారు. దానం, కడియం కేసులో తీర్పు రిజర్వ్ ఉంచారు. ఉభయ పక్షాల వాదనలు విన్న అనంతరం ఈ కేసులో కూడా విచారణ ముగిసినట్లు స్పీకర్ కార్యాలయం ప్రకటించింది.

టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ను హైదరాబాద్ లోని ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపిన నూతన మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ -ప్రతిపక్షం, హైదరాబాద్

డాక్టర్ పొన్నం రవిచంద్ర 'ది ఫస్ట్ యాక్షన్ హీరో'కు గద్దర్ డాక్యుమెంటరీ పురస్కారం!

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 7: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందజేస్తున్న తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ లో కరీంనగర్ కు చెందిన డాక్టర్ పొన్నం రవిచంద్ర డాక్యుమెంటరీ విభాగంలో పురస్కారాన్ని సాధించారు. శనివారం హైదరాబాద్‌లో విలేకరుల సమావేశంలో 2025 తెలుగు సినిమాలవివిధ విభాగాలకు సంబంధించిన అవార్డులను ప్రకటించారు. డాక్యుమెంటరీ విభాగానికి సంబంధించి తెలంగాణ ముద్దుబిడ్డ బాలీవుడ్ లో 300కు పైగా సినిమాలలో నటించి, నిర్మించి దర్శకత్వం వహించిన పైడి జయరాజ్ జీవన చిత్రంపై డాక్టర్ పొన్నం రవిచంద్ర రూపొందించిన "ద ఫస్ట్ యాక్షన్ హీరో" డాక్యుమెంటరీ రెండవ అత్యుత్తమ డాక్యుమెంటరీగా అవార్డు గెలుచుకుంది. డాక్టర్ పొన్నం రవిచంద్ర సీనియర్ జర్నలిస్టుగా, కవిగా, రచయితగా, డాక్యుమెంటరీ చిత్రాల నిర్మాతగా, సినీ నిర్మాతగా తనదైన ముద్ర వేసిన సృజనశీలి. కరీంనగర్ ఫిలిం భవన్ కు కరీంనగర్ ఫిలిం సొసైటీ కి గత 8 ఏళ్ళ నుంచి అధ్యక్షుడిగా సినీ రంగ వికాసం కోసం, అత్యుత్తమ సినిమాల ప్రదర్శన ద్వారా యువతలో సినిమా కళ పట్ల ఆసక్తిని కలిగించే దిశగా వారు ఎంతో కృషి చేస్తున్నారు. ఆ క్రమంలోనే పైడి జయరాజ్ గారి జీవన ఇతివృత్తంతో ఎన్నో వ్యయప్రయాసలకోర్చి లక్షల రూపాయల వ్యయంతో ఈ డాక్యుమెంటరీని ఆయన రూపొందించారు. దీనికోసం ముంబైకి వెళ్లి పైడి జయరాజ్ గారి వారసులతో సంప్రదించి అరుదైన ఫోటోగ్రాఫ్ లను, వీడియోలని సేకరించి ఈ అరుదైన అపూర్వమైన డాక్యుమెంటరీని ఆయన రూపొందించడం విశేషం. దీనివల్ల తెలుగు ప్రపంచానికి తెలంగాణ సినీ ప్రేమికులకు పైడి జయరాజ్ గారి గురించిన ఎన్నెన్నో విశేషాలు వెలుగు లోకి రావడానికి, తెలంగాణ జాతి ఖ్యాతి సినీరంగంలో ఎదిగిన తీరుకు ఈ డాక్యుమెంటరీ అద్దం పట్టిందని, డాక్టర్ పొన్నం రవి చంద్ర కు ప్రతిష్టాత్మక తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డు డాక్యుమెంటరీ విభాగంలో రావడం ఆనందదాయకమని కరీంనగర్ జిల్లాకు కవులు రచయితలు సినిమా ప్రేమికులు నలిమెల భాస్కర్, పి ఎస్ రవీంద్ర, నగునూరి శేఖర్, గాజోజు నాగభూషణం, మాడిశెట్టి గోపాల్, అనంతచార్య, కూకట్ల తిరుపతి, కందుకూరి అంజయ్య, బూర్ల వెంకటేశ్వర్లు, లక్ష్మీ గౌతమ్, అనిల్, వరాల మహేష్, ముజఫర్, కోలా రామచంద్ర రెడ్డి, అశోక్ రావు, శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాకు సంబంధించిన పలు సాహిత్య, సాంస్కృతిక, కళా సంఘాల బాధ్యులు హర్షం వ్యక్తం చేశారు.

రవిచంద్ర కు జీవి శ్యాంప్రసాద్ లాల్ అభినందనలు

ప్రతిపక్షం, హైదరాబాద్, మార్చి 7 : ప్రముఖ కవి సినీ విమర్శకులు పొన్నం రవిచంద్ర కు గద్దర్ ఫిలిం అవార్డు రావడం పట్ల నాగర్ కర్నూల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ జీవి శ్యాం ప్రసాద్ లాల్ ఒక ప్రకటనలో అభినందనలు తెలియజేశారు. పొన్నం రవిచంద్ర దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత పైడి జయరాజ్ జీవితంపై తీసిన డాక్యుమెంటరీ 'ది ఫస్ట్ యాక్షన్ హీరో' గొప్ప లఘు చిత్రమని అన్నారు. ఆయన ఇటీవల 'తెలంగాణ సినీ ప్రస్థానం' అనే పుస్తకాన్ని కూడా వెలువరించారన్నారు. ఎస్. పి ఎఫ్. ట్రస్ట్ తరపున కరీంనగర్ సమన్వయకర్త గోనె శ్రీనివాస్, క ఫి సో కార్యవర్గ సభ్యులు రాచ కొండ చక్రధర్ రావు, తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ స్ఫూర్తి అసోసియేషన్ అధ్యక్షుడు పందిల్ల శంకర్ లు అభినందనలు తెలియజేశారు. రవిచంద్ర సినీ పరిశ్రమకు విమర్శకునిగా రచయితగా చేస్తున్న సేవలు అనన్యమైనవని వారు తెలిపారు.

ఘనంగా ఇఫ్తార్ విందు

ప్రతిపక్షం, కుత్బుల్లాపూర్, మార్చి 7 : కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజులరామారాం విన్ ప్యాలెస్‌లో అబ్దుల్ ఆరిఫ్ ఆధ్వర్యంలో శనివారం ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై, ముస్లిం మైనార్టీ సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొని రంజాన్ మాసం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇఫ్తార్ అనేది కేవలం ఉపవాస విరమణ మాత్రమే కాదని, స్నేహం, ఐక్యత, సోదర భావానికి ప్రతీక అని అన్నారు. రంజాన్ మాసం శాంతి, సామరస్యాన్ని ప్రతిబింబించే పవిత్రమైన కాలమని పేర్కొన్నారు. సమాజంలో అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి సఖ్యతతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు. అదేవిధంగా ముస్లిం మైనార్టీ సోదరులందరికీ ముందస్తు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఉపవాస దీక్ష విరమణలో పాల్గొన్నారు. ఈ ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసిన మాజీ కౌన్సిలర్ అబ్దుల్ ఆరిఫ్ను కూన శ్రీశైలం గౌడ్ అభినందించి, ఇలాంటి కార్యక్రమాలు సామాజిక ఐక్యతను బలపరుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు బుచ్చిరెడ్డి, ఎండి అమీర్, జావీద్ బేగ్, షంశి, రషీద్, లాల్ మహమ్మద్, షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా న్యూటన్ హైస్కూల్ వార్షికోత్సవం

- అలరించిన చిన్నారుల ప్రదర్శనలు!

ప్రతిపక్షం, మోతినగర్, మార్చి 7 : మోతినగర్‌లోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో శనివారం ఉదయం న్యూటన్ హైస్కూల్ వార్షికోత్సవ వేడుకలు మిన్నంటాయి. కరస్పాండెంట్ కరస్పాండెంట్ పి.జనార్ధన్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. న్యూటన్ స్కూల్ మోతీనగర్ బ్రాంచ్ హెడ్స్ రవి, రాజు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ పి.జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయడంలో వార్షికోత్సవాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ సుభాషిణి వార్షిక నివేదికను సమర్పించి, పాఠశాల సాధించిన విజయాలను వివరించారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను మంత్రముగ్ధులను చేశాయి. దేశభక్తి గీతాలు, జానపద నృత్యాలతో విద్యార్థులు స్టేజీపై సందడి చేశారు. టీచర్ల పర్యవేక్షణలో జరిగిన ఈ వేడుకల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. భారీ సంఖ్యలో హాజరైన తల్లిదండ్రులు తమ పిల్లల ప్రదర్శనలను చూసి మురిసిపోయారు. ఉపాధ్యాయ బృందం, పాఠశాల సిబ్బంది సమన్వయంతో ఈ కార్యక్రమం ఘనంగా ముగిసింది.

మహిళల సాధికారత దిశగా మరో కొత్త పథకం

- ప్రతి గ్రామ పంచాయతీలో మహిళా సమాఖ్య భవనం
- ములుగు జిల్లాలో శ్రీకారం చుట్టిన మంత్రి సీతక్క
- పలు గ్రామాల్లో మహిళా భవనాల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 7 : మహిళల సంక్షేమం, సాధికారత దిశగా తెలంగాణ ప్రభుత్వం మరో ముఖ్యమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఒక రోజు ముందుగానే రాష్ట్ర మంత్రి సీతక్క తన సొంత నియోజకవర్గమైన ములుగులో మహిళా అభివృద్ధికి దోహదపడే నూతన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి గ్రామ పంచాయతీలో మహిళా సమాఖ్య భవనం నిర్మించాలనే లక్ష్యంతో పలు గ్రామాల్లో మహిళా భవనాలకు శంకుస్థాపన చేసి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ములుగు మండలంలోని దేవగిరి పట్నం ఈ కార్యక్రమానికి వేదికగా నిలిచింది. శనివారం తన నియోజకవర్గంలో పర్యటించిన మంత్రి సీతక్క దేవగిరి పట్నంతో పాటు కన్నాయిగూడెం, ఇంచర్ల, లక్ష్మీదేవిపేట గ్రామాల్లో మహిళా సమాఖ్య భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ప్రతి గ్రామంలో సుమారు రూ.10 లక్షల వ్యయంతో ఈ భవనాలను నిర్మించనున్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో కనీసం 200 గజాల ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి మహిళా భవనాల నిర్మాణానికి సిద్ధం చేయాలని ఇప్పటికే పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆదేశాలు జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ మహిళా భవనాలు గ్రామీణ మహిళలకు ఆత్మగౌరవానికి, ఆర్థిక స్వావలంబనకు, పరస్పర ఐక్యతకు ప్రతీకలుగా నిలవనున్నాయి. స్వయం సహాయక సంఘాల సమావేశాలు నిర్వహించడానికి, మహిళలకు వివిధ నైపుణ్యాలపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడానికి ఈ భవనాలు ఉపయోగపడనున్నాయి. అదేవిధంగా అవసరమైతే మహిళా సంఘాలు తయారు చేసే ఉత్పత్తులను విక్రయించే కేంద్రాలుగా కూడా వీటిని వినియోగించుకునే అవకాశం ఉంటుంది. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, మహిళల సంక్షేమం, సాధికారతకు తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గ్రామ స్థాయిలో మహిళలకు బలమైన వేదిక కల్పించడమే లక్ష్యంగా ప్రతి గ్రామ పంచాయతీలో మహిళా సమాఖ్య భవనాలను నిర్మించే కార్యక్రమాన్ని ప్రారంభించామని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని క్రమంగా రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి అన్ని గ్రామ పంచాయతీల్లో మహిళా భవనాలు నిర్మించే దిశగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధిగా ఎదగడానికి ప్రభుత్వం ఇప్పటికే అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తోందని మంత్రి సీతక్క తెలిపారు. ఆడబిడ్డల అభ్యున్నతే రాష్ట్ర అభ్యున్నతికి మూలాధారం అని పేర్కొంటూ, సమాజంలోని అన్నిరంగాల్లో మహిళలు ముందంజలో నిలిచేలా ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ఆత్మ కమిటీ చైర్మన్ కొండ రవీందర్ రెడ్డి, డి ఆర్ డి ఓ శ్రీనివాస్, పి ఆర్ ఈ ఈ అజయ్ కుమార్, డి ఈ లింగారెడ్డి, యం పి డి ఓ, యం పి ఓ, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

"

బెంగాల్ ప్రభుత్వం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పట్ల వ్యవహరించిన తీరు దురదృష్టకరం. సంతాళీ తెగ సమ్మేళనాన్ని ఉద్దేశపూర్వకంగానే ఆ జనాభా తక్కువ ఉన్న చోట నిర్వహించడం, కనీస ప్రొటోకాల్ పాటించకుండా సీఎం మమతా బెనర్జీ గైర్హాజరు కావడం గిరిజన జాతులను అవమానించడమే. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్నవారిని రాజకీయాల్లోకి లాగడం ఏమాత్రం సరికాదు.

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

ఓపెన్ వాయిస్

యుద్ధంలో మిగిలేది శూన్యమే

యుద్ధం ప్రకటించేది ముసలివారు, కానీ పోరాడి చనిపోయేది మాత్రం యువకులే ” .. రెండో ప్రపంచయుద్ధంలో అమెరికా అధ్యక్షుడుగా వ్యవహరించిన హెర్బర్ట్ హూవర్ చెప్పిన మాట. ఎందుకంటే యుద్ధం వినాశనాన్ని ఆయన కళ్లారా చూశారు మరి. ఇప్పుడు అదే అమెరికాకు అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న ట్రంప్ దీన్ని నిజం చేస్తున్నారు. యుద్ధాలు చూసిన వారు .. యుద్ధాల్లో పాల్గొన్న వారు ఎవరైనా సరే చెప్పే మాట యుద్ధంలో విజేతలు ఎవరూ ఉండరనే. అయినా ఈ సూక్ష్మాన్ని అర్థం చేసుకునేంత విశాలమైన దృక్పథం లేని ట్రంప్ లాంటి నేతలే ప్రపంచాన్ని ఏలుతున్నారు. చరిత్ర పుటలను తిరగేస్తే కనిపించేది కేవలం రాజ్యాల విస్తరణో, వీరుల పరాక్రమమో కాదు.. ప్రతి యుద్ధం చివరన మిగిలిన శ్మశాన వైరాగ్యం. యుద్ధంలో విజేతలు ఉండరు.. కేవలం ప్రాణాలతో మిగిలిన వారు మాత్రమే ఉంటారు అన్నది జగమెరిగిన సత్యం. కానీ, దురదృష్టవశాత్తూ చరిత్ర నేర్పిన పాఠాలను విస్మరించడమే మానవజాతి అలవాటుగా మార్చుకుంది. ఖొమైనీని చంపేసినా విజయం దక్కలేదు చరిత్రలో యుద్ధాలు ఎప్పుడూ ఒక ముగింపును ఇవ్వలేదు, అవి కేవలం కొత్త అధ్యాయాలకు రక్తపాతంతో కూడిన ప్రారంభాలను మాత్రమే రాశాయి. ప్రస్తుతం జరుగుతున్న యుద్ధంలో ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖొమైనీని లక్ష్యంగా చేసుకుని అమెరికాఇజ్రాయెల్ జరిపిన నాయకత్వ నిర్మూలన ఆధునిక యుద్ధ తంత్రంలో ఒక సంచలనం కావచ్చు. కానీ, ఒక వ్యక్తిని లేదా ఒక వ్యవస్థ శిఖరాగ్రాన్ని తొలగించినంత మాత్రాన ఆ దేశంపై లేదా ఆ సిద్ధాంతంపై విజయం సాధించామనుకోవడం కేవలం భ్రమ మాత్రమేనని అనంతర పరిణామాలు నిరూపిస్తున్నాయి. ఇరాన్ వంటి దేశాల్లో అధికారం అనేది కేవలం ఒక వ్యక్తిపై ఆధారపడి ఉండదు. దశాబ్దాలుగా అక్కడ నిర్మితమైన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్, ఒక బలమైన మతపరమైన అధికార యంత్రాంగం, నాయకత్వం కోల్పోయినప్పుడు మరింత ఉధృతంగా స్పందిస్తాయి. ఇప్పుడు అదే జరుగుతోంది. ఫలితంగా గల్ఫ్ దేశాలు తమ ఎడారి వంటి వాతావరణంలో ఎంతో కష్టపడి నిర్మించుకుంటున్న ఆర్థిక వ్యవస్థకు ముప్పు ఏర్పడింది. శత్రువును నామరూపాలు లేకుండా చేయాలనే ఆకాంక్ష సిద్ధాంతపరంగా బాగుండవచ్చు కానీ, క్షేత్రస్థాయిలో అది అసాధ్యం. విత్తనాన్ని మట్టిలో పాతిపెడితే అది చనిపోదు, మరింత బలమైన వృక్షంగా మొలుస్తుంది. యుద్ధాల విషయంలో కూడా పగ, ప్రతీకారాలు అలాగే రూపాంతరం చెందుతాయి. ఖొమైనీ మరణం తర్వాత ఇరాన్ బలహీనపడిందని జరుగుతున్న పరిణామాలను చూసి ఎవరూ అనుకోవడంలేదు. ఒక కేంద్రీకృత నాయకత్వం లేనప్పుడు, ఆ వ్యవస్థలోని చిన్న చిన్న విభాగాలు స్వయంప్రతిపత్తితో విధ్వంసానికి తెగబడే ప్రమాదం ఉంది. ఇప్పుడు మనం చూస్తున్నట్లుగా, హోర్ముజ్ జలసంధి మూసివేత, అంతర్జాతీయ ఇంధన సరఫరాపై దాడులు, లెబనాన్ నుండి హిజ్బుల్లా ప్రయోగిస్తున్న క్షిపణులు.. ఇవన్నీ ఒక దేశాన్ని దెబ్బకొడితే ప్రపంచం మొత్తం ఎలా వణికిపోతుందో నిదర్శనాలు. విజేతగా నిలిచామని సంబరపడే లోపే, ఆర్థిక మాంద్యం , ప్రాంతీయ అస్థిరత అనే రూపాల్లో ఓటమి తలుపు తడుతోందని ఎప్పటికప్పుడు అనుభవమైన నిజం. యుద్ధంలో గెలిచిన వాడు కూడా ఓడిపోయిన వాడితో సమానమే, ఎందుకంటే ఇద్దరూ తమ ఆత్మీయులను కోల్పోతారు.” అని శ్రీమద్భాగవతంలో మనం చెప్పుకున్నాం. యుద్ధం ము గురించి చరిత్ర కేవలం గెలిచిన పక్షం పేరును మాత్రమే చెబుతుంది. కానీ ఆ గెలుపు కోసం చెల్లించిన మూల్యాన్ని ఎప్పుడూ విస్మరిస్తుంది. సరిహద్దుల మీద ఎగిరే జెండా ఆ దేశపు ఆత్మగౌరవానికి చిహ్నంగా కనిపించవచ్చు, కానీ ఆ జెండాను మోయాల్సిన యువతరం శ్మశానాల్లో కలిసిపోవడం ఏ విజయానికి సంకేతమనేది ఎవరు చెప్పగలరు? ఆధిపత్యం కోసం జరిగే ఈ పోరాటంలో అగ్రరాజ్యాలుగా వెలుగొందాలని చూసే దేశాలు, తమ భావి తరాల ఉనికినే పణంగా పెడుతున్నాయి. యుద్ధరంగంలో మిగిలేది విజయగర్వం కాదు, శూన్యం మాత్రమే. ఆర్థికంగా బలపడటం కోసం లేదా భూభాగాల కోసం చేసే యుద్ధాలు, ఒక దేశపు వెన్నెముకను విరిచేస్తాయి. యుద్ధం వల్ల కలిగే విధ్వంసం కేవలం భవనాలకూ, ఆస్తులకూ పరిమితం కాదు. అది ఒక దేశపు ఆర్థిక మూలాలను, సామాజిక సమతుల్యతను దశాబ్దాల పాటు కుంగదీస్తుంది. యుద్ధం కోసం వెచ్చించే వేల కోట్ల నిధులు మానవాభివృద్ధికి ఉపయోగపడాల్సినవి, కానీ అవి వినాశనానికి ఖర్చవుతున్నాయి. ఈ ప్రక్రియలో కోల్పోయిన మానవ వనరులు, మేధస్సు మళ్ళీ పునరుద్ధరించలేనివి. విజేతగా నిలిచిన దేశం కూడా పతనమైన ఆర్థిక వ్యవస్థతో, గాయపడిన సమాజంతోనే మనుగడ సాగించాల్సి వస్తుంది.

ప్రతిపక్షం
హైదరాబాద్
ఆదివారం
08.03.2026

దళిత బాల్య వధువు నుండి మిలియన్ డాలర్ల కంపెనీ పునరుద్ధరణ వరకు..

యేచన్ చంద్ర శేఖర్
8885050822

ప్రతి సంవత్సరం మార్చ్ 8న “ప్రపంచ మహిళా దినోత్సవం” దినోత్సవం జరుపుకోవడం మనందరికీ తెలుసు. అయితే మహిళల కోసం ప్రత్యేకంగా కేటాయించబడిన ఈ రోజున ఏదో మొక్కుబడిగా వేడుకలు నిర్వహించుకోవడం వరకు మాత్రమే పరిమితం కాకుండా, జీవితంలోని సవాళ్ళను తమ దృఢసంకల్పంతో ఎదుర్కొని అవరోధాలనే అవకాశాలుగా మలచుకొని తమ ఉనికిని చాటుకున్న మహిళామనులను స్ఫూర్తిగా తీసుకుని తాము కూడా ప్రగతిపథంలో పయనించేందుకు కృషి చేసినప్పుడే మహిళా దినోత్సవ వేడుకలకు సార్థకత ఉంటుంది. ఈ సందర్భంగా భారతదేశంలోనే మొట్టమొదటి మహిళా వ్యవస్థాపకురాలిగా (ఉమెన్ ఎంటర్ప్రెన్యువర్) విశేషంగా గుర్తింపు పొందిన మొట్టమొదటి మహిళ కల్పన సరోజ్ గురించి తెలుసుకుందాం. భారతీయ మహిళా వ్యాపారవేత్త, పద్మశ్రీ కల్పనా సరోజ్ TEDx స్పీకర్ కూడా. ఆమె ఒంటరిగా 2001లో పీకల్లోతు కష్టాలతో దాదాపు దివాలా దిశకు చేరుకున్న బహుళ మిలియన్ డాలర్ల కంపెనీ అయిన కమానీ ట్యూబ్స్ కంపెనీని స్వాధీన పరచుకుని, ఆ సంస్థ చైర్‌పర్సన్ గా దానిని లాభదాయకమైన వ్యాపారంగా మార్చడం వ్యవస్థాపకతలో (ఎంటర్ప్రెన్యువర్షిప్) మహిళలకు ఒక గొప్ప మలుపు అనవచ్చు. దళిత కుటుంబంలో బాల్య వధువు నుండి బహుళ మిలియన్ డాలర్ల కంపెనీని విజయవంతంగా పునరుద్ధరించడం వరకు ఆమె స్ఫూర్తిదాయకమైన ప్రయాణం స్థితిస్థాపకత, సంకల్పం మరియు అజేయమైన మానవ స్ఫూర్తికి నిదర్శనం.

కల్పానా సరోజ్ నికర విలువ (నెట్వర్త్):

2025 నాటికి, కల్పన సరోజ్ నికర విలువ సుమారు 112 మిలియన్లు అమెరికన్ డాలర్లు లేదా రు.900-రు.950 కోట్లు. కాగా, కమానీ ట్యూబ్స్ మరియు ఇతర వెంచర్లతో సహా ఆమె వివిధ వ్యాపార ఆసక్తులు రు.1,000 కోట్లను దాటిన సంచిత టర్నోవర్ లేదా విలువను కలిగి ఉన్నాయని కొన్ని నివేదికలు సూచిస్తున్నాయి. వాణిజ్యం మరియు పరిశ్రమల విభాగంలో ఆమె చేసిన విశేష కృషికి గుర్తింపుగా 2013లో భారత ప్రభుత్వం ఆమెను దేశ అత్యున్నత పౌర పురస్కారాలలో ఒకటైన ‘పద్మశ్రీ’ తో సత్కరించింది.

సవాళ్లకు ఎదురీత:

1961లో మహారాష్ట్రలో కేవలం వంద ఇళ్ళు ఉన్న చిన్న గ్రామం రోపర్ఖేడా గ్రామంలో ఒక సాధారణ పోలీసు కానిస్టేబుల్ కు జన్మించిన కల్పన సరోజ్ చిన్నప్పటి నుండే తీవ్రమైన కుల వివక్షకు గురైంది. ఆమె తండ్రి తన కూతురుకు విద్యను అందించాలనుకున్నప్పటికీ సమాజం అలాంటి ఆలోచనలను అభినందించలేదు. కొంతమంది కుటుంబ సభ్యులయితే చివరికి ప్రతి బాలిక జీవితం వంటగదికి మాత్రమే పరిమితం కనుక బాలికలకు విద్య యొక్క ఉద్దేశ్యం ఏమిటని ప్రశ్నించారు. తన కూతురు మెట్రిక్యులేషన్ పూర్తి చేయాలని ఆ తండ్రి కోరుకున్నప్పటికీ, కుటుంబం మరియు సమాజం ఒత్తిడి వల్ల ఆమె 7వ తరగతిలోనే వివాహం చేసుకోవాల్సివచ్చింది. కుటుంబ నేపథ్యం మరియు ఆనాటి సామాజిక కట్టుబాట్ల కారణంగా ఆమె కేవలం 12 సంవత్సరాల పసి ప్రాయంలోనే తనకంటే వయసులో ఎంతో పెద్ద వ్యక్తిని వివాహం చేసుకుని ముంబైకి వెళ్లింది. దురదృష్టవశాత్తూ ఆ వివాహం నరకప్రాయంగా మారి ఆమె శారీరక మరియు మానసిక హింసకు గురై తీవ్ర వేదనను అనుభవించింది. ఆ వేదనాభరితమైన వివాహబంధం నుండి విముక్తి పొందేందుకు సరోజ్ అత్యంత ప్రతికూల పరిస్థితులనుండి తప్పించుకుని తన గ్రామానికి

తిరిగి వచ్చినప్పటికీ ఆమె సమస్యలు అక్కడితో తీరిపోలేదు. సామాజిక ఆచారవ్యవహారాలకు విరుద్ధంగా ఆమె తన భర్తను విడిచిపెట్టి పుట్టింటికి చేరినందుకు సమాజం యొక్క తిరస్కారాన్ని మరియు తీవ్ర ధిక్కారాన్ని ఎదుర్కోవాల్సివచ్చింది. సభ్య సమాజ ఛీత్కారాలతో విపరీతమైన మానసిక ఒత్తిడికి గురైన ఆమె ఒకానొక సందర్భంలో ఆత్మహత్యకు పాల్పడేందుకు విషం సేవించడంతో ఆస్పత్రికి తరలించగా ఆమెను పరీక్షించిన డాక్టర్ విషం శరీరం అంతా వ్యాపించిందని, ఆమె 24 గంటల్లో తిరిగి స్పృహలోకి వస్తే తప్ప బ్రతకడం కష్టం అని తేల్చి చెప్పాడు. ఆమె చనిపోతే, తమ స్టేషన్ పై నింద వస్తుందని భయపడిన సంబంధిత పోలీస్ అధికారి ఆమెను తాలుకా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించాలని కోరాడు. అయితే తనకు తిరిగి స్పృహ రావడంతో తన పరిస్థితుల గురించి ఏమాత్రం అవగాహన లేని వారు చేసే అర్థంపర్థం లేని విమర్శలతో నిస్పృహకు లోనై తన విలువైన జీవితాన్ని బలిచేసుకోవడం సరైన ఎంపిక కాదని కుటుంబ సభ్యులు మరియు బంధువులు చెప్పడంతో ఆమె తన జీవితాన్ని పునర్నిర్మించుకుని, తన విలువను మరియు సామర్థ్యాన్ని నిరూపించుకోవాలని నిశ్చయించుకుంది.

ఫలించిన విజయకాంక్ష:

ముంబైకి తిరిగి వచ్చిన సరోజ్, కేవలం 16 సంవత్సరాల వయసులో తనను మరియు తన కుటుంబాన్ని పోషించుకోవడానికి ఒక గార్మెంట్ ఫ్యాక్టరీలో పనిచేయడం ప్రారంభించింది. విద్య ద్వారానే ప్రగతి సాధ్యమని ప్రబలంగా విశ్వసించిన ఆమె, తన విద్యను కొనసాగించడానికి ఒక పాఠశాలలో చేరడంతో పాటు జీవనాధారం కోసం అదనపు ఉద్యోగాలు చేపట్టింది. తన ఈ ప్రయత్నాలలో భాగంగానే ఆమె దళిత వ్యవస్థాపకులకు మద్దతు ఇచ్చే లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పథకం కింద రుణం పొందడంతో ఆమె కష్టానికి ఫలితం దక్కి మొదటి అడుగు పడింది. ఈ రుణంతో, ఆమె ప్రారంభించిన టైలరింగ్ వ్యాపారం, ఆమె పూర్తి అంకితభావం మరియు వ్యాపార చతురత కారణంగా త్వరలోనే అభివృద్ధి చెందింది. ధైర్యసాహసాలు మరియు దృఢసంకల్పంతో, ఆమె హిందీ, ఇంగ్లీష్ మరియు తెలుగు సినిమాల్లో నటించి KS ఫిల్మ్ ప్రొడక్షన్‌ను స్థాపించింది. ఇది ఆమె మొదటి వ్యాపార అభిరుచి, మరియు ఆమె అభివృద్ధి చెందింది. ఈ విజయం ఆమెలో ఆత్మవిశ్వాసం పెంపొందించడంతో, వ్యాపారాభివృద్ధికి గల మరిన్ని అవకాశాలను గుర్తించిన సరోజ్ తన వెంచర్లను ఫర్నిచర్ మరియు రియల్ ఎస్టేట్ రంగాలలోకి విస్తరించింది. ఆమె కఠోర శ్రమ, వ్యాపార దక్షత మరియు విజయం సాధించాలనే తపన, కష్టాల్లో ఉన్న వ్యాపారాలను చేపట్టి వాటిని పునరుద్ధరించి తిరిగి లాభాలకు విక్రయించేలా ఆమెను ప్రేరేపించింది. ఆమె యొక్క ఈ వినూత్నమైన ఆలోచనా విధానమే వ్యాపార ప్రపంచంలో ఆమె భవిష్యత్ విజయానికి పునాది వేసింది.

కమానీ ట్యూబ్స్ సముపార్జన మరియు పరివర్తన:

తీవ్రమైన ఆర్థిక దుర్వినియోగం మరియు కార్మిక వివాదాల కారణంగా కమానీ ట్యూబ్స్ కంపెనీ మూసివేత అంచుకు చేరుకుంది. ఖాయిలా పడిన కమానీ ట్యూబ్స్ కంపెనీ పునరుద్ధరణకు పూనుకోవడం సరోజ్ జీవితాన్ని ఒక గొప్ప మలుపు తిప్పింది. ఆమె స్పష్టమైన దృష్టి మరియు కంపెనీని మలుపు తిప్పడానికి దృఢ సంకల్పంతో అడుగుపెట్టింది. కమానీ ట్యూబ్స్ పరివర్తనకు ఆమె అనుసరించిన విధానం అద్భుతమైనది.

లండన్ లో డా అంబేద్కర్ ఇంటి వేలం నిలిపిన వైనం:

2014లో ప్రధానమంత్రితో సమావేశానికి సరోజ్ కు ఐదు నిమిషాలు సమయం లభించగా ఆమె రెండు నిమిషాలు ఆలస్యంగా చేరుకున్నారు. సమావేశ కారణం గురించి ప్రధానమంత్రి వాకబు చేయగా, లండన్ లోని డాక్టర్ అంబేద్కర్ ఇంటి వేలాన్ని తాను కాపాడాలనుకుంటున్నట్లు ఆమె చెప్పారు. ఈ విషయంపై స్పందిస్తూ అక్కడ ఉన్న కొందరు ఈ విషయాలను పరిశీలించడం కంటే ప్రభుత్వానికి తగినంత ఇతర ముఖ్యమైన పనులు ఉన్నాయన్నారు. దార్శనికుడు అయినందున ఆ ఇంటిని కాపాడటం ముఖ్యం అని అంటుండగానే “ధర ఎంత?” అని ప్రధాని ప్రశ్నించారు. ఆమె రూ.40 కోట్లు అనగానే ప్రధాని మరో ఆలోచన లేకుండా “చలో లే లియా!” (తీసేసుకున్నాం) అని అనడంతో ఎటువంటి ప్రతిఘటన లేకుండా ఒక సంవత్సరం లోపు ఆ ఇల్లు వేలం వేయకుండా రక్షించబడింది. విజ్ఞాన్ భవన్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో అందరూ ఈ చర్య పట్ల ప్రధాని మోదీని అభినందించగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ “దీనికి క్రెడిట్ కల్పనా సరోజ్ కి దక్కుతుంది. హమ్ తో భాయ్ సో రహే థే. కల్పనా జీ ఆయి, ఉన్హోనే కహా బాబాసాహెబ్ కా ఘర్ బిక్ రహా హై. ఔర్ హమ్ జగ్ గయే, ఔర్ వో ఘర్ లే లియా!” అని అన్నారు.

(వ్యాసకర్త మాజీ రాష్ట్ర కార్యదర్శి
ది భారత్ స్కౌట్స్ & గైడ్స్, తెలంగాణ)

మహిళా సాధికారత సమానత్వం

మరిపల్లి మాధవి
9963505668

శతాబ్దాల కాలంగా సమానత్వ సాధనకై జరిగిన ఉద్యమాలను పోరాటాలను సమీక్షించుకుని భవిష్యత్ కర్తవ్యాలను నిర్దేశించుకునే రోజు మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం. లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడానికి, వివిధ సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాహిత్యం సాంస్కృతిక రంగాల్లో మహిళలు సాధించిన విజయాలకిది ప్రతీక. ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని వారోత్సవాలుగా, పక్షోత్సవాలుగా జరుపుకుంటున్నాము. ఈ సందర్భంగా ఇంటా, బయటా మహిళలెదుర్కొంటున్న సమస్యలు, వారిపై జరుగుతున్న భౌతిక, మానసిక దాడులు, వాటిని అధిగమించే చర్యల గురించిన అనేక విషయాలపై చర్చలుంటాయి. ప్రతి సంవత్సరం ఒక థీమ్ ను ఈ సందర్భంగా ప్రకటిస్తారు. 2026 సంవత్సర థీమ్ "మహిళలు, బాలికలందరకీ హక్కులు, సమానత్వం, సాధికారత ". మహిళలకు సమాన హక్కులు, అధికారం, అవకాశాలను వాడుకోవడానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నది. ప్రపంచ వ్యాప్తంగా మహిళలు, బాలికల పురోగతిని అడ్డుకునే వ్యవస్థాగత అవరోధాలను తొలగించడానికి తక్షణ చర్యలను హైలైట్ చేస్తుంది. మన దేశంలో మహిళలు నాటినుంచి నేటిదాక పనికి గుర్తింపు, విలువ కట్టని ఈ అసమాన సమాజంలో అన్నీ తానై, అన్నింటా తానై అవిశ్రాంతంగా శారీరక, మేధో శ్రమచేస్తునే సమాజాభివృద్ధిలో భాగస్వామ్యులవుతున్నారు. భారత రాజ్యాంగం అందించిన హక్కులు, బాధ్యతలు వాటికి సంబంధించిన చట్టాల పట్ల అవగాహన కలిగి పురుషులతో సమానంగా ముందుకు పోతున్నారు. నేటి మహిళలు, పురుషులతో సమానంగా తమని గుర్తించాలని, తమ వాటా తమకు ఇవ్వాలనే స్పృహతో ఉద్యమిస్తున్నారు. నింగి, నేలా మాదేనంటూ ఆటంకాలను, ఆంక్షలను ఎదిరిస్తూ దుసుకుపోతున్నారు. కంటికి నిపించని అద్దాల గోడలు వారి అభివృద్ధిని నిరోధిస్తూనే ఉన్నాయి. శాస్త్ర సాంకేతిక రంగాల్లో నిర్ణాయక పదవుల్లో వారి శాతం 1020గానే ఉంటున్నది. వైద్యం, సేవ తదితర రంగాల్లో సంఖ్యాపరంగా అధికమైనా నేతృత్వ స్థాయికి చేరడంలో వివక్షకు గురవుతూనే ఊన్నారు. మహిళ సాధికారతలో 1518 సంవత్సరాల వయసు అమ్మాయిలు 40 శాతం వరకు చదువును మధ్యలోనే ఆపేస్తున్నారు. జాతీయ కుటుంబ సర్వే ప్రకారం ప్రపంచ అక్షరాస్యత రేటు భారత దేశంలో స్త్రీలు 70.3 శాతం ఉంది. అంగన్ వాడీలు, ఆశా వర్కర్లు, ఐకేపి, కాంట్రాక్ట్,

కేజీబీవి టీచర్లు, ఔట్ సోర్సింగ్ పేరుతో చాలామంది శ్రమదోపిడీకి గురవుతున్నారు. ''ఆకాశంలో సగం... అవనిలో సగం.. సమాజంలో సగం" అన్నట్టు నేడు మహిళలు రెండవ శ్రేణి పౌరులుగానే పరిగణించబడుతున్న తరుణంలో హక్కుల కోసం ఉద్యమిస్తున్న ఘట్టాలు ఒక భాగమైతే, జీవించే హక్కును సైతం కాలరాస్తూ ప్రజాస్వామ్యంలో రాజ్యాంగాన్ని పరిహాసం చేసే విధంగా లైంగిక వేధింపులు, యాసిడ్ దాడులు, ప్రశ్నిస్తే పనిష్మెంట్లు నానాటికి పెరుగుతున్నాయి. బిల్కిస్ బానో రేప్ కేసులో నేరస్తులకు క్షమాభిక్ష పెట్టి సన్మానించడం, దేశానికి ప్రతిష్ఠాత్మక పథకాలు సాధించిన మహిళా రెజ్లర్ల ఆక్రందనలు, మణిపూర్ మారణహోమం.. ఇలాంటివి జరుగుతున్నా పాలకవర్గాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం మనల్ని మళ్లీ మనువాద ప్రమాదపుటంచులకు నెట్టి వేస్తున్నట్టు స్పష్టమౌతున్నది. ఆయా రంగాల్లో మొదటి స్థానంలో చెప్పుకోదగిన మహిళలెందరో ఉన్నారు. ఈ సందర్భంగా వారిని మనం గుర్తుచేసుకోవాలి. మన మొదటి మహిళా ప్రధాని ఇందిరాగాంధీ. ఆనందిబాయి జోషి, ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే, మహిళా దినోత్సవ వ్యవస్థాపకురాలు క్లారా జెట్కిన్, తొలి మహిళా గవర్నర్ సరోజినీ నాయుడు, ఆటో రిక్షా డ్రైవర్ షీలా దావ్రే, ఢిల్లీ నగరంలో బస్సు నడిపిన తెలంగాణ బిడ్డ సరిత.. మెదలైన వారు, నాటినుండి నేటిదాకా ఎందరో మహిళా మణులు వివిధ రంగాల్లో కృషిచేసి మనకు ఆదర్శమూర్తులుగా నిలిచారు. ప్రజాసంక్షేమాన్ని, మహిళా సంక్షేమాన్ని, బాలికల సంక్షేమాన్ని కాంక్షిస్తు, రాజ్యాంగ హక్కులను అములు చేసే దిశగా చట్టాలు చేస్తేనే ప్రస్తుత పరిస్థితులలో మార్పు సాధ్య మౌతుంది. సొంత ఎజెండా అమలుకై చాపకింద నీరులా ప్రత్యామ్యాయ రాజ్యాంగాన్ని రూపొందించేందుకు పాలకులు సిద్ధమౌతున్న పరిస్థితి కానిపిస్తున్నా పౌర సమాజం గుర్తించలేకపోవడం గమనార్హం! నేడు మతంకళ్ళతో మనుషులను చూస్తూ, విడదిస్తూ వివాదాలు సృష్టిస్తున్న పాలకులు మహిళలను మనువాద దృష్టితోనే చూస్తున్నారు. దేశ ప్రజలంతా సమానులేనన్న భారత రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తూ మతధర్మాన్ని, మనుధర్మాన్ని బోధిస్తున్నారు. సామాన్యులు, ఉన్నత చదువులు చదువుతున్న యువతులు సైతం మతాచార వేడుకల్లో ఇబ్బడిముబ్బడిగా పాల్గొంటున్నారు. పని ప్రదేశాల్లో కూడా ఈ ఆచారాలను విస్తరింపజేస్తూ జనామోదాన్ని పొందుతున్నారు. ఇది ప్రమాదకరమైన పరిస్థితి. మహిళల హక్కులు, బాధ్యతల కోసం జరిపే ఉద్యమాల్లో మహిళల వక్తిత్వాన్ని, వారి క్రియాశీలతను తగ్గించే, ఆంక్షలను విధించే ఆచారాలపై గళమెత్తాలి. శాస్త్రీయ, తార్కిక, హేతువాద దృక్పథాన్ని ప్రచారంచేయాలి. సమాన పనికి సమాన వేతనం, నెలవుతో కాదు "మహిళల హక్కులు మానవ హక్కులేనన్న నినాదం అందరం అందుకోవాలి. "దేశ స్వావలంబన అభివృద్ధిలో మేము సైతం ఉన్నాం.. మా భాగస్వామ్యాన్ని గుర్తించండి" అని ఎలుగెత్తి చాటాలి. స్త్రీ పురుష సమానత్వ సాధనను వేగవంతం చేస్తాం. అందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడతాం" అని పాలకుల చేత ప్రకటింపచేసే స్థాయిలో మన ఉద్యమ కార్యాచరణ ఉండాలి. ఆ దిశగా మనమంతా సంఘటితంగా పయనిద్దామని ఈ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రతినబూనుదాం.

(వ్యాస రచయిత, అధ్యక్షురాలు,
తెలంగాణ జాగృతి మహిళా విభాగం)

మగువకు రక్షణ సమాజానికి శ్రీరామరక్ష

కింజరాపు అమరావతి
9494588909

నేటి నవభారతంలో 'అబల సబల అయిందని' ఆకాశానికెత్తుతున్నా, నిజజీవితంలో అడుగుడుగునా మహిళల ఆశలు అగాధాల్లోనే అణిచివేయబడుతున్నాయి. పురిట్లోనే ఆమె ఎదుగుదలకు అడ్డుకట్ట వేసే పురుషాధిక్య పోకడలు ఒకవైపు, 'ఆడపిల్ల అంటే అప్పుల భారమే' అని కన్నవారే ముఖం చాటేయడం మరొకవైపు సామాజిక విషాదంగా మారాయి. భ్రూణహత్యల నుండి మొదలై, పదుచుదనాన్ని బలిపీఠం చేసే కీచకుల వరకు ప్రతి దశలోనూ వివక్ష ఆమెను ఓ నీడలా వెంటాడుతూనే ఉంది. సమాన పనికి సమాన వేతనం అన్నది కేవలం రాజ్యాంగ హక్కుగానే మిగిలిపోయింది తప్ప, ఆచరణలో అడియాసగానే కనిపిస్తోంది. గడప దాటితే గండమని, ఇంట్లో ఉంటే బందీ అని మదనపడుతున్న మహిళామణికి రక్షణ అన్నది ఎండమావిలా మారింది. అక్షరజ్ఞానం అందని ద్రాక్షలా మారిన పల్లె పడుచులు, ఆకాశమే హద్దుగా ఎదిగినా పదోన్నతుల్లో మాత్రం అడ్డుతగిలే కార్పొరేట్ కొలువులు.. ఇలా స్త్రీ ఉనికి నేటికీ ప్రశ్నార్థకంగానే ఉంది. ఆధునికత ముసుగులో జరుగుతున్న సైబర్ వేధింపుల నుండి మొదలుకొని, కట్నకాసుల కోసం కక్కుర్తి పడే ముసలి మనస్తత్వాల వరకు అన్నీ స్త్రీ సహనాన్ని పరీక్షించే అగ్నిపరీక్షలే.

ఇంకెన్నాళ్ళు ఇలా ?

ఎంత కాలమిలా మహిళా చైతన్యం 'అడవిలో కాసిన వెన్నెల'లా వృథా కావాలి? ఏదో ఒక అన్యాయం జరిగినప్పుడు "చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్నట్లు" స్పందించడం కాకుండా, ఆ అన్యాయం జరగకుండా చూసే సామాజిక బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. సమాజపు రక్తం పీల్చుతున్న ఈ వివక్షను రూపుమాపాలంటే కేవలం చట్టాలు ఉంటే సరిపోదు. అవి బాధితులకు కొండంత అండగా నిలవాలి. అప్పుడే మగువ కళ్లలో ఆనందం, సమాజానికి అసలైన శ్రీరామరక్ష అవుతుంది. స్త్రీ సాధికారత అనేది విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులతోనే సాధ్యపడుతుంది. నేటి చదువులు కేవలం మార్కుల వేటకే పరిమితం కాకుండా, లింగ సమానత్వాన్ని నరనరాల్లో జీర్ణించుకునేలా పాఠ్యాంశాలు రూపుదిద్దుకోవాలి. చిన్నతనం నుంచే "ఆడపిల్ల బలహీనమనే" భావనను తుడిచిపెట్టి, ఆత్మరక్షణ విద్యలనే కవచాన్ని వారికి తొడిగించాలి. విద్యాసంస్థలు కేవలం అక్షరాలు దిద్దించే బదులుగా కాకుండా, ధైర్యాన్ని ఇచ్చే కేంద్రాలుగా మారాలి. ఆడపిల్లల చదువు మధ్యలో ఆగిపోవడానికి కారణమవుతున్న అడ్డంకులను వేళ్లతో సహా పెకిలించి వేయాలి. రాజకీయాల్లో మహిళా రిజర్వేషన్లు కేవలం అలంకార ప్రాయం కాకుండా, వారు నిర్ణయాధికారంలో క్రియాశీలక పాత్ర పోషించేలా పటిష్టమైన యంత్రాంగం ఏర్పాటు కావాలి. పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక చట్టాలు, మొక్కుబడి కమిటీలతో కాలక్షేపం చేయకుండా, కఠినంగా అమలు కావాలి. లింగ వివక్ష చూపే సంస్థల గుండెల్లో రైళ్లు పరిగెత్తించేలా భారీ జరిమానాలు, శిక్షలు అమలు పరచడం అత్యంతావశ్యకం. న్యాయ వ్యవస్థలో సాగతీత ధోరణి ఉండకూడదు. అత్యాచార బాధితులకు న్యాయం చేకూర్చే విషయంలో 'ఫాస్ట్ ట్రాక్' కోర్టులు మెరుపు వేగంతో తీర్పులిచ్చి నేరగాళ్ల వెన్నులో వణుకు పుట్టించాలి. ఆస్తి హక్కుల్లో మహిళలకు సమాన వాటా అన్నది 'అరటిపండు వలిచి చేతిలో పెట్టినట్లు' సులభతరం కావాలి తప్ప, కోర్టుల చుట్టూ ఏళ్ల తరబడి తిరిగే పరిస్థితి రాకూడదు. ముఖ్యంగా సైబర్ వేధింపుల విషయంలో బాధితురాలి గోప్యతను కాపాడుతూ వేటగాళ్లను వేటాడేలా చట్టాలు పదును పెరగాలి.

'కూపస్థమండూకం' కాగూడదు:

సమాజంలో మార్పు అనేది ఆకాశం నుంచి ఊడిపడేది కాదు. అది మన ఇంటి గడప నుండే మొదలవ్వాలి. ఆడపిల్ల పుట్టగానే ముఖం చాటేయకుండా, మహాలక్ష్మి అడుగుపెట్టిందని ఆహ్వానించే సంస్కారం ప్రతి గుండెలో మొలకెత్తాలి. ఇంటి పనుల్లోనూ, పిల్లల పెంపకంలోనూ పురుషులు భాగస్వాములు కావాలి. "ఆడపిల్ల చదువు ఇంటికి వెలుగు" అన్న మాటను కేవలం సూక్తిగా కాకుండా, ఆమెకు ఉన్నత చదువులు చెప్పించి ఆకాశమంత అవకాశాలను అందించడం మన తక్షణ కర్తవ్యం. అప్పుడే ఆమె 'కూపస్థమండూకం'లా కాకుండా, లోకాన్ని శాసించే ధీరవనితగా ఎదుగుతుంది. ఆడపిల్లలను కేవలం అలంకార వస్తువులుగా కాకుండా, ఆలోచనలు పంచుకునే సహచరులుగా గౌరవించడం నేర్చుకోవాలి. సామాజిక మాధ్యమాల్లో స్త్రీల వ్యక్తిత్వాన్ని హననం చేసే వారిని అడ్డుకోవాలి. "ఇల్లు గెలిచి రచ్చ గెలవమన్నారు" పెద్దలు. కాబట్టి మన ఇంటి నుండే ఈ మార్పు మొదలైతే, దేశమంతా నందనవనంలా వికసిస్తుంది. ఈ మార్పు కోసం మనం రేపటి వరకు ఆగకూడదు, ఇప్పుడే అడుగు వేయాలి.

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ ‘ఓపెన్ వాయిస్’కు, సాహిత్య పేజీ ‘బహుళ’కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com
9010223917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

ప్రాంతీయం

కార్పొరేట్ శక్తులతో కుమ్మక్కు

- రైతుల వెన్నెముక విరుస్తున్న ప్రభుత్వాలు
- రైతు వ్యతిరేక బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను తరిమికొట్టాలి
- ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్

ప్రతిపక్షం, నంగునూరు, మార్చి 7: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులతో కుమ్మక్కై రైతు వెన్నెముక విరిచి వేస్తు న్నాయని శాసనమండలి సభ్యుడు, ప్రముఖ గాయకుడు దేశపతి శ్రీనివాస్ ఆరోపించారు. రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నంగునూరు మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం నంగునూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులతో ధర్నా నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ నంగునూరు మండల శాఖ అధ్యక్షుడు అనగోని లింగం గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాకు శాసనమండలి సభ్యుడు, ప్రముఖ గాయకుడు దేశపతి శ్రీనివాస్.. సామాజిక విశ్లేషకులు పాపారావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆచరణ సాధ్యం కాని అడ్డగోలు హామీలతో రైతులను మభ్య అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో విఫలం చెందిందని ఆరోపించారు. రైతు భరోసా పేరిట ఎకరానికి రూ.15 వేల పంట పెట్టుబడి సాయం చేస్తామని చెప్పి మాట తప్పారని విమర్శించారు. ఎన్నికలు వచ్చినప్పుడు రైతు భరోసా ఇస్తూ కాలం గడుపుతున్నారని ఆరోపించారు. వ్యవసాయానికి 24 గంటల కరెంటును కూడా సరఫరా చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమయ్యిందన్నారు. ఇప్పటివరకు రెండు విడతల్లో మాత్రమే రైతు భరోసా గురించి రెండు విడతలు ఎగనామం పెట్టారని ఆరోపించారు. రైతులకు బోనస్ ఇవ్వడంలోనూ విఫలమయ్యారని ఆరోపించారు. సకాలంలో ఎరువులను అందించడంలోనూ నిర్లక్ష్యం వహించారని పేర్కొన్నారు. రుణమాఫీ విషయంలోనూ పూర్తిస్థాయిలో రైతులందరికీ చేయలేదని విమర్శించారు. పంటలకు మద్దతు ధరలను అందించడంలోనూ రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలతో రైతులను ఇబ్బంది పెడుతోందన్నారు.

సమైక్య రాష్ట్రంలోని పరిస్థితులు పునరావృతం

పంట పొలాల్లో ఉండాల్సిన రైతులు రోడ్ల మీద ఉన్నారని దేశపతి శ్రీనివాస్ వాపోయారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో రైతులు ఏనాడు రోడ్ల మీదికి రాలేదని చెప్పారు. సమైక్య రాష్ట్రంలో ఉన్నప్పటి రోజులు రాష్ట్రంలో మళ్ళీ వచ్చాయన్నారు. ఆ రోజులను రేవంత్ రెడ్డి తెచ్చాడని విమర్శించారు. రేవంత్ రెడ్డి రంగు బయట పడుతున్నదని, సమైక్య రాష్ట్రంలో తెలంగాణ రైతులు అష్టకష్టాలు పడ్డారని తెలిపారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు తెలంగాణలో కట్టి ఆంధ్రకు నీళ్లు తీసుకొని పోయింద్రు... ఆ నీళ్లు గుంటూరులో సంపద పెంచిందన్నారు. చాలా రోజులవరకు తెలంగాణ ప్రజలకు గోదావరి ప్రవహిస్తున్న విషయం తెలియని పరిస్థితి ఉండేదన్నారు. సమైక్య రాష్ట్రంలో రైతులు బోర్లు వేసి వేసి అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆనాడు తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఆంధ్రా నాయకుల మోచేతి నీళ్లు తాగుతూ ఉన్నారని తెలిపారు. తెలంగాణ వస్తేనే ఇక్కడి ప్రజల సమస్యలు పరిష్కారం అవుతుందని కేసీఆర్ గులాబీ జెండా ఎత్తి తెలంగాణ ఉద్యమం ప్రారంభించారని తెలిపారు. 14 సంవత్సరాలు మడమ తిప్పని పోరాటం చేసి కేంద్రం మెడలు వంచి తెలంగాణ సాధించారన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత రైతుల కరెంటు సమస్య పరిష్కరించారని తెలిపారు. వ్యవసాయానికి 24 గంటల కరెంటు ఉచితంగా ఇచ్చారని పేర్కొన్నారు. కేసీఆర్ రైతు కేంద్రంగా పనిచేసి పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు. రైతుకు పెట్టుబడి సాయం చేయాలనే ఆలోచన నుంచి పుట్టిందే రైతు బంధు పథకమన్నారు. రూ.72 వేల కోట్లను 11 దఫాల్లో రైతులకు రైతు బంధు సహాయం అందించారని చెప్పారు. చరిత్రలో రైతులకు డబ్బులు ఇచ్చిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ మాత్రమే అని చెప్పారు. రైతు బంధు ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని, తద్వారా కేసీ ఆర్ రైతు ఆత్మ గౌరవం నిలబెట్టారని చెప్పారు. కరోనా సమయంలో కూడా కేసీఆర్ రైతు బంధు అమలు చేశారని గుర్తు చేశారు. మూడు పంటలకు రైతు భరోసా ఇస్తామని గత ఎన్నికలకు ముందు రేవంత్ రెడ్డి ప్రగల్బాలు పలికాడని చెప్పారు. మోస పోవుడు ప్రజల లక్షణం అని చెప్పిన రేవంత్ రెడ్డి చెప్పినట్టే ప్రజలను మోసం చేశాడని విమర్శించారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి, కేంద్రంలో రైతు వ్యతిరేక మోడీ ఇద్దరూ కలిసి రైతులను నట్టేట ముంచుతున్నారని ఆరోపించారు. రైతు వ్యతిరేకి మోదీ, రేవంత్ రెడ్డి లకు ప్రజలు బుద్ధి చెప్పాలని కోరారు. తెరాస మండల పార్టీ అధ్యక్షుడు లింగం గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వేముల వెంకటరెడ్డి, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ రాగుల సారయ్య, మాజీ ఎంపీపీలు దువ్వల మల్లయ్య, జాప శ్రీకాంత్ రెడ్డి, సిద్దన్నపేట ఏఎంసీ మాజీ చైర్మన్ ఎడ్ల సోమిరెడ్డి, పీ ఏ సీ ఎస్ మాజీ చైర్మన్లు ఎల్లంకి మహిపాల్ రెడ్డి, కోల రమేశ్ గౌడ్, రైతుబంధు సమితి మండల మాజీ అధ్యక్షుడు బద్దిపడగ కిష్టారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు చౌదుచర్ల జయపాల్ రెడ్డి, తిరుపతి,నంగునూరు సర్పంచి సనాదుల బాల పోచయ్య, వివిధ గ్రామాల తాజా మాజీ సర్పంచులు, మాజీ ప్రజా ప్రతినిధులు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ తహసీల్దార్ కు వినతి పత్రం అందజేశారు.

సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర కీలకం

- సిద్దిపేటలో ఘనంగా అంతర్జాతీయ
- మహిళా దినోత్సవ వేడుకలు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 7: మహిళల పట్ల గౌరవం, సమానత్వం సమాజంలో పెంపొందాలని అదనపు సివిల్ జడ్జి వేముగంటి తరుణి, డాక్టర్ రాధిక పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ (టీఎన్జీవోస్) సిద్దిపేట జిల్లా మహిళా విభాగం ఆధ్వర్యంలో పబ్లిక్ సర్వెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అదనపు సివిల్ జడ్జి వేముగంటి తరుణి, డాక్టర్ రాధిక, టీఎన్జీవోస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు గ్యాదరి పరమేశ్వర్, జిల్లా కార్యదర్శి కోమండ్ల విక్రమ్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...మహిళా దినోత్సవం కేవలం ఒకరోజు కార్యక్రమాలతో ముగిసిపోకుండా మహిళల పట్ల గౌరవం, మానవత్వం సమాజంలో ప్రతి రోజూ ప్రతిఫలించాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలపై జరుగుతున్న అకృత్యాలను అరికట్టడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.మహిళలు కుటుంబ బాధ్యతలతో పాటు ఉద్యోగాలు నిర్వహిస్తూ ఆర్థిక స్వావలంబన సాధిస్తూ కుటుంబం, సమాజ అభివృద్ధికి కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. మహిళలు ఏ పని చేసినా సమాజానికి ఆదర్శంగా నిలుస్తారని, ఇంటితో పాటు సమాజాన్ని మంచి దారిలో నడిపించే బాధ్యత మహిళలపై ఉందన్నారు. మహిళలు సమాజ సేవలో ముందుండే క్రమంలో తమ ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాలని సూచించారు. ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల సలహాలతో చికిత్సలు తీసుకోవాలని, మహిళ ఆరోగ్యంగా ఉంటే కుటుంబం మరియు సమాజం ఆరోగ్యంగా ఉంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ సహాధ్యక్షులు నిమ్మ సురేందర్ రెడ్డి, కోశాధికారి అశ్వక్ అహ్మద్, మహిళా జిల్లా సభ్యులు వినయ సుకుమారి, అనురాధ, అరుణ, జమున రాణి, సుజాత, శ్వేత, చంద్రకళ, మంజుల, మౌనిక, మానస, జయశ్రీ, పుష్పలత తదితరులు పాల్గొన్నారు. మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరై ఆటపాటలతో కార్యక్రమాన్ని ఆనందంగా జరుపుకున్నారు.

రాజీవ్ యువ వికాసం పథకం అమలు చేయాలి

- డివైఎఫ్ఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 7: రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని వెంటనే అమలు చేసి, రాష్ట్ర బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించాలని డివైఎఫ్ఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు నెలకు రూ.4 వేల నిరుద్యోగ భృతి అందించాలని ఆయన కోరారు. శనివారం సిద్దిపేటలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన మలిదశ ఉద్యమంలో యువత కీలక పాత్ర పోషించిందన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు దాటినా హైదరాబాద్ యూత్ డిక్లరేషన్లో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం యువతకు మోసం చేసినట్టేనని విమర్శించారు. హైదరాబాద్ యూత్ డిక్లరేషన్‌లో భాగంగా అమరవీరుల కుటుంబాలకు నెలకు రూ.25 వేల పెన్షన్ ఇవ్వడం, ఉద్యమకారులపై నమోదైన కేసులను రద్దు చేసి గుర్తింపు కార్డులు ఇవ్వడం, ఏడాదిలో రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయడం వంటి హామీలు ఇచ్చారని గుర్తుచేశారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ బ్యాక్లాగ్ పోస్టులను భర్తీ చేసి ప్రతి ఏడాది జూన్ 2న జాబ్ క్యాలెండర్ విడుదల చేసి, సెప్టెంబర్ 17న నియామక పత్రాలు ఇవ్వాలని ప్రకటించిన విషయాన్ని ప్రస్తావించారు.నిరుద్యోగ యువతకు నెలకు రూ.4 వేల నిరుద్యోగ భృతి, బాసర ఐఐఐటీ తరహాలో నాలుగు ఇంటిగ్రేటెడ్ యూనివర్సిటీలు ఏర్పాటు, యువత సమస్యల పరిష్కారం కోసం యూత్ కమిషన్ ఏర్పాటు, రూ.10 లక్షల వడ్డీ లేని రుణాలు వంటి హామీలు కూడా అమలు కాలేదని ఆయన అన్నారు. సిద్దిపేట జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు స్వర్గం శ్రీకాంత్, జిల్లా సహాయ కార్యదర్శి తడూరి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

- చేగుంట సర్పంచ్ సండ్రుగు స్రవంతి

ప్రతిపక్షం, చేగుంట, మార్చి 7: శ్రీ కృష్ణవేణి పాఠశాల విద్యార్థులు పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని చేగుంట సర్పంచ్ సండ్రుగు స్రవంతి అన్నారు. చేగుంట మండల కేంద్రంలోని శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు ప్రతి ఏట మండల స్థాయిలో నిలవడం గర్వకారణం అన్నారు. పదవ తరగతి ఫలితాల్లో ప్రథమ స్థానంలో నిలిచి పాఠశాలకు గుర్తింపు తేవాలని స్రవంతి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు అయిత పరజ్యోతి మాట్లాడుతూ పాఠశాల డైరెక్టర్ ధ్యాన లింగమూర్తి పులబోయిన నాగరాజు కృషితో పాఠశాల అంచలంచలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ పాఠశాలలో చదివిన విద్యార్థులు ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగాలలో చేరి ప్రత్యేక గుర్తింపు పొందారని స్రవంతి గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ధ్యాన రేణుక డైరెక్టర్ లింగమూర్తి నాగరాజు పాల్గొన్నారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

కాళేశ్వరం నీటితో గ్రామ చెరువు నింపాలని ధర్నా

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 07: సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు గ్రామంలో రైతులు కాళేశ్వరం నీటితో గ్రామ చెరువులను నింపాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు రోడ్డుపై బైఠాయించి తమ పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం గ్రామ చెరువులోకి నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని కోరారు. లేనిపక్షంలో ధర్నాను ఉధృతం చేసి కలెక్టరేట్ ముందు ఆందోళన చేపడతామని హెచ్చరించారు. "తలాపునే గోదారి - మా గ్రామ పంట పొలాలు ఎడారి" అనే నినాదాలతో రైతులు ప్రభుత్వాన్ని వేడుకున్నారు.సిద్దిపేట సమీపంలోని రంగనాయక సాగర్ ఎడమ కాలువ పుల్లూరు గ్రామం నుండి దాదాపు 9 కిలోమీటర్ల దూరంలో ప్రవహిస్తోంది. ఈ కాలువ నిర్మాణం కోసం వందల ఎకరాల పంట పొలాలను రైతులు ప్రభుత్వం ఇచ్చిన పరిహారం తీసుకొని వదులుకున్నారని తెలిపారు. తమ భూములు పోయినా ఇతర రైతుల పొలాలు పచ్చగా మారుతున్నాయి, గ్రామ చెరువులు నిండుతాయని భావించామని చెప్పారు.అయితే ఇప్పటివరకు పుల్లూరు గ్రామ చెరువులోకి చుక్క నీరు కూడా రాకపోవడంతో కాలువ కోసం భూములు కోల్పోయిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ఈ విషయమై ఇరిగేషన్ ఏఈ, డి ఈ , జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మార్వోలకు అనేక వినతిపత్రాలు ఇచ్చినా స్పందన రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.రాజకీయ నాయకులు, అధికారులకు కూడా పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోవడంతో పార్టీలకు అతీతంగా గ్రామ రైతులంతా ఏకమై ధర్నా చేపట్టామని తెలిపారు. మల్లన్నసాగర్ కాల్వ ద్వారా 3ఆర్ కాలువ (ఇరుకోడు - చిన్నగుండెవెల్లి - పుల్లూరు - రామంచ వరకు) ఇప్పటికే మంజూరు అయి ఉందని, ఆ కాలువ పనులను త్వరగా పూర్తి చేసి తమ రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.గత్యంతరం లేకనే ధర్నా చేపట్టాల్సి వచ్చిందని రైతులు పేర్కొంటూ, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

సమస్యల పరిష్కారానికే ప్రగతి ప్రణాళిక

మెదక్ మున్సిపల్ చైర్ పర్సన్ రాధిక

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, మార్చి 07:- మెదక్ పట్టణంలోని ప్రతి వార్డులో సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకే ప్రభుత్వం ప్రజాపాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించిందని మున్సిపల్ చైర్మన్ కానుగు.రాధిక భూపతి రాజ్ తెలిపారు. శనివారం పట్టణంలోని 6,7,8 వార్డుల్లో కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి , అధికారులతో కలిసి పర్యటించారు. వార్డు అధికారులు కౌన్సిలర్లతో కలిసి సమస్యలను గుర్తించి పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రధాన సమస్యలైన డ్రైనేజ్ తడిపొడి చెత్త కార్యక్రమం పై ప్రజలలో చైతన్యం తీసుకురావడానికి ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు.ప్రజలందరి కార్యక్రమంలో భాగస్వాములై పట్టణ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ దొంతి నరేష్‌గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్ హరిత, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ అంశాలపై అవగాహన పెంచుకోవాలి

సిద్దిపేట డీఈవో శ్రీనివాసరెడ్డి

ప్రతిపక్షం ప్రతినిధి, సిద్దిపేట, మార్చి 7 : అంతర్జాతీయ విషయాలపై అవగాహన పెంచడం కోసం నమూనా ఐక్యరాజ్య సమితి కార్యక్రమం ఉపయోగపడుతుందని సిద్దిపేట జిల్లా విద్యాధికారి ఎల్లెంకి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సిద్దిపేట జిల్లా పాఠశాల విద్యాశాఖ, జిల్లా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో జిల్లాలోని పి.ఎం.శ్రీ పాఠశాలలకు చెందిన 8, 9 తరగతుల విద్యార్థులు శనివారం జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో నమూనా ఐక్యరాజ్యసమితి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిద్దిపేట జిల్లా విద్యాధికారి ఎల్లంకి శ్రీనివాసరెడ్డి, పాఠశాల విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి ముంద్రాతి రమేశ్, జిల్లా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం అధ్యక్షుడు మామిడి పూర్ణచందర్ రావు , గౌరవ అధ్యక్షుడు మామిడి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈవో ఎల్లంకి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు నమూనా ఐక్యరాజ్యసమితి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నతస్థాయి ఉద్యోగాలు చేస్తూ, ఐక్యరాజ్యసమితిలో ఉద్యోగాలు చేసే విధంగా, ఐక్యరాజ్య సమితిలో మాట్లాడే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పాఠశాల స్థాయిలో నిర్వహించిన నమూనా ఐక్యరాజ్యసమితి కార్యక్రమాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు చొప్పున పాల్గొని వివిధ దేశాల ప్రతినిధులుగా వ్యవహరించారు. ఆర్థిక, సామాజిక, విద్యాపరమైన అంశాలపై వివిధ దేశాల ప్రతినిధులు వలే విద్యార్థులు నమూనా ఐక్యరాజ్యసమితిలో ప్రసంగించారు. ఐక్యరాజ్య సమితిలోని జనరల్ అసెంబ్లీ, యూనిసెఫ్, యునెస్కో, మొదలైన సంస్థల ప్రతినిధులుగా విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచారు. విద్యార్థులు పూర్తిగా ఇంగ్లీషులోనే మాట్లాడారు. వీరిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 11 మంది విద్యార్థులను హైదరాబాదులో జరిగే రాష్ట్రస్థాయి నమూనా ఐక్యరాజ్య సమితికి నామినేట్ చేయనున్నారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు అష్రఫ్ అలీ వ్యవహరించారు. నమూనా ఐక్యరాజ్యసమితిలో పాల్గొన్న పలువుర్ విద్యార్థులు మాట్లాడుతూ జిల్లాస్థాయి నమూనా ఐక్యరాజ్యసమితిలో పాల్గొనడం తమలో ఆత్మ విశ్వాసాన్ని పెంచిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.చంద్రమౌళి, జిల్లా ఆర్థిక కార్యదర్శి ఎర్రన్నగారి రాంగోపాల్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు అన్నపూర్ణ, సమ్మయ్య, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు పబ్బతి శ్రీనాకర్ రెడ్డి, నీరజ, రాజయ్య, కవిత, మంజుల, పరశురాములు, రవీందర్ రెడ్డి, వివిధ పాఠశాలల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే మంచి ఫలితాలు

సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్

ప్రతిపక్షం,మెదక్ టౌన్, మార్చ్07: విద్యార్థులు కష్టపడి చదివి పదవ తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని శ్రీసత్యసాయి సేవా సమితి మెదక్ జిల్లా అధ్యక్షులు. శిరీగే ప్రభాకర్ అన్నారు.శనివారం హవేలీ ఘనపూర్ ఘనపూర్ మండల పరిధిలో కూచన్ పల్లిలో పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో భగవాన్ శ్రీ సత్య సాయి సేవ సమితి మెదక్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్వామి వారి శత జయంతి ఉత్సవాలు పురస్కరించుకొని పదవ తరగతి విద్యార్థులకు 103 పరీక్ష ప్యాడ్ లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయాన మాట్లాడుతూ..ఈనెల 14వ తేదీ నుండి ప్రారంభం కానున్న పదవ తరగతి వార్షిక పరీక్షలు రాయబోతున్న విద్యార్థులు అందరూ కూడా ఒక ప్రణాళిక బద్ధంతో చదివి ,పరీక్షా హాల్లో ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా కఠినమైన విషయాలపై దృష్టి సాధించాలని అన్నారు. ఉపాధ్యాయులు చెప్పిన విషయాలన్నిటిని మరొకసారి ఉదయం వేళ బాగా ప్రాక్టీస్ చేస్తూ పరీక్షల్లో సులభమైన ప్రశ్నలు ముందుగా రాసి అక్షర దోషాలు లేకుండా చూసుకోని, మంచి ఫలితాలతో ఉత్తీర్ణత సాధించాలని పేర్కొన్నారు.ఈ నెల రోజులపాటు విద్యార్థులందరూ కూడా మొబైల్ ఫోన్ లకు,టీవీలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాచారం మధుమోహన్ మాట్లాడుతూ.. విద్యార్థులందరూ మంచి ఫలితాలు సాధించి 100% రిజల్ట్ వచ్చే విధంగా ఈ నెల రోజులు కష్టపడాలని అన్నారు. పదో తరగతి వార్షిక పరీక్షలు ఫలితాల్లో మన పాఠశాల జిల్లాలోనే అగ్రస్థానంలో ఉండే విధంగా కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మెదక్ సత్యసాయి సేవా సమితి సభ్యులు నగేష్ మరియు మోటివేషన్ ఊరటి. నరసింహులు, పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు శివరాజ్ పంతంగి,శ్రీనివాస్ ,ఎల్ మల్లారెడ్డి, కొండల్ రెడ్డి,ఎల్లం, రాజు , వినోద్, సంతోషి కుమారి ,శ్రీనివాస్,శశి కుమార్,కృష్ణవేణి,చక్రపాణి,శశి కుమార్ రెడ్డి,రాజేందర్ రెడ్డి, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

బెంగాల్‌లోని టీఎంసీ ప్రభుత్వం తీరు ఏమాత్రం సరైనది కాదు. గిరిజన సామాజిక వర్గానికి చెందిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును అవమానించేలా బెంగాల్ యంత్రాంగం వ్యవహరించడం సిగ్గుచేటు. ఇది ప్రజాస్వామ్యానికే విఘాతం. సంతాల్ సంస్కృతిని టీఎంసీ ప్రభుత్వం చాలా చులకనగా చూస్తోంది. రాష్ట్రపతి కార్యాలయం రాజకీయాలకు అతీతం.. ఆ పదవికి ఉన్న పవిత్రతను గౌరవించాలి.

- ప్రధాని నరేంద్ర మోడీ

ప్రాంతీయం

'ప్రగతి ప్రణాళిక'ను పకడ్బందీగా అమలు

మెదక్ కలెక్టర్ ప్రతిమా సింగ్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్,మార్చి 07: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళికా కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ నగేష్, ఏవో యూనస్, కలెక్టరేట్ కార్యాలయ సూపరిండెంట్లు రెవిన్యూ సిబ్బందితో కలిసి కార్యాలయ సెక్షన్లను కలెక్టర్ పరిశీలించారు.. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రెండో రోజులో భాగంగా కలెక్టరేట్ లో నిర్వహించిన పరిశుభ్రత ఫైళ్ళ క్రియారెన్స్ కార్యక్రమంలో పాల్గొనడం జరిగిందని ప్రభుత్వ కార్యాలయాలలో పెండింగ్ లో ఉన్న పైళ్ల క్లియరెన్స్, వేగంగా పూర్తి చేయాలని హితవు పలికారు.మార్చి 6 నుంచి జూన్ 12వ తేదీ వరకు వరకు 99 రోజుల కార్యచరణ రూపొందించడం జరిగిందని, క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో కార్యచరణ అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలలో పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించడం, ప్రభుత్వ కార్యాలయాలలో పెండింగ్ లో ఉన్న పైళ్ల క్లియరెన్స్, ఆరోగ్యం, అరైవ్ అలైవ్, సంక్షేమం, పిల్లలు భద్రత, వ్యవసాయం, విద్య, యువత, మహిళలు, పర్యావరణం తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసి దశల వారీగా పూర్తి చేయాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో, కళాశాలలో విద్యార్థుల సంఖ్యను పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వేసవి దృష్ట్యా త్రాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, చిన్న సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత సెక్షన్ సూపర్ ఇండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

యువతే దేశ భవిష్యత్తు

- మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి
- అదనపు ఎస్పీ మహేందర్

ప్రతిపక్షం, మెదక్ టౌన్, మార్చ్ 07 : దేశ భవిష్యత్తును నిర్మించే శక్తి యువతలోనే ఉందని మెదక్ జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ అన్నారు.శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ -2026 కార్యక్రమంలో భాగంగా "50 ఇయర్స్ అఫ్ ఎమర్జెన్సీ - లెసన్స్ ఫర్ ఇండియన్ డెమోక్రసీ " అంశంపై జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు ఎస్పీ మహేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమని పేర్కొన్నారు.ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి రాజ్యాంగ విలువలు, ప్రజల హక్కులు, బాధ్యతలను ప్రతి పౌరుడు గౌరవించాలని సూచించారు. 1975లో అమలైన ఎమర్జెన్సీ భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఒక ముఖ్యమైన ఘట్టమని, ఆ కాలం దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు అనేక పాఠాలు నేర్పిందన్నారు.యువత దేశ చరిత్ర, రాజ్యాంగం, ప్రజాస్వామ్య విలువలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.యూత్ పార్లమెంట్ వంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, వాక్చాతుర్యం,చర్చా నైపుణ్యాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.సమాజ సమస్యలపై చర్చించి పరిష్కార మార్గాలను అన్వేషించే అవకాశాన్ని ఇలాంటి కార్యక్రమాలు కల్పిస్తాయని అన్నారు. భవిష్యత్తులో దేశ అభివృద్ధికి యువత చైతన్యంతో ముందుకు రావాలని ఆకాంక్షించారు.అదేవిధంగా విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ వాహనం నడిపేటప్పుడు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ ధరించడం, కారులో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ వినియోగించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చన్నారు. యువత డ్రగ్స్ మరియు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్, అధ్యాపకులు, విద్యార్థులు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఐ సెట్, పోటీ పరీక్షలపై అవగాహన సదస్సు

ప్రతిపక్షం, మెదక్ టౌన్, మార్చ్ 07: మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం అర్థమెటిక్ అండ్ రీజనింగ్ ఫర్ ఐ సెట్,కాంపిటీటివ్ ఎగ్జామ్స్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమం రిసోర్స్ పర్సన్ గా హైదరాబాద్ స్కిల్ సెంటర్ ఫౌండర్ అండ్ ట్రైనర్ మహేష్,శ్రీనివాస్ లు కళాశాలలో చదువుతున్న 200 మంది విద్యార్థులకు చక్కటి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కే హుస్సేన్ మాట్లాడుతూ..అన్ని కాంపిటీటివ్ ఎగ్జామ్స్ కి క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ చాలా ముఖ్యమని అందుకు సులువైన టెక్నిక్స్ టిప్స్ నేర్చుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమం ఆర్గనైజర్ టిఎస్ కె సి కోఆర్డినేటర్,ఇంగ్లీష్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వై ప్రవీణ్ కుమార్, డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ హెచ్ఓడి డాక్టర్ శరత్ రెడ్డి, కెరీర్ గైడెన్స్ అండ్ ప్లేస్మెంట్ సెల్ సభ్యులు డాక్టర్ బి శ్రీనివాస్,మురళి, వేణుగోపాల్,మల్లేష్,టిఎస్ కే సి మెంటార్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట జిల్లా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం నూతన కార్యవర్గం

ప్రతిపక్షం సిద్దిపేట మార్చి 7 : సిద్దిపేట ఇందిరానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో తెలంగాణ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం , (TSSTF) సిద్దిపేట జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన సిద్దిపేట జిల్లా కమిటీ ,డివిజన్ కమిటి లు, మండల కమిటీల ఏర్పాటు చేయడం జరిగింది. సిద్దిపేట జిల్లా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం జిల్లా అధ్యక్షులు గా మామిడి పూర్ణచందర్ రావు, గౌరవ అధ్యక్షులుగా మామిడ్ల లక్ష్మారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా చంద్రమౌళి, జిల్లా ఉపాధ్యక్షులుగా బండి సమ్మయ్య, మహిళా ఉపాధ్యక్షురాలుగా అన్నపూర్ణ, జిల్లా ఆర్థిక కార్యదర్శి గా ఎర్రన్నగారి రాంగోపాల్ రెడ్డి , సిద్దిపేట డివిజన్ కోఆర్డినేటర్ గా రాచకొండ భూపాల్ ,దుబ్బాక డివిజన్ కోఆర్డినేటర్ గా చిప్ప నాగరాజు ,చేర్యాల డివిజన్ కోఆర్డినేటర్ గా గర్నపల్లి ఆంజనేయులు ,హుస్నాబాద్ డివిజన్ కోఆర్డినేటర్ గా ధర్మయ్య ,గజ్వేల్ డివిజన్ కోఆర్డినేటర్ గా చంద్రశేఖర్ ,సాంఘిక శాస్త్ర ఫోరం జిల్లా సలహాదారులు గా మ్యాడ శ్రీధర్ ,పబ్బతి శ్రీనాకర్ రెడ్డి ,భీంరెడ్డి రవీందర్ రెడ్డి , జిల్లాలోని అన్ని మండలాలకు మండల శాఖ అధ్యక్షులు ఎన్నుకోబడ్డారు. ఈ సందర్భంగా ఫోరం జిల్లా అధ్యక్షులు మామిడి పూర్ణచందర్ రావు మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా సాంఘిక శాస్త్ర ఫోరం సాంఘిక శాస్త్ర విషయక పరంగా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తూ, ఉపాధ్యాయులకు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఎస్ సి ఆర్ టి, ఎన్సీ ఈఆర్టీ నిర్వహించే అనేక కార్యక్రమాలలో జిల్లా సాంఘిక శాస్త్రం తనదైన ముద్రను వేసుకుందని అన్నారు. సాంఘిక శాస్త్ర ఫోరం చొరవతో అనేకరకాల టాలెంట్ టెస్టులలో సిద్దిపేట జిల్లా విద్యార్థులు రాష్ట్రస్థాయిలో బహుమతులు గెలుచుకున్నారని తెలిపారు. సాంఘిక శాస్త్ర ఫోరం గౌరవ అధ్యక్షులు మామిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ సీనియర్ ఉపాధ్యాయులు, జూనియర్ ఉపాధ్యాయుల సమ్మిళితంగా సోషల్ టీచర్స్ ఫోరం ఉన్నదని , ప్రమోషన్ పొందిన ఉపాధ్యాయులకు కూడా సాంఘిక శాస్త్ర బోధన మెలకువలను ఫోరం అందిస్తున్నదని భవిష్యత్తులో ఇంకా వివిధ కార్యక్రమాల ద్వారా ఉపాధ్యాయులకు, విద్యార్థులకు సాంఘిక శాస్త్ర ఫోరం చేరువవుతుందని తెలిపారు. సాంఘిక శాస్త్ర టిఎల్ఎం ను వినూత్న వీధిలో అభివృద్ధి పరిచే కార్యక్రమం జిల్లా సాంఘిక శాస్త్ర ఫోరం నిర్వహిస్తుందని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతను నిర్వహిస్తూ జిల్లా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ,విద్యార్థుల శ్రేయస్సు కోసం అనేక కార్యక్రమాలను చేపడతామని తెలిపారు. డిజిటల్ అభ్యసన పరంగా ప్రతి సాంఘిక శాస్త్ర టీచర్ కు సోషల్ టీచర్స్ ఫోరం తరపున అనేక మెళుకువలు నేర్పే కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. సాంఘిక శాస్త్ర ఫోరం సాంఘిక శాస్త్ర అభ్యసన అభివృద్ధికి ఉపాధ్యాయుల , విద్యార్థుల బోధన అభ్యసన వికాసానికి తోడ్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రధాన కార్యదర్శి గజిటెడ్ ప్రధానోపాధ్యాయులు గుండ వేణుమాధవ్, రిటైర్డ్ ఉపాధ్యాయులు కోదూరి సుధాకర్ , జిల్లా సాంఘిక శాస్త్ర ఫోరం సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయిస్తా..

- మెదక్ ఎంపీ రఘునందన్ రావు

ప్రతిపక్షం, నంగునూరు, మార్చి 7: నంగునూరు మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాలలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయిస్తానని మెదక్ పార్లమెంటు సభ్యుడు మాధవనేని రఘునందన్ రావు అన్నారు. కోకాపేటలోని రఘునందన్‌రావు స్వగృహంలో నంగునూరు మండల బీజేపీ అధ్యక్షుడు చౌడు చెర్ల వెంకట రామిరెడ్డి, బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు పరకాల తిరుపతిరెడ్డి, నంగునూరు మండల కిసాన్ మోర్చా అధ్యక్షులు జీడిపల్లి రజనీకర్ రెడ్డి, సిద్ధన్నపేట గ్రామ ఉప సర్పంచ్ చిలుకల తిరుపతి రెడ్డి, కట్కూరి భూపాల్ రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాలలోని సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

నేటి బాలలే రేపటి పౌరులు

- జిల్లా ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మయ్య

ప్రతిపక్షం, చిన్నకోడూరు, మార్చి 07: నేటి బాలలే రేపటి పౌరులని, పౌరులుగా భవిష్యత్తులో నిర్వహించే విధుల పట్ల విద్యార్థి దశలోని అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ పరీక్షల సిద్ధిపేట జిల్లా సహాయ కమిషనర్ లక్ష్మయ్య అన్నారు. చిన్నకోడూరు మండల విద్యాధికారి తిరుపతి అన్నారు. రామంచ ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తమ తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. జిల్లా కలెక్టర్ గా తనుశ్రీ, డీఈవోగా హారిక, ఎంఈఓ గా యువరాజు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులుగా సహస్ర, ప్రధానోపాధ్యాయులుగా మనుశ్రీ, ఉపాధ్యాయులుగా కీర్తన, అంబిక, అనుశ్రీ, ప్రహర్షిణి, రేవతి, శాన్వి, సమీక్ష, విజ్ఞానేశ్వరి, మోక్షిత, ఆరాధ్య, భాను శ్రీ, నందన, ఇశిక, నంద కిషోర్, దీపక్, శ్రీమాన్, సాత్విక్, రిషికేశ్, యతీశ్, జస్వంత్, శశివర్ధన్, శివతేజ, శివకుమార్, శివప్రసాద్ వ్యవహరించి పాఠశాల విధులను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్, చిన్నకోడూరు ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు లక్ష్మయ్య, చిన్నకోడూరు మండల విద్యాధికారి తిరుపతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మయ్య మాట్లాడుతూ విద్యార్థి దశలో విధుల పట్ల అవగాహన కలిగి ఉంటే భవిష్యత్తులో ఏ కార్యక్రమం అయినా విజయవంతంగా నిర్వహించగలుగుతారని చెప్పారు. చిన్నకోడూరు మండల విద్యాధికారి తిరుపతి మాట్లాడుతూ విద్యార్థి దశలో విధుల పట్ల అవగాహన కలిగితే విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని చెప్పారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని వాటి సాధన కోసం కృషి చేయాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యాంసాని వెంకట సురేష్ కుమార్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సునీత, ఆబెద బేగం, నాగమణి, వరప్రసాద్ యాదయ్య, స్వరూపలు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

కార్యకర్తల కుటుంబాలకు ఏఎంసీ మాజీ చైర్మన్ చేయూత

ప్రతిపక్షం, గజ్వేల్, మార్చి 07 : మండల పరిధిలోని రంగంపేట్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు మంగలి శ్రీనివాస్ ఇటీవల కిడ్నీ సంబంధిత వ్యాదితో, అదేవిదంగా అదే గ్రామానికి చెందిన వడ్ల నర్సింహాచారి గుండెపోటుతో మృతి చెందడంతో విషయం తెలుసుకున్న గజ్వేల్ ఏఎంసి మాజీ చైర్మన్ మదాసు శ్రీనివాస్, శనివారం ఉదయం పరామర్శించారు. వారి మృతి పట్ల ప్రగాఢ సానుభూతితో పాటు ఇరు కుటుంబాలకు ఆర్థిక సహాయం అందివ్వడం జరిగింది. వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్తూ పార్టీ వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. అనంతరం సింగాటం గ్రామానికి చెందిన వంజరి పోచయ్య మరణించగా వారి కుటుంబ సభ్యులు ప్రభాకర్, ప్రసాద్ లను పరామర్శించారు. చిన్న అరెపల్లి గ్రామానికి చెందిన నాంపల్లి మల్లయ్య గుండెపోటుతో మరణించగా వారి కుటుంబాలని సైతం పరామర్శించి విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారి వెంట ఆయా గ్రామాలకు చెందిన బిఆర్ఎస్ సీనియర్ నేతలు మధుసూదన్ రెడ్డి, రమేష్ గౌడ్, అహ్మద్, రంగంపేట్ సర్పంచ్ నాగరాజు, దుర్గ రెడ్డి, కర్నాకర్ రెడ్డి, స్వామి, మనోహర్, సయ్యద్, మల్లేశం, నరేష్, ప్రహ్లాద్, షాదుల్, తదితరులు వెంట ఉన్నారు.

ఎన్నికల హామీలను నిలబెట్టుకుంటున్న సర్పంచ్

- మక్త భూపతిపూర్‌లో జోరుగా అభివృద్ధి పనులు ప్రారంభం
- తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు బోరుబావుల తవ్వకం

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, మార్చి 07 : ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన మక్త భూపతిపూర్ సర్పంచ్ కొమ్ము పవన్ కుమార్ గెలుపొందిన నాలుగు నెలల్లోనే గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటున్నారు. ఎన్నికల సమయంలో గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా నిలబడి గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని ప్రజలకు వాగ్దానాలు ఇవ్వడంతో ప్రజలు ఆయన పై ఉన్న నమ్మకంతో అత్యధిక మెజార్టీతో సర్పంచ్గా గెలిపించారు. దీంతో ఆయన ఎన్నికల హామీలను యుద్ధ ప్రాతిపదికన గ్రామ సమస్యలను ఒక్కొక్క హామీని నెరవేర్చుతూ, గ్రామ ప్రజల నుండి ప్రశంసలు పొందుతున్నాడు. గ్రామంలో ఇప్పటికే సంఘ భవన నిర్మాణం పాఠశాలల ప్రహరి గోడలు తదితర పనులు చేపడుతూ, మరికొన్ని అభివృద్ధి పనులను చేపట్టేందుకు ప్రణాళికలు చేపడుతున్నాడు. అందులో భాగంగా తాజాగా గ్రామంలోని పలు వార్డుల్లో నెలకొన్న త్రాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు తో ఉన్న సాన్నిహిత్యం ద్వారా ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయించి గ్రామంలోని పలు వార్డుల్లో బోరుబావులు త్రవించాడు. వీటిలో పుష్కలంగా నీళ్లు పడడంతో బోర్ బావుల్లో మోటార్లను బిగించి తాగు నీటిని సరఫరా చేసేందుకు సిద్ధమవుతున్నాడు. అయితే గ్రామస్తులు తమ గ్రామ సర్పంచ్ కొమ్ము పవన్ కుమార్ ను ఆదర్శంగా తీసుకొని మిగతా గ్రామాల సర్పంచులు కూడా ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకొని ప్రశంసలు పొందాలని సూచిస్తున్నారు. మండల స్థాయిలో తమ సర్పంచ్ కు ఉత్తమ సర్పంచ్ అవార్డు దక్కేలా జిల్లాస్థాయి అధికారులు తమ సర్పంచ్ ను ప్రోత్సహిస్తూ కృషి చేయాలని మక్త భూపతిపూర్ గ్రామ ప్రజలు కోరుతున్నారు.

తమిళనాడులో మహిళలకు పెద్దపీట వేస్తాం. ప్రభుత్వ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తాం. లేడీస్ కోసం ప్రత్యేకంగా పోలీస్ విభాగం ఏర్పాటు చేస్తాం. పేదలకు ఏటా ఫ్రీగా 6 గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేస్తా. పాఠశాల చిన్నారులకు ఏడాదికి ₹15 వేల ఆర్థిక సాయం అందజేస్తాం. మహిళలకు నెలకు ₹2,500 ఇస్తాం.

- టీవీకే చీఫ్ విజయ్

రైతన్నలను మోసం చేస్తున్న కాంగ్రెస్

పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ బాలనర్సయ్య

ప్రతిపక్షం, గజ్వేల్ (కొండపాక) మార్చ్ 07: రైతన్నలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కిందని కొండపాక పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ మీసాల బాల్ నర్సయ్య విమర్శించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులు వరి నాట్లు వేసి నెలరోజులు గడుస్తున్న ఇప్పటివరకు రైతు భరోసా ఇవ్వలేదని, పంటలకు సరైన సమయంలో కరెంటు మరియు యూరియా అందించడం లో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రైతులకు సకాలంలో రైతు భరోసా, 24గంటల ఉచిత విద్యుత్, రైతు బీమా వంటి పథకాలు అందించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలలో కొన్నింటిని పాక్షికంగా అమలు చేస్తూ మిగతా వాటిని అమలు చేయాల్సింది పోయి 99 రోజుల ప్రణాళిక పేరుతో డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

కౌన్సిలర్ గెలుపు పాదయాత్ర

ప్రతిపక్షం, చేగుంట, మార్చి 7: తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని 12వ వార్డు కౌన్సిలర్ గా గెలుపొందిన కాముని స్వప్న నాగరాజు గౌడ్ చాకరిమెట్ల హనుమాన్ టెంపుల్ వరకు పాదయాత్ర నిర్వహించారు. తూప్రా నుండి తన అనుచరులతో పాదయాత్ర చేపట్టారు. తూప్రాన్ లోని మహంకాళి అమ్మవారు ఆలయం నుండి చాకలిమెట్ల హనుమాన్ టెంపుల్ వరకు పాదయాత్ర నిర్వహించి మొక్కలు చెల్లించుకున్నారు. ఈ పాదయాత్రలో ఆంజనేయులు సహదేవ్ శ్యామ్ మిత్ర బృందం పాల్గొన్నారు. హనుమాన్ టెంపుల్ వద్ద సప్న నాగరాజు గౌడ్ ను సన్మానించారు.

బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతున్న నాచగిరి క్షేత్రం

ప్రతిపక్షం, గజ్వేల్ (వర్గల్), మార్చి 07: నేటి నుండి వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ప్రాంగణంలో జరగనున్న బ్రహ్మోత్సవం, ఉగాది పండుగ రథోత్సవాన్ని పురస్కరించుకొని దేవస్థానం ప్రాంగణాన్ని రంగులతో, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ కార్య నిర్వహణ అధికారి రంగాచారి విలేకరులతో మాట్లాడుతూ స్వామివారి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయని, అంతేకాకుండా భక్తులకు వేసవి వేడితో అసౌకర్యం కలగకుండా నీడ పందిళ్లను, త్రాగే నీరు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గజ్వేల్ తహశీల్దార్‌పై ఏసీబీ దాడులు

- రూ.4 కోట్లకు పైగా ఆస్తులు వెలుగులోకి
- జ్యుడీషియల్ రిమాండ్ విధించిన కోర్టు

ప్రతిపక్షం, గజ్వేల్, మార్చ్ 07: సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండల తహశీల్దార్‌పై ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) శనివారం నాడు సోదా చర్యలు చేపట్టింది. గజ్వేల్ తహశీల్దార్ కామటం శ్రవణ్ కుమార్ తన అధికారిక హోదాను దుర్వినియోగం చేసి అక్రమ మార్గాల్లో ఆదాయానికి మించిన ఆస్తులు సంపాదించినట్లు ఆరోపణలు రావడంతో అధికారులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ఏసీబీ అధికారులు నిందితుడి నివాసంతో పాటు మరో రెండు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో సుమారు 4 కోట్లకు పైగా విలువైన ఆస్తులు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. సోదాల్లో లభ్యమైన ఆస్తుల్లో కరీంనగర్ పట్టణంలో రెండు ఇళ్లు, ఆరు ఫ్లాట్లతో కూడిన ఒక అపార్ట్‌మెంట్, నాలుగు ఖాళీ ప్లాట్లు ఉన్నాయి. వీటి విలువ సుమారు 2.5 కోట్లకు పైగా ఉన్నట్లు అధికారులు అంచనా వేశారు. అదేవిధంగా 30 లక్షల విలువైన ఒక కారు, రెండు ద్విచక్ర వాహనాలు కూడా స్వాధీనం చేసుకున్నారు. ఇంకా సోదాల్లో 11.90 లక్షల నగదు, 4.20 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, 15.66 లక్షల విలువైన గృహోపకరణాలు బయటపడ్డాయి. అయితే ప్రస్తుత మార్కెట్ విలువ ఈ లెక్కల కంటే ఎక్కువగా ఉండే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. అనంతరం నిందితుడుగా పేర్కొన్న తహశీల్దార్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా, కోర్టు జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. ఈ కేసులో తదుపరి విచారణ కొనసాగుతోందని ఎసిబి అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా అవినీతి నిరోధక శాఖ ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి లంచం కోరితే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1064 లేదా వాట్సాప్ నంబర్ 9440446106కు ఫిర్యాదు చేయాలని కోరింది. ఫిర్యాదు చేసిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని ఏసీబీ అధికారులు స్పష్టం చేశారు.

పోలీసులు అంకితభావంతో పని చేయాలి

- ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై సిబ్బందికి అవగాహన
- పరేడ్‌ను పరిశీలించిన అదనపు ఎస్పీ మహేందర్

ప్రతిపక్షం, మెదక్ టౌన్ , మార్చి 07: జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు వచ్చే విధంగా అధికారులు , సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ సూచించారు. శనివారం మెదక్ జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన పరేడ్‌లో అదనపు ఎస్పీ ఎస్ మహేందర్ పాల్గొని, పోలీసు సిబ్బంది అందించిన గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం పరేడ్‌ను పరిశీలించి పోలీసు సిబ్బందికి క్రమశిక్షణ, శారీరక దృఢత్వంపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ...పరేడ్ నిర్వహించడం వల్ల క్రమశిక్షణ, సమయపాలనతో పాటు సిబ్బంది మధ్య సమన్వయం పెరుగుతుందని తెలిపారు. ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది తమ విధి నిర్వహణలో అత్యంత క్రమశిక్షణతో వ్యవహరించాలని సూచించారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ శారీరక మరియు మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న నిర్వహిస్తున్న "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యక్రమం గురించి పోలీసు సిబ్బందికి వివరించారు. ఇందులో భాగంగా ఏప్రిల్ 13 నుండి ఏప్రిల్ 18 వరకు "సురక్షితంగా చేరుకోండి (Arrive Alive)" కార్యక్రమం హోం, రవాణా శాఖల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రోడ్డు భద్రతపై అవగాహన, ట్రాఫిక్ నియమాల అమలు, హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగంపై ప్రత్యేక తనిఖీలు చేపట్టనున్నట్లు చెప్పారు. ఏప్రిల్ 27 నుండి మే 2 వరకు "పిల్లల భద్రత - డ్రగ్స్‌కు నో" కార్యక్రమం పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డియస్పి లు ప్రసన్న కుమార్, రంగా నాథ్, మెదక్ టౌన్ ఇన్స్పెక్టర్ మహేష్, ఆర్ఐ శైలందర్, ఎసై మల్లికార్జున్, ఆర్ఎసై లు సుభాష్, మహిపాల్, భవాని కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్‌ను కలిసిన టీపీసీసీ కార్యదర్శి

ప్రతిపక్షం, చేగుంట, మార్చి 7: తెలంగాణ రాష్ట్ర సంస్కృతిక సారథి చైర్మన్ వెన్నలను టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి యాదగిరి యాదవ్ కలిశారు. మెదక్ జిల్లా నార్సింగి మండలానికి చెందిన యాదగిరి యాదవ్ వివిధ ప్రాంతాల సమస్యలను వివరించారు. కవులకు కళాకారులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా వెన్నెల మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కవులను కళాకారులను గుర్తించి ప్రాధాన్యత కల్పిస్తున్నారని ఆమె పేర్కొన్నారు . బడుగు వర్గాల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరంకు కృషి చేస్తుందన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

- జిల్లా కలెక్టర్ హైమావతి

ప్రతిపక్షం, చేర్యాల, మార్చి 7 : జిల్లాలో గర్భస్థ ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రులలోనే జరగాలని, రోగులకు ఓపికగా మెరుగైన వైద్యం అందిస్తూ వారికి భరోసా ఇవ్వాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆదేశించారు. చేర్యాల పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆకస్మికంగా సందర్శించి రోగులకు అందించే వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక ఆరోగ్య కేంద్రం లోపల అన్ని గదులు తనికి చేశారు. ఇప్పటివరకు ఎంత ఓపి చూశారని మెడికల్ ఆఫీసర్ ఆరా తీశారు. వైద్య పరికరాలు మందులు సమకూర్చుకుని రోగులకు ఎల్లపుడు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం అందించాలని తెలిపారు. మెడికల్ ఆఫీసర్ నుండి కింది స్థాయి సిబ్బంది వరకు సమయవేళలు పాటిస్తూ విధులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఓపి వార్డు మరియు గర్భస్థ మహిళల వార్డులలో మహిళలతో మాట్లాడారు. ఆసుపత్రిలో వైద్యం ఎలా ఉంది డాక్టర్లు ఎలా చూస్తున్నారు అని అడగ్గా బాగానే ఉందని డాక్టర్లు నర్సులు బాగా రెస్పాండ్ అవుతున్నారని రోగులు కలెక్టర్ కి తెలిపారు. పట్టణ పరిధిలోని గ్రామాల్లోని గర్భస్థ మహిళల ఆరోగ్య స్థితి గతులను పర్యవేక్షణ చెయ్యాలని ప్రతి గర్భిణీ ప్రభుత్వ దవాఖానలో ప్రసవం చేసుకోవాలని ప్రైవేట్ ఆసుపత్రికి ఒక్క మహిళ కూడా వెళ్లకుండా పని చెయ్యాలని మెడికల్ ఆఫీసర్ మరియు ఏ ఎన్ ఎం లను ఆదేశించారు. అన్ని జిల్లా జనరల్ ఆసుపత్రులలో అన్ని సదుపాయాలు కల్పించాలని ఎక్కడ కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ డాక్టర్ మరియు సిబ్బంది పైన యాక్షన్ తీసుకోవాల్సిందిగా డిఎంఅండ్‌హెచ్‌ఓ ను ఫోన్ ద్వారా ఆదేశించారు.

హైకోర్టు న్యాయమూర్తులకు స్వాగతం

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట మార్చి 07: సిరిసిల్ల జిల్లా కోర్టు భవన సముదాయం నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి శనివారం వెళ్తున్న సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తులు సిద్దిపేట పట్టణంలో ఆగారు. మార్గమధ్యంలో పట్టణంలోని హరిత మినర్వా హోటల్‌లో అల్పాహారం కోసం ఆగిన హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎన్. తుకారాంజి, జస్టిస్ లక్ష్మణ్, జస్టిస్ వేణుగోపాల్, జస్టిస్ పుల్లా కార్తీక్, జస్టిస్ జె. శ్రీనివాసరావు, జస్టిస్ ఎం. నర్సింగ్ రావు లను జిల్లా జడ్జి సాయి రమాదేవి, జిల్లా అదనపు జడ్జి జయప్రసాద్, జిల్లా కలెక్టర్ కె. హైమావతి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు న్యాయమూర్తులతో కొద్దిసేపు ముచ్చటిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి

ఈప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 07 : విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి అన్నారు. శనివారం సిరికొండ మండలం న్యావనంది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల బాసర విజ్ఞాన విహార యాత్రను ఎమ్మెల్యే ప్రారంభించారు. పార్టీ నాయకులు ఉమ్మాజి నరేష్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన బస్సును ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి ప్రారంభించి విద్యార్థులతో ముచ్చటించారు. ప్రణాళిక బద్దంగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికాకుండా, స్వేచ్ఛాయుత వాతావరణంలో పరీక్షలు రాయాలని తెలిపారు. జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆశీస్సులు విద్యార్థుల పై ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ లను అందజేశారు. ఎమ్మెల్యే వెంట పలువురు నాయకులు, కార్యకర్తలు పాఠశాల సిబ్బంది తదితరులు ఉన్నారు.

ప్రజాప్రతినిధులు మంచి పేరు సంపాదించుకోవాలి

ప్రతిపక్షం చేర్యాల, మార్చి 7: చేర్యాల పట్టణంలోని సుందరయ్య నగర్ లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నూతనంగా గెలిచిన స్థానిక నాయకులకు ప్రజలలో మంచి పేరు సుస్థిరం చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని, మార్చి 6 నుంచి మార్చి 12 వరకు జరిగే ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ లో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొనాలని తెలిపారు. అధికారులు, కౌన్సిలర్ లకు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పారిశుధ్య సంబంధించి చేయాల్సిన పనులు మున్సిపల్ కమిషనర్ మరియు చైర్ పర్సన్ దృష్టికి తీసుకొని వస్తె వెంటనే వాటిని పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. మున్సిపల్ పరిధిలో పెండింగ్ ఫైల్స్ క్లియర్ చెయ్యాలని, ఏ ఫైల్ తిరస్కరించిన స్పష్టమైన కారణం తెలియజేయాలని కమిషనర్ ను ఆదేశించారు. 99 రోజుల కార్యక్రమంలో చివరి వరకు ప్రజా ప్రతినిధులు ఉత్సాహంగా పాల్గోన్నాలని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలని తెలిపారు.

పెండింగ్ భూసేకరణ త్వరగా పూర్తి చేయాలి

- ఆర్ అండ్ ఆర్ కమిషనర్ శివకుమార్ నాయుడు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 07 : దేవాదుల ప్రాజెక్టు పరిధిలో సిద్దిపేట జిల్లాలో పెండింగ్‌లో ఉన్న తపాస్పల్లి బ్యారేజీ భూసేకరణతో పాటు గౌరవెల్లి ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర భూసేకరణ మరియు ఆర్ అండ్ ఆర్ కమిషనర్ శివకుమార్ నాయుడు అధికారులకు సూచించారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఆయన జిల్లా కలెక్టర్ కే. హైమావతి, సిద్దిపేట, హుస్నాబాద్, గజ్వేల్ ఆర్డీవోలు సదానందం, రామ్మూర్తి, చంద్రకళలతో కలిసి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల భూసేకరణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... ఇరిగేషన్ ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేసి పంట పొలాలకు నీటిని అందించడం ద్వారా రైతులకు మేలు చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ పనులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. దేవాదుల ప్రాజెక్టు భాగంగా సిద్దిపేట జిల్లాలో నిర్మిస్తున్న తపాస్పల్లి బ్యారేజీకి అవసరమైన పెండింగ్ భూములను త్వరగా సేకరించాలని, అలాగే హుస్నాబాద్ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసే గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన భూసేకరణను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్, ఆర్డీవోలకు సూచించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

పార్టీ అనుబంధాల కమిటీలు వేయాలి

- డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 07 : జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అనుబంధాల కమిటీలు త్వరగా వేయాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాట్ పల్లి నగేష్ రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా అనుబంధ సంస్థ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా, నియోజకవర్గం, మండలం, గ్రామ కమిటీలు వేయవలసిందిగా పార్టీ అన్ని అనుబంధాల అధ్యక్షులకు సూచించారు. గ్రామ స్థాయి నుండి ఆర్గనైజషన్ ను బలోపేతం చేయవలసిందిగా సూచించారు.b ప్రభుత్వ పథకాలు ఇంటి ఇంటికి చేరవేసే బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ఈ సమావేశంలో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు విపుల్ గౌడ్, జిల్లా RGPRS గంగాధర్ గౌడ్ గారు, జిల్లా yt ఎస్టీ సెల్ అధ్యక్షుడు యాదగిరి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు లింగం, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు సంతోష్ గారు, జిల్లా ఓబీసీ అధ్యక్షుడు రాజా నరేందర్ గౌడ్ పాల్గొన్నారు.

పెద్దమ్మ, పెద్ది రాజుల ఆశీస్సులు ఉండాలి

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

ప్రతి పక్షం, దుబ్బాక, మార్చి 07 : పెద్దమ్మ పెద్ది రాజుల దివ్య ఆశీస్సులు ప్రజల పై ఎల్ల వేళలా ఉండాలని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషను చైర్మెన్ బక్కి. వెంకటయ్య అన్నారు. శనివారం దుబ్బాక మండలంలోని కమ్మర్ పల్లి గ్రామంలో ముదిరాజ్ సంఘ కులస్తుల ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ పెద్దమ్మ పెద్ది రాజుల కళ్యాణ మహోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భూంపల్లి సర్పంచ్ జన్నారెడ్డి, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ జెడ్పిటిసి రవీందర్ రెడ్డి, బీఆర్ ఎస్ నాయకులు కిషన్ రెడ్డి, బాణాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు



ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, మార్చ్ 07 : సిద్దిపేట జిల్లా న్యాయవాది పరిషద్ ఆధ్వర్యంలో జిల్లా అడ్వకేట్ బార్ అసోసియేషన్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా న్యాయవాదులను శాలువాలు, మెమెంటోలతో సత్కరించారు. కార్యక్రమం జాతీయత భావం ఉట్టిపడేలా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది పరిషద్ జిల్లా అధ్యక్షులు రామవరం భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం న్యాయవాది పరిషద్ ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. మహిళా న్యాయవాదులు మరియు యువ న్యాయవాదుల అభివృద్ధి కోసం స్టడీ సర్కిల్ ్‌ను ప్రారంభించి, వారికి నూతన చట్టాలు మరియు చట్టాలపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడ్వకేట్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, జనరల్ సెక్రటరీ రమేష్, సీనియర్ న్యాయవాదులు సాయిబాబా, జనార్దన్ రెడ్డి, శివాజీ గణేష్, మని, పవన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే న్యాయవాది పరిషద్ జిల్లా అధ్యక్షులు రామవరం భాస్కర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ బి. ప్రదీప్ కుమార్, కోశాధికారి బి. రవిప్రసాద్, సెక్రటరీలు శ్రీకాంత్, భాను, కళ్యాణి, నాగపూజతో పాటు పలువురు న్యాయవాదులు హాజరయ్యారు

దేశ చరిత్రలో ఇదే అతిపెద్ద మావోయిస్టు లొంగుబాటు మావోయిస్టు అగ్రనేత గణపతి సహా అజ్ఞాతంలో ఉన్న మిగతావాళ్లంతా జనజీవన స్రవంతిలోకి రావాలి. గణపతి రక్షణ, ఆరోగ్య భద్రత ప్రభుత్వానిదే. లొంగిపోయిన మావోలకు ఆరోగ్య, ఆర్థిక భద్రతకు ప్రభుత్వం తరపున హామీ ఇస్తున్నాం. మావోలు లేవనెత్తిన రాష్ట్ర పరిధిలోని అంశాలను పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

- సీఎం రేవంత్ రెడ్డి

ప్రాంతీయం

సాలూర వద్ద చెక్ పోస్ట్ ఏర్పాటు

• ప్రారంభించిన టీజీఎండీసీ మేనేజింగ్ డైరెక్టర్ భవేష్ మిశ్రా

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 07 : పొరుగు రాష్ట్రాల నుండి ఇసుక అక్రమ రవాణాను పూర్తి స్థాయిలో అడ్డుకునేందుకు వీలుగా తెలంగాణ రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ పకడ్బందీ చర్యలు చేపట్టింది. నిజామాబాద్ జిల్లా సరిహద్దులోని సాలూర వద్ద టీ.జీ.ఎం.డీ.సీ ఆధ్వర్యంలో ఇంటర్ స్టేట్ చెక్ పోస్ట్ ను నెలకొల్పారు. కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ భవేష్ మిశ్రా చెక్ పోస్ట్ ను శనివారం లాంచనంగా ప్రారంభోత్సవం చేశారు. ఈ చెక్ పోస్ట్ వద్ద వేయింగ్ మెషిన్ తో ఇసుక వాహనాల తనిఖీలు నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. తద్వారా అక్రమ ఇసుక రవాణాతో పాటు, ఓవర్ లోడింగ్ ను సైతం నిరోధించేందుకు ఆస్కారం కలిగిందని ఎం.డీ భవేష్ మిశ్రా ఈ సందర్భంగా వెల్లడించారు. ఆన్లైన్ లో బుకింగ్ చేసుకుని మహారాష్ట్ర నుండి నిర్ణీత పరిమాణంలో నిబంధనలకు అనుగుణంగా ఇసుకను తరలించవచ్చని, అయితే సాలూర చెక్ పోస్ట్ వద్ద ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయడం జరుగుతుందని అన్నారు. ఇదివరకు చెక్ పోస్ట్ లేకపోవడం వల్ల ఇసుక రవాణా విషయంలో పలు అక్రమాలు జరిగేవని, ఈసారి అలాంటి వాటికి ఆస్కారం లేకుండా రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన సాలూర వద్ద జిల్లా యంత్రాంగం సహకారంతో ప్రత్యేకంగా చెక్ పోస్ట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీనివల్ల అక్రమ ఇసుక రవాణాను అడ్డుకోవడంతో పాటు తెలంగాణ ప్రభుత్వానికి ఆదాయం సమకూరనుందని తెలిపారు. అంతేకాకుండా ఓవర్ లోడ్ సమస్యను నిరోధించడం ద్వారా రోడ్లు చెడిపోకుండా, రోడ్డు ప్రమాద సంఘటనలు జరగకుండా నిలువరించవచ్చని అన్నారు. అదేవిధంగా నిజామాబాద్ కు సమీపంలోనే మహారాష్ట్ర ఇసుక క్వారీలు ఉన్నందున ఇసుక అవసరమైన వారికి తక్కువ ధరకే ఇసుక లభ్యం అయ్యేందుకు అవకాశం ఉంటుందన్నారు. మంజీరాలో ఇసుక తవ్వకాలకు సంబంధించి సరిహద్దు సమస్య తలెత్తకుండా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో పకడ్బందీ చర్యలు తీసుకున్నామని తెలిపారు. తెలంగాణ భూభాగాన్ని గుర్తిస్తూ స్పష్టంగా సరిహద్దులు ఏర్పాటు చేశామని అన్నారు. ఇసుక అక్రమ రవాణా విషయంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తోందని, ఇటీవల కలెక్టర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలోనూ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఇసుక అక్రమ రవాణాను పూర్తిగా నిరోధించాలని ఆదేశించడం జరిగిందని గుర్తు చేశారు. ఇసుక తవ్వకం, రవాణాలో పారదర్శకత కోసం ప్రభుత్వం ఆన్లైన్ బుకింగ్ విధానాన్ని ప్రవేశపెట్టిందని, ఇప్పటికే నిజామాబాద్ సహా రాష్ట్రంలోని నాలుగు జిల్లాలలో ప్రయోగాత్మకంగా ఈ విధానాన్ని అమలు చేస్తున్నామని ఎం.డీ భవేష్ మిశ్రా గుర్తు చేశారు. ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చెక్ పోస్ట్ నిర్వహణ సజావుగా జరగాలని, గట్టి నిఘాను కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మైనింగ్ ఏ.డీ సంజయ్, ల్యాండ్ అండ్ సర్వే ఏ.డీ అశోక్, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు మృతి

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 07 : నిజామాబాద్ మండలం ముత్తకుంట గ్రామంలో చెట్టుపై నుంచి పడి ఓ గీతా కార్మికుడు అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుడు స్వామి గౌడ్ శనివారం ఉదయం కల్లు దింపడానికి తాటి చెట్టు ఎక్కాడు. ఈ నేపథ్యంలో చెట్టు పైన ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడటంతో అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. సమాచారం అందుకున్న నిజామాబాద్ రూరల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహానికి పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

'సమస్యలకు వెంటనే పరిష్కారం'

ప్రతిపక్షం మంచిర్యాల ఫిబ్రవరి 7 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 30 డివిజన్ 16 53 డివిజన్లో శుభ్రత ప్రతి ఒక్కరి ఆరోగ్య భద్రత కార్యక్రమంలో భాగంగా మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ సాగరం ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు అనంతరం సంబంధిత అధికారులతో మాట్లాడి వారి సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు స్వయంగా ఎమ్మెల్యే చొరవ తీసుకొని డివిజన్ లోని వీధులను తిరుగుతూ అక్కడ ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేశారు ప్రజా పాలన ప్రభుత్వంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అన్వేష్ మేయర్ ధరణి మధుకర్ డిప్యూటీ మేయర్ సల్ల రమ్య మహేష్ కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు మహిళా నాయకురాలు కార్యకర్తలు పాల్గొన్నారు.

మోదీ పాలనలో వేధింపులు పెరిగాయి

• సోషలిస్ట్ పాలనలోనే మహిళల సమస్యల పరిష్కారం
• మహిళలపై పని ప్రదేశాల్లో వేధింపులు ఆగలేదు
• స్త్రీ సమానత్వం కోసం ఐక్యంగా పోరాడాలి
• సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు వీరయ్య

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 07 : మోదీ పాలనలో మహిళలపై వేధింపులు, అత్యాచారాలు, హింస పెరిగిపోతుందని, సోషలిస్ట్ పాలనలోనే మహిళల సమస్యల పరిష్కారం అవుతాయని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. ఈరోజు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సీపీఎం సంగారెడ్డి జిల్లా కార్యాలయం కేవల్ కిషన్ భవన్ లో "కేంద్ర ప్రభుత్వ విధానాలు మహిళలపై ప్రభావం" అంశంపై సెమినార్ సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ మోదీ పాలనలో మహిళల రక్షణకై చేసిన చట్టాలు ఈ పని చేయకుండా ఉన్నాయన్నారు. శ్రామిక మహిళలపై పని ప్రదేశాల్లో నానాటికీ అత్యాచారాలు, హింస పెరుగుతూనే ఉందన్నారు. మహిళలు నేడు అన్ని రంగాల్లో పురుషులకు ధీటుగా పనిచేస్తున్నారన్నారు. భూస్వామ్య భావాల ప్రభావం ఇప్పటికీ కొనసాగుతోందన్నారు. మహిళల శరీరాలను సరుకుగా చూపే విధానాలపై ఐక్యంగా తిరగబడాల్సిన అవసరం ఉందన్నారు. మూఢ విశ్వాసాలు, సాంప్రదాయాల పేరుతో మహిళల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను హరిస్తున్నారన్నారు. ఇదే సంస్కృతిని సినిమాలు, సాహిత్యం, టీవీ సీరియళ్లు ప్రతిబింబిస్తున్నాయన్నారు. ఈ విధానాలను కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి పెంచిపోషిస్తోందన్నారు. దేశాన్ని కుదిపేసిన అత్యంత క్రూరమైన అత్యాచార కేసులైన కథువా, ఉన్నావో, హత్రాస్, బిల్కిస్ బానో ఘటనలలో ప్రభుత్వం బాధితుల పక్షాన కాకుండా నేరస్తుల వైపు నిలిచిందని గుర్తు చేశారు. మణిపూర్ మహిళల మానభంగాల విషయంలోనూ, లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా మహిళా రెజ్లర్లు చేసిన పోరాటాల సమయంలోనూ ప్రధానితో సహా బిజెపి నాయకులు నోరు మెదపలేదని విమర్శించారు. మహిళల కూలీ రెట్లపై కూడా నేటికి వివక్ష చూపించడం సరికాదన్నారు. అనేక చోట్ల శ్రామిక మహిళలకు విశ్రాంతి గదులు, ప్రసూతి సెలవుల, ప్రత్యేక మరుగుదొడ్లు వంటి మానవీయ సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మల్లేశం, రాంచందర్, సాయిలు, నర్సింలు, జిల్లా కమిటీ సభ్యులు ప్రవీణ్, మహిపాల్, నాగేశ్వర్ రావు, యాదగిరి, విద్యా సాగర్, కృష్ణ, న్యాయవాది లక్ష్మీ, మంజుల పాల్గొన్నారు.

“

10వ తరగతి పాసై ఖాళీగా ఉన్న 21 నుంచి 40 ఏళ్ల లోపు యువతీ యువకులకు నెలకు ₹1,500 చొప్పున భృతి ఇవ్వనున్నాం. మార్చి 7 నుంచే దీనిని అమలు చేస్తాం. దాదాపు కోటి మందికి ఈ పథకం కింద ప్రయోజనం చేకూరనుంది. రాష్ట్రంలో నిరుద్యోగిత రేటు 40% తగ్గిందని, లక్షలాది మందికి నైపుణ్య శిక్షణ ఇచ్చాం.

- బెంగాల్ సీఎం మమత

ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని నిరంతరం శ్రమించాలి

• జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి , మార్చి 07 : ఐదు నెలల శిక్షణలో పొందిన నైపుణ్యాలను ఆసరాగా చేసుకుని ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని వాటి సాధన కోసం నిరంతరం శ్రమించాలని జిల్లా కలెక్టర్ పీ ప్రావీణ్య అన్నారు. శనివారం సంగారెడ్డి లోని బీసీ స్టడీ సర్కిల్ లో సివిల్స్, గ్రూప్స్, ఆర్ఆర్బీ, బ్యాంకింగ్ పరీక్షలకు శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు తన నిధులతో ఉచితంగా స్టడీ మెటీరియల్ ను కలెక్టర్ అందజేశారు . ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నోటిఫికేషన్లు ఇప్పుడు వస్తాయో తెలియదు ,కాబట్టి విద్యార్థులు శిక్షణలో పొందిన జ్ఞానానికి అదనపు జ్ఞాన సముపార్జన కోసం స్టడీ మెటీరియల్ దోహదం చేస్తుందన్నారు. తమ సమయాన్ని వృధా చేయకుండా నోటిఫికేషన్ వచ్చిన ప్రతి పరీక్ష కు హాజరై తమ జ్ఞానాన్ని పెంపొందించుకొని తమ లక్ష్యాలను చేరుకోవాలని ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి, బిసి స్టడీ సర్కిల్ డైరెక్టర్, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య, మంచి ఫలితాలపై దృష్టి పెట్టాలి

జాతీయ విద్యా విధానం-2020 లక్ష్యాలకు అనుగుణంగా నాణ్యమైన విద్య, వృత్తి ఆధారిత విద్య అందించాలి,కేంద్ర నోడల్ అధికారి అమన్ శర్మ అన్నారు . సమీకృత కలెక్టరేట్ కార్యాలయ సముదాయ సమావేశమందిరంలో పీఎం శ్రీ పాఠశాలల అమలు పురోగతి పై శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కేంద్ర నోడల్ అధికారి అమన్ శర్మ, జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య , జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు , పి ఎం శ్రీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర నోడల్ అధికారి అమన్ శర్మ మాట్లాడుతూ, జిల్లాలోని పీఎం శ్రీ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగ్గా ఉన్నాయని ప్రశంసించారు. జాతీయ విద్యా విధానం-2020 లక్ష్యాలకు అనుగుణంగా నాణ్యమైన విద్య, వృత్తి ఆధారిత విద్య మరియు జీవిత నైపుణ్యాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రతి విద్యార్థి భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ప్రధానోపాధ్యాయుల పాత్ర కీలకమని కేంద్ర నోడల్ అధికారి పేర్కొన్నారు . ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పీఎం శ్రీ పథకం ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపడుతున్నాయని పేర్కొన్నారు. అయితే విద్యార్థుల నేర్చుకునే స్థాయిలు ,విద్యా ఫలితాలపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ముఖ్యంగా 10వ, 12వ తరగతి విద్యార్థుల ఫలితాలు మెరుగుపడేలా ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు.జిల్లాలో 44 ప్రాథమిక పాఠశాలలు , ఉన్నత పాఠశాలలు మోడల్ స్కూల్స్ లలో పీఎం శ్రీ పథకం అమలు, అమలుచేయడం జరుగుతుందని , పీఎం శ్రీ పథకం అమలు, బడ్జెట్ వినియోగం, విద్యా కార్యక్రమాలు , మౌలిక వసతుల పురోగతి ని కేంద్ర నోడల్ అధికారికి , జిల్లా కలెక్టర్ కి జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు వివరించారు . ఈ సమీక్ష సమావేశంలో రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం డిప్యూటీ డైరెక్టర్ జనార్దన్ రావు, స్టేట్ అకాడమిక్ మానిటరింగ్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ జావిద్, సమగ్ర శిక్ష సంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్లు బాలయ్య, వెంకటేశం, సునీత, కన్నా, తాజుద్దీన్, మాధవి తదితరులు మరియు పీఎం శ్రీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

బీసీ రక్షణ ఆక్ట్ ఏర్పాటు చేయాలని నిరసన దీక్ష

ప్రతిపక్షం మంచిర్యాల ఫిబ్రవరి 7 : బీసీ కులస్తులకు రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ మంచిర్యాల జిల్లా కేంద్రంలోని గాంధీ పార్క్ లో గల గాంధీ విగ్రహం వద్ద శనివారం నిరసన దీక్ష చేపట్టారు రాష్ట్ర ప్రభుత్వం బీసీల సామాజిక రక్షణ భద్రతకై బిసి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ అనంతరం నాయకులు మాట్లాడుతూ బీసీలలో అనేక కులాలు వివక్ష కు గురైనటువంటి కులాలు అనేకమైన సంచార జాతులు అర్ధ సంచార జాతుల కులాలు ఉన్నాయి అన్నారు స్వాతంత్ర్యం వచ్చి 79 ఏళ్లు గడుస్తున్న బీసీలకు రాష్ట్రంలో దేశంలో రక్షణ కరువైందన్నారు బీసీల మహిళలు అత్యాచారాలకు గురవుతూనే వస్తున్నారు అలాగే కొన్ని కులాలను వెలివేసిన సందర్భాలు కూడా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు రాష్ట్రంలో బీసీలపై అనేక దాడులు జరుగుతున్న నేపథ్యంలో బీసీలకు రక్షణ భద్రతకై బిసి రక్షణ చట్టం అత్యవసరం అని పేర్కొన్నారు ఈనెల 16వ తేదీ నుండి ప్రారంభం కాబోయే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో బీసీ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో దేశ వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గుండ్ల శ్రీనివాస్, వెంకటయ్య, లచ్చన్న, అశోక్ రామగిరి రాజన్న చారి చంద్రగిరి చంద్రమౌళి, శ్రీనివాస్, రాజేశం, వేణుగోపాల్ మురళి శేఖర్ అంకం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలనను విజయవంతం చేయాలి

కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, మార్చ్ 7: ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని కామారెడ్డి జిల్లా లోని పెద్ద చెరువు వద్ద శానిటేషన్ ను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పరిశీలించారు. రోజుకో వీధిలో పరిశుభ్రత కార్యక్రమం చేపట్టాలని సూచించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో మొదటి థీమ్ అయిన పరిశుభ్రత, ఫైళ్ళ క్లియరెన్స్ కార్యక్రమంలో భాగంగా రెండవరోజు పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మార్చి, 6 నుండి 15 వరకు నిర్వహించే పరిసరాల పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని అన్ని వీధులు, వార్డులు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాలయాలు పరిశుభ్రం చేసే కార్యక్రమాలు నిర్వహించి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ 99 రోజుల కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని, ప్రతి ఒక్కరు తమ ఇల్లు, తమ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునే విధంగా కృషి చేయాలని తద్వారా రాబోయే వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల నుండి రక్షణ పొందవచ్చన్నారు. ఈ పది రోజుల్లో జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు తమ పరిసరాలను, కార్యాలయాల లోపల పరిశుభ్రంగా చేసుకోవాలని, అంతేకాకుండా కార్యాలయాల్లో పెండింగ్ లో ఉన్న ఫైళ్లు యుద్ధప్రాతిపదికన పరిష్కరించి అట్టి సమాచారాన్ని సంబంధిత లబ్ధిదారులకు తెలియపరచే విధంగా అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలో నిర్వహిస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో వార్డు మెంబర్లు, కౌన్సిలర్ లు పాల్గొనేలా చూడాలని పట్టణ పరిశుభ్రతకు పాటుపడాలని కమిషనర్ ను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమం లో అదనపు కలెక్టర్ మధుమోహన్, ఆర్డీఓ వీణ, తహసిల్దార్ హిమబిందు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు , కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మద్దతు కాదు.. సమానత్వం కావాలి

• గీతం అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో స్పష్టీకరించిన వక్తలు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 07 : మహిళలు సమాజ మద్దతును కాక, పురుషులతో పాటు సమానత్వాన్ని కోరుకుంటున్నట్టు గీతం డీమ్డ్ విశ్వ విద్యాలయం, హైదరాబాదులో శనివారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో వక్తలు స్పష్టీకరించారు. 'లాభం కోసం ఇవ్వండి' (గివ్ టు గెయిన్) అనే ఇతివృత్తంతో గీతం మహిళా సాధికారత సెల్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్యానెల్ చర్చ జరిగింది. ఇందులో వింగ్ కమాండర్లు దుండిగల్ ఎయిర్ ఫోర్స్ యూనిట్ నుంచి స్నేహ సింగ్, బేగంపేట ఎయిర్ ఫోర్స్ యూనిట్ నుంచి సహీనా ఖాన్, అరియటిస్ వ్యవస్థాపకురాలు పరిమళ అలమూరి, గీతం పూర్వ విద్యార్థినిమెర్స్క్ ఇంజనీరింగ్ మేనేజర్ చావలి సుమన వంటి ప్రముఖ వక్తలు పాల్గొన్నారు.చర్చ సందర్భంగా, వింగ్ కమాండర్ స్నేహ సింగ్ మాట్లాడుతూ, మహిళలు తమను సమానంగా చూడాలని, వారి ఆకాంక్షలను నమ్మకంగా కొనసాగించాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. వైమానిక దళంలో చేరాలనే తన నిర్ణయం దృఢ సంకల్పం నుంచి వచ్చిందే తప్ప, ఏదో అవకాశం వచ్చిందని కాదన్నారు. తన కెరీర్ లో లింగ వివక్షను ఎదుర్కొనలేదని, వృత్తిపరంగా తాను రాణించడానికి ఎందరో పురుష మార్గదర్శులు సహకరించినట్టు సుమన తెలిపారు. సాయుధ దళాలలో విజయం సమష్టి కృషి, వృత్తి నైపుణ్యం మీద ఆధారపడి ఉంటాయని, అక్కడి బాధ్యతలు లింగభేదాలను చూడవని వింగ్ కమాండ్ సహీనా ఖాన్ చెప్పారు. విషయ నైపుణ్యం యొక్క ప్రాముఖ్యతను పరిమళ నొక్కి చెబుతూ, జ్ఞానంపై పట్టు గౌరవం, గుర్తింపును పొందుతాయన్నారు. భారతదేశ పురాతన జ్ఞాన వ్యవస్థల నుంచి నేర్చుకోవాలని, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగించి ఆధునిక సందర్భాలకు అనుగుణంగా వాటిని మార్చుకోవాలని ఆమె విద్యార్థులను ప్రోత్సహించారు. భారత వాయుసేనలో మహిళల అభివృద్ధి చెందుతున్న పాత్ర గురించి స్నేహ మాట్లాడుతూ, ఒకప్పుడు ఈ దళం పురుషాధిక్యంలో ఉన్నప్పటికీ, యుద్ధ పైలెట్లుగా, సీనియర్ నాయకత్వ పదవులతో సహా మహిళలు ఇప్పుడు గణనీయంగా రాణిస్తున్నట్టు తెలిపారు. అంకితభావం, క్రమశిక్షణ, స్థితిస్థాపకత వ్యక్తులు లింగంతో సంబంధం లేకుండా సవాళ్లను అధిగమించడానికి వీలు కల్పిస్తాయని ఆమె వ్యాఖ్యానించారు. ప్రేక్షకుల ప్రశ్నలకు ప్యానెలిస్టులు సమాధానమిస్తూ, ప్రజల దృక్పథాలను అర్థం చేసుకోవడం, సమానత్వాన్ని ప్రోత్సహించడం, స్వీయచొరవ ద్వారా విశ్వాసాన్ని పెంపొందించడం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. విద్యార్థులు తమ లక్ష్యాలకు బాధ్యత వహించాలని, ఫలితాలను అందించడంపై దృష్టి సారించాలని ప్రోత్సహించారు. సామర్థ్యం, పనితీరు చివరికి విజయాన్ని నిర్వచిస్తాయన్నారు. ఈ సందర్భంగా, గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డి.ఎస్. రావు మాట్లాడుతూ, గీతం నాయకత్వ పాత్రలలో మహిళలకు పెరుగుతున్న ప్రాధాన్యాన్ని గణాంకాలతో సహా వివరించారు. ఈ కార్యక్రమం మహిళా సాధికారత కమిటీ అధ్యక్షురాలు, సీఎస్ఈ ప్రొఫెసర్ డాక్టర్ ప్రీతి పర్వేకర్ పర్యవేక్షణలో నిర్వహించారు. తెలంగాణ ముఖ్యమంత్రి కప్ పికిల్ బాల్ పోటీలలో మూడు బంగారు పతకాలు గెలుచుకున్న బీఆర్క్ తొలి ఏడాది విద్యార్థిని ఆశ్రిత రాజును సత్కరించారు.

సరైన పాలసీలు, విజన్‌తో- ఎలక్ట్రిక్ మొబిలిటీలో

చైనాతో భారత్ పోటీ పడగలదు

- రాహుల్ గాంధీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, తిరువనంతపురం, మార్చి 7 : సరైన విధానాలు, విజన్‌తో భారత్ ఎలక్ట్రిక్ మొబిలిటీలో చైనాతో పోటీ పడగలదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తెలిపారు. యుద్ధాలు ఎక్కువగా చైనా ఆధిపత్యం చెలాయించే బ్యాటరీ ఆప్టిక్స్, ఎలక్ట్రిక్ మోటార్ల వైపుకు వేగంగా మారుతున్నాయని అన్నారు. కేరళ తిరువనంతపురంలోని టెక్నో పార్క్‌లో ఐటీ ఉద్యోగులతో జరిగిన సమావేశంలో ఈ మేరకు రాహుల్ వ్యాఖ్యానించారు. అలాగే రష్యా ఉక్రెయిన్ యుద్ధం, ఇరాన్ యూఎస్, ఇజ్రాయెల్ మధ్య నెలకొన్న వివాదాలను ఈ సందర్భంగా రాహుల్ ప్రస్తావించారు. "మీరు ఉక్రెయిన్‌కు వెళ్లి యుద్ధభూమిలో ఏమి జరుగుతుందో చూస్తే అసలు విషయం తెలుస్తుంది. సర్క్యులర్ మోషన్‌లో డ్రోన్లు విరుచుకుపడుతున్నాయి. ఇరాన్‌లో సైనికులు బ్యాటరీ ఆప్టిక్స్, ఎలక్ట్రిక్ మోటారుపై ఎక్కువగా ఆధారపడుతున్నారు. ఈ సాంకేతికతలపై చైనా ఆధిపత్యం చెలాయిస్తోంది. అయితే సరైన విధానాలు, విజన్‌తో భారత్ ఎలక్ట్రిక్ మొబిలిటీ సర్క్యులర్ మోషన్‌లో చైనాతో పోటీ పడగలదు" అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. చైనా ప్రపంచంలోనే అద్భుతమైన పారిశ్రామిక వ్యవస్థను నిర్మించిందని, కానీ ఆ పనిని బలవంతంగా, ప్రజాస్వామ్య విరుద్ధంగా చేసిందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అమెరికా, భారత్, ప్రపంచంలోని చాలా దేశాలు వినియోగ రంగంలో దూసుకెళ్తున్నాయని అన్నారు. చైనా పారిశ్రామిక ఉత్పత్తి వైపు దృష్టి సారించిందని తెలిపారు. నిజమైన ఉద్యోగాలు పారిశ్రామిక ఉత్పత్తి రంగంలో ఉన్నాయని అభిప్రాయపడ్డారు.

విశ్వ వీక్షణం

ఒత్తిడి లేని జీవితం కావాలా?

అయితే మధ్యమ మార్గమే పరిష్కారం!

మానవ చరిత్రలో ఉద్భవించిన అత్యంత ప్రభావశీలమైన, హేతుబద్ధమైన తత్వాలలో గౌతమ బుద్ధుడు బోధించిన మధ్యమ మార్గం (The Middle Way) అగ్రస్థానంలో నిలుస్తుంది. ఇది కేవలం 2600 ఏళ్ల క్రితం ఒక బోధి వృక్షం కింద పుట్టిన సిద్ధాంతం మాత్రమే కాదు, ఇది కాలాతీతమైన ఒక జీవన కళ. నేటి 21వ శతాబ్దపు ఉరుకుల పరుగుల జీవితంలో, సాంకేతికత పెరిగి సౌకర్యాలు పెరిగినా, మనిషిలో మానసిక ప్రశాంతత కరువవుతోంది. ఒత్తిడి, ఆందోళన, నిరంతర పోటీ మరియు ఎప్పటికీ తీరని అసంతృప్తితో సగటు మానవుడు కొట్టుమిట్టాడుతున్నాడు. ఇటువంటి క్లిష్ట సమయంలో, బుద్ధుడి మధ్యమ మార్గం ఒక దిక్సూచిలా మనల్ని సరైన దిశలో నడిపిస్తుంది. మధ్యమ మార్గం యొక్క పుట్టుక వెనుక ఒక గొప్ప త్యాగం మరియు అంతర్మథనం దాగి

డాక్టర్ సూర్యదేవర రామకృష్ణ
9490754169

ఉన్నాయి. కపిలవస్తు సామ్రాజ్యానికి కాబోయే రాజుగా, సిద్ధార్థ గౌతముడు సర్వ సుఖాల మధ్య పెరిగాడు. రాజభవనంలో ఆయనకు లేనిది ఏదీ లేదు. కానీ, బయటి ప్రపంచంలోని ముసలితనం, వ్యాధి మరియు మరణం అనే దృశ్యాలు ఆయనను కదిలించివేసాయి. జీవితంలో దుఃఖం ఎందుకు ఉంది? దీనికి పరిష్కారం ఏమిటి? అనే ప్రశ్న ఆయనను వేటాడింది. దీని కోసం ఆయన తన రాజ్యాన్ని, కుటుంబాన్ని వదిలి అడవులకు వెళ్ళాడు. మొదట ఆయన అప్పటి కాలంలో ఉన్న కఠినమైన తపస్సులను ఆచరించాడు. శరీరాన్ని ఎండలో ఎండబెట్టడం, ఆహారం తీసుకోకుండా ఎముకల గూడులా మార్చుకోవడం వంటి తీవ్రమైన శారీరక హింసను అనుభవించాడు. కానీ, ఆరు ఏళ్ల కఠిన సాధన తర్వాత ఆయనకు అర్థమైంది ఏమిటంటే అతిగా సుఖాలలో మునిగిపోవడం వల్ల గానీ, లేదా శరీరాన్ని అతిగా హింసించుకోవడం వల్ల గానీ సత్యం లభించదు.

ఒక వీణ తీగను మరీ గట్టిగా బిగిస్తే అది తెగిపోతుంది, మరీ వదులుగా వదిలేస్తే శబ్దం రాదు, అది సరిగ్గా మధ్యలో ఉన్నప్పుడే మధురమైన సంగీతం పుడుతుంది. ఇదే మధ్యమ మార్గం ఆవిర్భావానికి పునాది. మధ్యమ మార్గం అనేది రెండు తీవ్రతల (Extremes) మధ్య ఉండే సమతుల్యత. బుద్ధుడు దీనిని రెండు ప్రధాన అంశాల ద్వారా వివరించాడుఇది ఇంద్రియ సుఖాల పట్ల అతిగా వ్యామోహం పెంచుకోవడం. భౌతిక వస్తువులు, విలాసాలు మరియు క్షణికానందాల కోసం పరుగెత్తడం వల్ల మనిషికి ఎప్పటికీ తృప్తి లభించదు. ఇది అశాంతికి దారితీస్తుంది. ఇది దీనికి పూర్తి విరుద్ధం. ఆధ్యాత్మికత పేరుతో లేదా క్రమశిక్షణ పేరుతో శరీరాన్ని హింసించడం, మౌలిక అవసరాలను కూడా నిరాకరించడం. ఇది కేవలం శారీరక, మానసిక బలహీనతకు మాత్రమే దారితీస్తుంది. బుద్ధుడు సూచించిన మార్గం ఈ రెండింటికీ భిన్నమైనది. ఇది శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకుంటూనే, మనస్సును నియంత్రణలో ఉంచుకోవాలని చెబుతుంది. శరీరం ఆరోగ్యంగా ఉంటేనే, మనస్సు ప్రశాంతంగా ఉంటుంది, మనస్సు ప్రశాంతంగా ఉంటేనే జ్ఞానోదయం సాధ్యమవుతుంది అనేది ఆయన సందేశం. మధ్యమ మార్గాన్ని ఆచరణాత్మకంగా అమలు చేయడానికి బుద్ధుడు అష్టాంగ మార్గాన్ని ప్రసాదించాడు. ఇది నేటి మేనేజ్మెంట్ పాఠాల కంటే గొప్పది. సమ్యక్ దృష్టి, ప్రపంచాన్ని ఉన్నది ఉన్నట్లుగా చూడటం. మన పక్షపాతాలు, అపోహలు పక్కన పెట్టి వాస్తవాలను గ్రహించడం. సమ్యక్ సంకల్పం, మన ఉద్దేశాలు స్వచ్ఛంగా ఉండాలి. ఇతరులకు హాని చేయకూడదనే దృఢ నిశ్చయం కలిగి ఉండటం. సమ్యక్ వాక్కు, మాట అనేది ఒక ఆయుధం. నిజం మాట్లాడటం, మృదువుగా మాట్లాడటం మరియు వ్యర్థమైన మాటలను మానుకోవడం. సమ్యక్ కర్మం, అహింసను పాటించడం, దొంగతనం చేయకపోవడం మరియు ఇతరుల పట్ల దయతో ప్రవర్తించడం. సమ్యక్ ఆజీవం, మన జీవనోపాధి (Job/Business) ధర్మబద్ధంగా ఉండాలి. ఇతరుల ప్రాణాలకు లేదా సమాజానికి హాని కలిగించే వృత్తుల నుండి దూరంగా ఉండటం. సమ్యక్ వ్యాయామం, ఇక్కడ వ్యాయామం అంటే మనస్సును క్రమశిక్షణలో ఉంచడానికి చేసే ప్రయత్నం. చెడు ఆలోచనలను అడ్డుకుని, మంచి ఆలోచనలను పెంపొందించుకోవడం. సమ్యక్ స్మృతి (Mindfulness), వర్తమాన క్షణంలో జీవించడం. గతం గురించి బాధపడకుండా, భవిష్యత్తు గురించి ఆందోళన చెందకుండా ప్రస్తుతాన్ని స్పృహతో గమనించడం. సమ్యక్ సమాధి, మనస్సును ఏకాగ్రతతో నిలపడం. ధ్యానం ద్వారా అంతర్గత శాంతిని పొందడం. నేడు మనం అతి (Excess) ఉన్న కాలంలో జీవిస్తున్నాం. ప్రతి విషయంలోనూ మనం ఏదో ఒక తీవ్రతకు లోనవుతున్నాం. పని మరియు వ్యక్తిగత జీవితం (Work Life Balance),నేడు కార్పొరేట్ ప్రపంచంలో బర్న్ అవుట్ (Burnout) అనేది పెద్ద సమస్య. కొందరు 1516 గంటలు పని చేస్తూ ఆరోగ్యాన్ని, కుటుంబాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. మరికొందరు బాధ్యతారాహిత్యంగా ఉంటున్నారు. మధ్యమ మార్గం మనకు నేర్పేది ఏమిటంటే పని పట్ల నిబద్ధత కలిగి ఉండాలి, కానీ అది మన వ్యక్తిగత జీవితాన్ని లేదా ఆరోగ్యాన్ని చిన్నాభిన్నం చేయకూడదు. వినియోగ సంస్కృతి (Consumerism), అవసరం లేకపోయినా వస్తువులను కొని కుప్పలు వేసుకోవడం నేటి ట్రెండ్. ఇది మనల్ని అప్పుల ఊబిలోకి, అసంతృప్తిలోకి నెడుతోంది. మధ్యమ మార్గం మనకు సంతోషం అనేది వస్తువులలో లేదు, మన అవసరాలను గుర్తించడంలో ఉంది అని గుర్తు చేస్తుంది. ఉన్నదానితో తృప్తి చెందడం (Contentment) మరియు దురాశకు దూరంగా ఉండటం మధ్య సమతుల్యతే ఈ మార్గం. సోషల్ మీడియా మన జీవితాలను శాసిస్తోంది. గంటల తరబడి ఫోన్లకు అతుక్కుపోవడం ఒక తీవ్రత అయితే, సమాజానికి దూరంగా ఉండటం మరొకటి. డిజిటల్ సాధనాలను మన ఎదుగుదలకు వాడుకోవాలి కానీ, వాటికి బానిసలు కాకూడదు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా డిప్రెషన్, యాంగ్జయిటీ కేసులు పెరుగుతున్నాయి. ఆధునిక సైకాలజీలో ప్రాచుర్యం పొందిన 'Mindfulness' మరియు 'DBT' వంటి పద్ధతులన్నీ బుద్ధుడి బోధనల నుండి ఉద్భవించినవే. మధ్యమ మార్గం అనేది భావోద్వేగాలను అణచివేయడం కాదు, వాటిని అర్థం చేసుకోవడం. కోపం వచ్చినప్పుడు దానిని ప్రదర్శించి ఇతరులను గాయపరచడం ఒక తీవ్రత, ఆ కోపాన్ని లోపల దాచుకుని మనల్ని మనం హింసించుకోవడం మరొక తీవ్రత. మధ్యమ మార్గం ఆ కోపం ఎందుకు వచ్చిందో గమనించి, దానిని ప్రశాంతంగా విశ్లేషించమని చెబుతుంది. నేడు సమాజంలో కులం, మతం, ప్రాంతం లేదా రాజకీయ భావజాలాల పేరుతో తీవ్రమైన ధ్రువీకరణ (Polarization) జరుగుతోంది. నేను చెప్పిందే కరెక్ట్, మిగిలిన వారందరూ తప్పు అనే మొండితనం పెరిగిపోతోంది. మధ్యమ మార్గం సంభాషణను (Dialogue) ప్రోత్సహిస్తుంది. ఎదుటివారి అభిప్రాయాన్ని గౌరవించడం, మధ్యస్థంగా ఆలోచించి పరిష్కారాలు వెతకడం నేటి సమాజానికి ఎంతో అవసరం. తీవ్రవాద భావజాలాల కంటే సమన్వయ భావజాలమే దేశానికి, ప్రపంచానికి శాంతిని ఇస్తుంది. పర్యావరణ సంక్షోభానికి ప్రధాన కారణం మనిషి యొక్క అతి ఆశ. ప్రకృతిని దోచుకోవడం ఒక తీవ్రత అయితే, అభివృద్ధిని పూర్తిగా వదిలేయడం సాధ్యం కాని పని. అందుకే సుస్థిర అభివృద్ధి (Sustainable Development) అనే భావన మధ్యమ మార్గానికి నిదర్శనం. ప్రకృతిని గౌరవిస్తూ, మన అవసరాలను తీర్చుకోవడమే బుద్ధుడు ఆశించిన మార్గం. చాలామంది మధ్యమ మార్గం అంటే ఏ విషయంలోనూ స్పష్టత లేకుండా ఉండటం లేదా సోమరితనంతో రాజీ పడటం అని పొరబడతారు. కానీ అది తప్పు. మధ్యమ మార్గం అంటే అత్యున్నతమైన క్రమశిక్షణ, ప్రేమలో తీవ్రమైన వ్యామోహం ఉండకూడదు, కానీ కరుణ ఉండాలి. పోటీలో అసూయ ఉండకూడదు, కానీ నైపుణ్యం ఉండాలి. న్యాయం కోసం పోరాటంలో ద్వేషం ఉండకూడదు, కానీ ధర్మం ఉండాలి. ఇది ప్రతి క్షణం మనల్ని మనం పరిశీలించుకుంటూ సాగాల్సిన ప్రయాణం. ఇది ఒక సర్కస్ ఫీట్ లాంటిది తాడు మీద నడిచే వ్యక్తి అటు ఇటు పడకుండా ఎలాగైతే నిలకడగా ఉంటాడో, మన జీవితం కూడా అలా ఉండాలి. గౌతమ బుద్ధుడు కేవలం ఒక మత గురువు మాత్రమే కాదు, ఆయన గొప్ప మానసిక శాస్త్రవేత్త మరియు జీవన తత్వవేత్త. ఆయన బోధించిన మధ్యమ మార్గం ఏ కాలానికైనా, ఏ దేశానికైనా వర్తిస్తుంది. జీవితం అనేది ఒక ప్రవాహం. అందులో ఒడిదుడుకులు సహజం. కానీ ఆ ప్రవాహంలో మనం కొట్టుకుపోకుండా ఉండాలంటే సమతుల్యత అనే నావ అవసరం. మనం ఎంత సంపాదించాం, ఎంత పేరు తెచ్చుకున్నాం అన్నది ముఖ్యం కాదు, ఎంత ప్రశాంతంగా ఉన్నాం, ఎంతమందికి ఉపయోగపడ్డాం అన్నదే ముఖ్యం. అతి సర్వత్ర వర్జయేత్ (అన్ని విషయాల్లోనూ అతిని వదిలిపెట్టాలి) అనే భారతీయ సూక్తికి బుద్ధుడి మధ్యమ మార్గం ఒక అద్భుతమైన ఆచరణాత్మక రూపం. నేటి నుండే మన జీవితంలో ఈ సమతుల్యతను అన్వయించుకుందాం. ఆహారంలో మితం, మాటలో హితం, పనిలో శ్రద్ధ, ఆలోచనలో స్పష్టత ఇవే మధ్యమ మార్గం యొక్క మెట్లు. ఈ మార్గంలో పయనిస్తూ, అశాంతి నిండిన ఈ లోకంలో మనం ఒక శాంతి ద్వీపంలా మారుదాం.

బుద్ధం శరణం గచ్ఛామి!

నేపాల్ ఎన్నికల్లో ఆర్ఎస్‌పీ విజయం

ఖాట్మండు: చాలా కాలంగా రాజకీయ అనిశ్చితిని ఎదుర్కొన్న నేపాల్‌లో సాధారణ ఎన్నికలు విజయవంతంగా ముగిశాయి. ఈ ఎన్నికల్లో రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ (ఆర్ఎస్‌పీ) నాయకుడు, రాపర్ రాజకీయవేత్త బాలేంద్ర షా (బాలెన్) ఘనవిజయం సాధించారు. ఝాపా 5 నియోజకవర్గం నుంచి పోటీ చేసిన ఆయన, ప్రధాన ప్రత్యర్థి, నాలుగుసార్లు ప్రధానిగా పనిచేసిన కె పి శర్మ ఓలిని దాదాపు 50,000 ఓట్ల భారీ తేడాతో ఓడించారని అక్కడి ఎన్నికల సంఘం తెలిపింది. శనివారం సాయంత్రం 6 గంటల సమయంలో ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. మొత్తం 78 స్థానాల్లో 62 స్థానాలను ఆర్ఎస్‌పీ గెలుచుకుంది. 35 ఏళ్ల బాలెన్ 68,348 ఓట్లు సాధించగా, ఓలి 18,734 ఓట్లు సాధించారని ఎన్నికల కమిషన్ పేర్కొంది. కాగా, బాలేంద్ర షా గతంలో కాఠ్‌మాండూలో మేయర్‌గా దాదాపు మూడున్నరేళ్ల కాలంలోనే రాజధానిలో అనేక సంస్కరణలు చేపట్టారు. అనంతరం బాలెన్‌గా ప్రసిద్ధి చెందారు. ప్రస్తుతం ఆయన ఆర్ఎస్‌పీ పార్టీ తరపున ప్రధాన మంత్రి అభ్యర్థిగా ఉన్నారు.

నేపాల్ ఎన్నికలు గర్వించదగ్గ క్షణం : భారత ప్రధాని మోదీ

అంతకుముందు, నేపాల్‌లో జరిగిన సాధారణ ఎన్నికలు విజయవంతంగా నిర్వహించినందుకు భారత ప్రధాని నరేంద్ర మోదీ అక్కడి ప్రజలకు, ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. ఈ ఎన్నికలు నేపాల్ ప్రజాస్వామ్య ప్రయాణంలో చారిత్రక మైలురాయిగా అభివర్ణించారు. ఈ మేరకు మోదీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా భారత్, నేపాల్ మధ్య ఉన్న సన్నిహిత సంబంధాల గురించి మోదీ ప్రస్తావించారు. ఇరుదేశాల మధ్య శాంతి, అభివృద్ధి, శ్రేయస్సు కోసం కలిసి పనిచేస్తామని పేర్కొన్నారు. అలాగే నేపాల్‌లో కొత్తగా ఏర్పడే ప్రభుత్వంతో ఒక మిత్రుడి వలే కలిసి పనిచేసేందుకు భారత్ సంసిద్ధంగా ఉందని ఆయన నొక్కి చెప్పారు.

బెంగాల్‌లో రాష్ట్రపతికి అవమానం

- ప్రోటోకాల్ పాటించని మమత సర్కార్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, కోల్ కతా, మార్చి 7: ఉత్తర బెంగాల్‌లో తాను ముఖ్య అతిథిగా హాజరు కావాల్సి ఉన్న అంతర్జాతీయ ఆదివాసీ సమావేశానికి అనుమతి నిరాకరించిన పశ్చిమ బెంగాల్ ప్రభుత్వంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శనివారం అసంతృప్తి వ్యక్తం చేశారు. అంతర్జాతీయ సంథాల్ సమావేశం వేదికను బిధ్ధానగర్ నుంచి గోషాయ్‌పూర్‌కు మార్చడాన్ని ఆమె ప్రశ్నించారు. తనపట్ల మమతా బెనర్జీ అసంతృప్తిగా ఉన్నారా అని ప్రశ్నించిన రాష్ట్రపతి.. తనకు స్వాగతం పలికేందుకు మమత కాని, మంత్రులు కాని ఎవరూ రాలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. తన సిలిగురి సందర్శన సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ తనకు కల్పించాల్సిన ప్రొటోకాల్, ఏర్పాట్లలో కూడా లోపాలు జరిగినట్లు వెల్లడించారు.

అయితే ఇందుకు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై ఎలాంటి కోపం లేదని రాష్ట్రపతి అన్నారు. మమతను సోదరిగా ఆమె సంబోధించారు. బెంగాల్‌లో జరిగిన పరిణామాన్ని సిగ్గుచేటు, అసాధారణంగా ప్రధాని మోదీ అభివర్ణించారు. మమత ప్రభుత్వం అన్ని హద్దులను దాటిందని, రాష్ట్రపతికి జరిగిన ఈ అవమానానికి ప్రభుత్వ పాలకులు బాధ్యత వహించాలని మోదీ స్పష్టం చేశారు.

స్పందించిన మమత

రాష్ట్రపతి పర్యటనలో ప్రొటోకాల్ పాటించలేదన్న విమర్శలపై బెంగాల్ సీఎం మమత స్పందించారు. రాష్ట్రపతి తన పదవి ఔన్నత్యానికి తగని విధంగా ప్రకటనలు చేయవద్దని అభ్యర్థించారు. 'మీరు ఒక కులం గురించి నేడు మాట్లాడారు. బెంగాల్‌లోని ఇతర కులాల గురించి మీరు మాట్లాడలేదు. రాజకీయాలు ఎలా చేయాలో మీకు తెలుసు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతి కోసం మా ప్రభుత్వం చేసిన కృషిని మీకు వివరిస్తాం' అని ఆమె తెలిపారు.

చమురు కొనుగోలు అనుమతి కోసం ఏ దేశంపై ఆధారపడలేదు

- భారత విదేశాంగ మంత్రి జైశంకర్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 7 : రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడానికి అనుమతి కోసం భారత్ ఎప్పుడూ ఏ దేశంపై ఆధారపడలేదని, ఇటీవలి అమెరికా ఆంక్షల మినహాయింపు భారతదేశ ఇంధన విధానాన్ని నిర్ణయించేదిగా కాకుండా కేవలం కొన్ని అడ్డంకులను మాత్రమే తొలగిస్తుందని కేంద్ర ఉన్నతాధికారి ఒకరు శనివారం తెలిపారు. ఇరాన్‌అమెరికా యుద్ధం కారణంగా ఏర్పడిన భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలతో హొర్ముజ్ జలసంధి వద్ద ఏర్పడిన ప్రతిష్ఠంభనతో భారత్ తాత్కాలికంగా 30 రోజుల పాటు రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకోవచ్చునని అమెరికా ఉదారంగా ప్రకటించిన క్రమంలో మోదీ ప్రభుత్వంపై విపక్షాలు, నిపుణులు, మేధావుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో సదరు కేంద్ర ఉన్నతాధికారి స్పందిస్తూ భారత్‌కు ఇచ్చిన మినహాయింపుపై విపక్షాల విమర్శలను తిరస్కరించారు. భారత ఇంధన కొనుగోళ్లు జాతీయ ప్రయోజనాలకు అనుకూలంగా ఉంటాయని తెలిపారు. 'ఎక్కడ చమురు లభ్యమైతే అక్కడి నుంచి భారత్ కొనుగోలు చేస్తుంది. ఇతర దేశాల అనుమతిపై భారత్ ఆధారపడ లేదు' అని ఆ అధికారి స్పష్టం చేశారు. ఇటీవల శ్రీలంక సముద్ర జలాల్లో ఇరాన్ యుద్ధనౌక ఐరిస్ దేనాను అమెరికా నావికా దళానికి చెందిన సబ్‌మెరైన్ దాడి చేసి ముంచివేసిన క్రమంలో ఇరాన్‌కు చెందిన అలాంటి మరో నౌక ఐరిస్ లావన్‌ను తమ కొచ్చి పోర్టుకు అనుమతించిన విషయాన్ని భారత విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ శనివారం నిర్ధారించారు. ఆ నౌకను మానవతా దృక్పథంతో, చట్టపరమైన పరిశీలనతో అనుమతించామని, ఈ విషయంలో భారత్ సరైన పనే చేసిందని ఆయన రైజినా వార్షిక సదస్సులో చెప్పారు. ఇటీవల విశాఖలో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూకు వచ్చిన పలు ఇరాన్ యుద్ధ నౌకలను యుద్ధ వివాదంలోకి లాగారన్నారు. వాస్తవానికి అవి యుద్ధంలో పాల్గొనేందుకు రాకపోయినా ఫ్లీట్‌లో పాల్గొని తిరిగి వెళ్తుండగా చిక్కుల్లో పడ్డాయన్నారు.



ఓటమికి దగ్గర్లో వుమెనిండియా

భారత్‌తో ఏకైక టెస్టుపై ఆస్ట్రేలియా మరింత పట్టు బిగించింది. గులాబీ బంతితో జరుగుతున్న డే అండ్ నైట్ టెస్టు పోరులో కంగారూలు పూర్తి ఆధిపత్యం ప్రదర్శిస్తున్నారు. 125 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్‌కు భారత్ శనివారం ఆట ముగిసే సరికి 6 వికెట్ల నష్టానికి 105 పరుగులకు పరిమితమైంది. లూసీ హామిల్టన్(3/32), అనాబెల్ సదర్లాండ్(2/15) ధాటికి మన అమ్మాయిలు నిలదొక్కుకోలేకపోయారు. పచ్చిక పిచ్‌పై పేస్‌తో చెలరేగిన ఆసీస్ పేసర్లు..వరుస విరామాల్లో వికెట్లు పడగొట్టారు. ప్రతీకా రావల్(43 నాటౌట్) ఆసీస్‌కు ఎదురొడ్డి నిలువగా, మిగతా బ్యాటర్లు మందన(2), షెఫాలీ(5), రోడ్రిగ్స్(14), కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌కౌర్(11), దీప్తి శర్మ(9), రీచా ఘోష్(0) ఘోరంగా విఫలమయ్యారు. ప్రతీకతో పాటు స్నేహ్ రానా(14 నాటౌట్) ప్రస్తుతం క్రీజులో ఉంది. చేతిలో నాలుగు వికెట్లు ఉన్న భారత్ 20 పరుగుల వెనుకంజలో కొనసాగుతున్నది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 96/3తో తొలి ఇన్నింగ్స్‌కు దిగిన ఆసీస్ 323 పరుగులకు ఆలౌటైంది. అన్నాబెల్ సదర్లాండ్(129) సూపర్ సెంచరీతో కదంతొక్కింది. సయాలీ సత్గరె(4/50) నాలుగు వికెట్లతో రాణించింది.

ప్రతిపక్షం
Prathipaksham.in
10
హైదరాబాద్
ఆదివారం
08.03.2026
సినిమా

టీ20 ప్రపంచ కప్ టోర్నీ

నేడు భారత్, న్యూజిలాండ్ తుది పోరు

ప్రతిష్టాత్మక టీ20 ప్రపంచకప్‌లో కీలక సమరానికి రంగం సిద్ధమైంది. అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న క్షణం రానే వచ్చింది. నెల రోజుల నుంచి అభిమానులను అలరిస్తున్న పొట్టి ప్రపంచకప్‌లో ఫైనల్ ఫైట్‌కు సమయం ఆసన్నమైంది. మరికొన్ని గంటల వ్యవధిలో ఆతిథ్య భారత్, న్యూజిలాండ్ మధ్య తుది పోరు జరుగనుంది. 20 జట్ల సమాహారంతో మొదలైన వరల్డ్‌కప్ ఆఖరి అంకానికి చేరుకుంది. డిఫెండింగ్ చాంపియన్ హోదాలో ముచ్చటగా మూడోసారి కప్‌ను ముద్దాడేందుకు సూర్యకుమార్‌యాదవ్ నేతృత్వంలోని టీమ్‌ఇండియా కల సాకారం చేసుకోవాలని చూస్తుంటే.. సుదీర్ఘ కాలంగా అందని ద్రాక్షగానే మారిన వరల్డ్‌కప్ టైటిల్ కోసం కివీస్ చకోర పక్షిలా వేచిచూస్తున్నది. ప్రపంచంలోని రెండు మేటి జట్ల మధ్య పోరు కోట్లాది మంది ఫ్యాన్స్‌ను అలరించడం ఖాయంగా కనిపిస్తుండగా, ఆఖరి పోరాటానికి భారత్, న్యూజిలాండ్ అస్త్రశస్త్రాలతో సిద్ధమయ్యాయి. మెగాటోర్నీలో దక్షిణాఫ్రికా చేతిలో ఓటమి మినహాయిస్తే ఎదురుపడ్డ ప్రత్యర్థినల్లా చిత్తుచేసిన టీమ్‌ఇండియా.. ఫైనల్లోనూ కివీస్ భరతం పట్టాలని చూస్తున్నది. పొట్టి ఫార్మాట్‌లో గత మూడేండ్లుగా తిరుగులేని ఆధిపత్యం చెలాయిస్తున్న భారత్ రికార్డు స్థాయిలో మూడోసారి టైటిల్ ఒడిసిపట్టుకునేందుకు తహతహలాడుతున్నది. సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీలో ఇప్పటి వరకు సిరీస్ కోల్పోని టీమ్‌ఇండియా అదే పంథాను కొనసాగించేందుకు అడుగులు వేస్తున్నది. అయితే కివీస్ రూపంలో బలమైన ప్రత్యర్థి ఉండటం టీమ్‌ఇండియాకు ఒకింత ప్రతికూలంగా కనిపిస్తున్నది. దీనికి తోడు 2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్ అభిమానుల కండ్ల ముందు కదలాడుతున్నది. రోహిత్‌శర్మ కెప్టెన్సీలో అపజయమెరుగని టీమ్‌ఇండియా టైటిల్ ఆశలపై ఆసీస్ నీళ్లు గుమ్మరించిన క్షణాలు ఫ్యాన్స్ మదిలో మెదులుతూనే ఉన్నాయి. అహ్మదాబాద్‌లో నాడు ఎదురైన ఓటమికి ఇప్పటికీ బాధపడుతున్న సగటు అభిమానికి పొట్టి ప్రపంచకప్ విజయం ఊరటనిచ్చేలా ఉండాలని ఆశిస్తున్నారు.



ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

ఫైనల్‌కు చేరిన లక్ష్యసేన్

ప్రతిష్టాత్మక ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత స్టార్ షట్లర్ లక్ష్యసేన్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. శనివారం ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో లక్ష్యసేన్ 2116, 1821, 2115తో విక్టర లై(కెనడా)పై అద్భుత విజయం సాధించాడు. గంటా 37 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన పోరులో లక్ష్యసేన్ అసమాన పోరాటపటిమ కనబరిచాడు. ఎలాంటి అంచనాలు లేకుండా టోర్నీ బరిలోకి దిగిన ఈ యువ షట్లర్ ఎదురైన ప్రత్యర్థినల్లా చిత్తుచేశాడు. 2022లో ఇదే టోర్నీలో రన్నరప్‌గా నిలిచిన సేన్‌కు ఇది రెండో ఫైనల్. ఆదివారం జరిగే టైటిల్ పోరులో చైనీస్ తైపీకి చెందిన వరల్డ్‌నంబర్ 11 షట్లర్ లిన్ చున్ యితో లక్ష్యతలపడనున్నాడు. ఈ పోరులో లక్ష్యసేన్ గెలిస్తే దాదాపు రెండున్నర దశాబ్దాల భారత కల సాకారమైనట్లే. చివరిసారి భారత్ తరఫున గోపీచంద్(2001) ఆల్ ఇంగ్లండ్ టోర్నీ విజేతగా నిలువగా, అంతకముందు ప్రకాశ్ పదుకునే(1980) ఈ ఘనత సాధించాడు. మ్యాచ్ విషయానికొస్తే లక్ష్యసేన్, విక్టర్ నువ్వానేనా అన్నట్లు తలపడ్డారు. ముఖాముఖి పోరులో తలపడటం తొలిసారి అయినా లక్ష్యసేన్ అద్భుత పోరాట పటిమ కనబరిచాడు. తొలి గేమ్‌ను 2116తో కైవసం చేసుకునే క్రమంలో ఈ షట్లర్ పాయింట్ పాయింట్‌కు చెమటోడ్చాల్సి వచ్చింది.

ఏఎఫ్‌సీ మహిళల ఆసియాకప్.. భారత్ ఓటమి

ఏఎఫ్‌సీ మహిళల ఫుట్‌బాల్ ఆసియాకప్‌లో భారత్ ఘోరంగా ఓటమిపాలైంది. శనివారం వార్‌వన్‌సైడ్ అన్నట్లు సాగిన పోరులో భారత్ 011 తేడాతో జపాన్ చేతిలో భారీ ఓటమి చవిచూసింది. మాజీ ఫిఫా చాంపియన్ అయిన జపాన్..మ్యాచ్‌లో భారత్‌పై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. ఏ దశలోనూ భారత అమ్మాయిలకు అవకాశమివ్వని జపాన్ వరుస గోల్స్‌తో విజృంభించారు.జపాన్ తరఫున హినాట (20ని, 35ని, 81ని), యుకి(47ని, 50ని, 65ని) హ్యాట్రిక్ గోల్స్‌తో చెలరేగగా, కికోసికె(45ని, 55ని), యుజుకి (4ని), యుయి (13ని), మాయా హిజికటా(62ని) గోల్స్ చేశారు.

మెగాస్టార్ చిరంజీవికి
ఎన్టీఆర్ జాతీయ చలనచిత్ర పురస్కారం

2025 సంవత్సరానికి గాను ప్రతిష్టాత్మకమైన ఎన్టీఆర్ నేషనల్ ఫిలిం అవార్డు పురస్కారాన్ని మెగాస్టార్ చిరంజీవికి ప్రదానం చేయనున్నారు. ఈ పురస్కారాన్ని తెలంగాణ ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన గద్దర్ అవార్డులలో భాగంగా ప్రకటించింది. భారతీయ సినీ పరిశ్రమకు ఆయన అందించిన విశిష్ట సేవలను గుర్తిస్తూ ఈ గౌరవంతో సత్కరిస్తున్నారు. తెలుగు కమర్షియల్ సినిమాకు కొత్త దిశ చూపించిన హీరోగా చిరంజీవి ప్రత్యేక గుర్తింపు పొందారు. తన అద్భుతమైన నటన, డ్యాన్స్, మాస్ అప్పీల్‌తో ఆయన తరతరాల ప్రేక్షకులను అలరిస్తున్నారు. ఆయన సినీ వారసత్వం భారతీయ సినిమాపై గొప్ప ముద్ర వేసింది. ఈ అవార్డుకు ప్రత్యేకమైన ప్రాధాన్యం ఉంది. ఇది దిగ్గజ కథానాయకుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) పేరు మీద ఇవ్వబడుతుంది. భారతీయ సినిమాను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టిన వ్యక్తులను గౌరవించేందుకు ఈ అవార్డును ప్రదానం చేస్తారు. చిరంజీవి కెరీర్‌లో ఇది మరో గొప్ప ఘట్టం. 2024లో ఆయనకు పద్మ విభూషణ్ పురస్కారం లభించడంతో పాటు, నటుడిగా సాధించిన అద్భుత విజయాలకుగాను గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ గుర్తింపు కూడా దక్కింది. చిన్న చిన్న పాత్రలతో మొదలైన చిరంజీవి ప్రయాణం భారతీయ సినిమా చరిత్రలో అత్యంత ప్రభావశీలమైన నటుల్లో ఒకరిగా ఎదిగే వరకు అద్భుతంగా సాగుతోంది. ఆయన ప్రయాణం ఎంతోమంది కొత్త నటులు, దర్శకులకు ప్రేరణగా నిలుస్తోంది. ఇటీవల చిరంజీవి నటించిన "మన శంకర వర ప్రసాద్ గారు" చిత్రం రిజినల్ ఇండస్ట్రీ హిట్ గా నిలిచింది. ప్రస్తుతం దర్శకుడు బాబీతో ఒక కొత్త చిత్రానికి సిద్ధమవుతున్నారు. అలాగే భారీ ఫాంటసీ ఎంటర్టైనర్ "విశ్వంభర" విడుదల కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

'తండేల్'కు రెండు ప్రతిష్టాత్మక అవార్డులు

బెస్ట్ యాక్టర్ అవార్డు అందుకున్న నాగ చైతన్య – జాతీయ సమగ్రత చిత్రంగా 'తండేల్'



యువ సామ్రాట్ నాగ చైతన్య హీరోగా, చందూ మొండేటి దర్శకత్వంలో తెరకెక్కిన సంచలన బ్లాక్‌బస్టర్ మూవీ 'తండేల్' గద్దర్ అవార్డ్స్ 2025లో రెండు ప్రతిష్టాత్మక అవార్డులు అందుకుంది. ఈ చిత్రంలో నాగ చైతన్య చేసిన అద్భుతమైన నటనకు బెస్ట్ యాక్టర్ అవార్డు లభించగా, అదే సమయంలో ఈ చిత్రం బెస్ట్ నేషనల్ ఇంటిగ్రేషన్ ఫిల్మ్ గా కూడా ఎంపికైంది. ఈ అరుదైన రెండు అవార్డులు నాగ చైతన్య నటనలోని బలాన్ని మాత్రమే కాకుండా, చిత్రానికి ఉన్న సామాజిక ప్రాధాన్యతను కూడా ప్రతిబింబిస్తుంది. విభిన్న పాత్రలను ఎంచుకుంటూ తనదైన ముద్ర వేసుకుంటున్న నాగ చైతన్య 'తండేల్'లో తన కెరీర్‌లోనే అత్యంత ప్రభావవంతమైన నటనను అందించారు. పాత్రలోని నిజాయితీ, సహజత్వాన్ని అద్భుతంగా చూపిస్తూ ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై బన్నీ వాసు నిర్మించిన ఈ చిత్రాన్ని అల్లు అరవింద్ సమర్పించారు. నాగ చైతన్య తన నటనకు రాష్ట్రస్థాయి అవార్డు అందుకోవడం ఇదే మొదటిసారి కావడం విశేషం. భారీ పోటీ మధ్య కూడా ఆయన నటన ప్రత్యేకంగా నిలిచి ఈ గౌరవాన్ని సాధించింది. సరైన కథ, డైరెక్షన్ ఉంటే గ్రామీణ నేపథ్యంలోని పాత్రల్లో కూడా అద్భుతంగా మెప్పించగల నటుడిగా నాగ చైతన్య మరోసారి నిరూపించారు. బెస్ట్ నేషనల్ ఇంటిగ్రేషన్ ఫిల్మ్ గా 'తండేల్' ఎంపిక కావడం కూడా చిత్రంలోని బలమైన సందేశాన్ని ప్రతిబింబిస్తోంది. ఐక్యత, మానవత్వం, సంస్కృతి వంటి అంశాలను స్పృశిస్తూ ప్రాంతీయ పరిమితులను దాటి ప్రేక్షకులతో అనుసంధానమయ్యే కథను ఈ సినిమా చెప్పింది. ముఖ్యంగా జాతీయ పతాకం, సంస్కృతిక మూలాలు వంటి అంశాలను చూపించిన తీరు ఈ పురస్కారానికి కారణమైంది. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గద్దర్ అవార్డ్స్, గతంలో ఇచ్చిన నంది అవార్డులకు ప్రత్యామ్నాయంగా సినీ రంగంలో ప్రతిభను గౌరవించే వేదికగా నిలుస్తున్నాయి. గత సంవత్సరం 'పుష్ప 2' చిత్రానికి అల్లు అర్జున్ అవార్డ్ అందుకున్న తరువాత, ఈసారి 'తండేల్'కు లభించిన రెండు ప్రతిష్టాత్మక అవార్డులు మరింత ప్రత్యేకంగా నిలిచాయి.



'రపప్పా.. రపప్పా'
'రాకాస' పాట విడుదల..

'కమిటీ కుర్రోళ్లు' చిత్రంతో ప్రముఖ నటి, నిర్మాత నిహారిక కొణిదెల ఎన్నో అవార్డుల్ని, రివార్డుల్ని అందుకున్నారు. అలాంటి ఓ అద్భుతమైన సినిమా తరువాత జీ స్టూడియోస్ సమర్పణలో నిహారిక తన పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మాతగా ఉమేష్ కుమార్ బన్సాల్‌తో కలిసి 'రాకాస' మూవీని నిర్మించారు. మానస శర్మ తెరకెక్కించిన ఈ చిత్రంలో సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటించారు. ఈ సినిమాను ఏప్రిల్ 3న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో రిలీజ్ చేసిన 'రాకాస' గ్లింప్స్, టీజర్ అందరినీ ఆకట్టుకున్నాయి. ఇంత వరకు చేసిన ప్రమోషనల్ కార్యక్రమాలు ఆడియెన్స్‌ని ఆకట్టుకున్నాయి. ఇక ఈ టీం మ్యూజికల్ ప్రమోషన్స్‌ని స్టార్ట్ చేసింది. 'రపప్పా.. రపప్పా' అంటూ సాగే ఈ పాట ఎంతో చక్కగా ఉంది. హీరోయిన్ పట్ల హీరోకి ఉన్న ప్రేమ, తనకి బదులుగా వేరే వాడ్ని పెళ్లి చేసుకుంటోన్న తరుణంలో హీరోయిన్ గురించి హీరో చెప్పడం, తన బాధను వివరించడం ఈ పాటలో కనిపిస్తోంది. ఆ బాధని కూడా ట్రెండీ పదాలతో, చాలా ఫన్నీగా చెప్పే ప్రయత్నం చేశారు. అనుదీప్ దేవ్ అందించిన బాణీ, రఘురాం సాహిత్యం, రామ్ మిర్యాల గాత్రం ఈ పాటను మరింత స్పెషల్‌గా మార్చేశాయి. ప్రస్తుతం ఈ పాట మ్యూజికల్ లవర్స్‌ని ఆకట్టుకునేలా ఉన్నాయి. ఈ చిత్రానికి రాజు ఎదురోలు సినిమాటోగ్రఫర్‌గా, ఎడిటర్‌గా అన్వర్ అలీ పని చేశారు. ఈ మూవీ ఆడియో హక్కుల్ని సరిగమ సంస్థ సొంతం చేసుకుంది. ఈ సినిమాని ఓవర్సీస్‌లో అథర్వణ భద్రకాళి పిక్చర్స్, కెనడాలో ప్రత్యంగిరా సినిమాస్ భారీ ఎత్తున రిలీజ్ చేయబోతోన్నారు.

'గద్దర్ అవార్డు 2025'లో సత్తా చాటిన 'దండోరా'

తెలంగాణ ప్రభుత్వం ఏటా ఇస్తున్న ప్రతిష్టాత్మక గద్దర్ అవార్డుల్ని తాజాగా ప్రకటించింది. 2025 సంవత్సరానికి గానూ తెలంగాణ ప్రభుత్వం అత్యుత్తమ చిత్రాల్ని, ఉత్తమ ప్రదర్శనలు ఇచ్చిన నటీనటులకు, సాంకేతిక నిపుణలకు అవార్డుల్ని ప్రకటించింది. ఈ క్రమంలో శివాజీ ప్రధాన పాత్రలో తెరకెక్కించిన 'దండోరా'కి అవార్డు వచ్చింది. సెకండ్ బెస్ట్ ఫీచర్ ఫిల్మ్‌గా 'దండోరా' చిత్రాన్ని ప్రభుత్వం ఎంపిక చేసింది. వైవిధ్యమైన చిత్రాలను నిర్మించి లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత రవీంద్ర బెనర్జీ ముప్పానేని మంచి పేరు సంపాదిచుకున్న సంగతి తెలిసిందే. ఆయన నిర్మాణంలో రూపొందించిన 'దండోరా' చిత్రానికి తాజాగా గద్దర్ అవార్డులు వచ్చాయి. ఈ చిత్రంలో శివాజీ, నవదీప్, నందు, రవికృష్ణ, మనికా చిక్కాల, మౌనికా రెడ్డి, బిందు మాధవి, రాధ్య, అదితి భావరాజు తదితరులు పోషించిన పాత్రలకు మంచి స్పందన వచ్చిన సంగతి తెలిసిందే. ఈ సినిమాకు మురళీకాంత్ రాసుకున్న కథ, చెప్పిన సందేశం ఆడియెన్స్‌ని కదిలించింది. ఇక ఇప్పుడు ప్రభుత్వం ఈ చిత్రానికి పలు కాటగిరీల్లో గద్దర్ అవార్డుల్ని ప్రకటించింది. సెకండ్ బెస్ట్ ఫీచర్ ఫిల్మ్‌గా , శివాజీకి బెస్ట్ సపోర్టింగ్ యాక్టర్‌గా, మార్క్ కె రాబిన్‌కి బెస్ట్ మ్యూజిక్ డైరెక్టర్‌గా మూడు కేటగిరీల్లో 'దండోరా' చిత్రం అవార్డుల్ని కొల్లగొట్టేసింది.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana- 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana- 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200